శనివారం
28•12•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 183
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE







ఎక్కువ ఆందోళన కలిగించేది
## నిరుద్యోగమే!
పట్టణప్రాంత భారతీయుల్లో సగంమంది మాట ఇదే
దేశం సరైన దిశలోనే పయనిస్తున్నదన్న 69% ప్రజలు
'ఇప్సోస్' తాజా సర్వేలో వెల్లడి
9

## ముగిసిన మిగ్-27 ప్రస్థానం


5

మూడు దశాబ్దాలపాటు
సేవలందించిన యుద్ధ విమానాలు
ఎగిరే శవపేటికగా విమర్శలు



## రష్యా అమ్ములపొదిలో 'అవాన్‌గార్డ్' క్షిపణి
వేగం గంటకు 33,000 కి.మీ.
ధ్వని వేగం కంటే 27 రెట్లు అధికం
ఆ దేశ సైన్యంలో తొలి హైపర్‌సోనిక్ మిస్సైల్
5

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD


శుక్రవారం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహించిన ఎట్‌హోం కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

# ముగిసిన రాష్ట్రపతి విడిది

నేటి ఉదయం ఢిల్లీకి రామ్‌నాథ్ కోవింద్

బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోం కార్యక్రమం

హాజరైన గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్, ఇతర ప్రముఖులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ హైదరాబాద్‌లో శీతాకాల విడిది ముగిసింది. ఈ నెల 20న నగరానికి వచ్చిన ఆయన శనివారం ఉదయం తిరిగి ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాష్ట్రంలోని పలువురు ప్రముఖులకు రాష్ట్రపతి తేనేటి విందు ఏర్పాటుచేశారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో జరిగిన ఎట్‌హోం కార్యక్రమంలో గవర్నర్ తమిళిసైసౌందర్‌రాజన్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతోపాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ సుభాష్‌రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాఘవేంద్రసింగ్ చౌహాన్, హైకోర్టు న్యాయమూర్తులు

మిగతా 2వ పేజీలో

# విజయం మనదే

## అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఎజెండాగా మున్సిపల్ ఎన్నికలకు టీఆర్ఎస్

- ఐదేండ్లలో ఎక్కడా నేలవిడిచి సాము చేయలేదు
- పల్లెలు, పట్టణాలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది
- ఆడలేక మద్దెలఓడు అన్నట్టు కాంగ్రెస్ తీరు
- సీఏఏపై చెప్పిన వైఖరికే కట్టుబడిఉన్నాం
- టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మున్సిపల్ ఎన్నికలపై పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో దిశానిర్దేశం

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:**

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమపథకాలే ఎజెండాగా మున్సిపల్ ఎన్నికలకు వెళ్తామని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు అన్నారు. మున్సిపోల్స్‌లో టీఆర్ఎస్‌దే విజయమని ధీమా వ్యక్తంచేశారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో టీఆర్ఎస్ పార్టీ రాష్ట్రకార్యవర్గ సమావేశం జరిగింది. మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, అభ్యర్థుల ఎంపిక, ప్రచారం తదితర విషయాలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నేతలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం పార్టీ సెక్రటరీ జనరల్ కే కేశవరావు, ప్రధాన కార్యదర్శి, రైతు సమన్వయసమితి చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సత్యవతిరాథోడ్, ఎంపీలు బండా ప్రకాశ్, పీ రాములు, మాలోతు కవిత, లింగయ్యాయాదవ్‌తో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజల అవసరాలు తీర్చడమే లక్ష్యంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని, మున్సిపల్ ఎన్నికల్లో వారిని మద్దతివ్వాలని కోరుతామని చెప్పారు. తెలంగాణ ఏర్పాటైన నాటినుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని ఎన్నికల్లోనూ తెలంగాణ సమాజం టీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటిస్తూ వస్తున్నదని తెలిపారు. 2014లో 63 సీట్లు గెలిస్తే 2018లో 88 సీట్లతో టీఆర్ఎస్‌కు ప్రజలు సంపూర్ణ మెజార్టీని కట్టబెట్టారన్నారు. ఇటీవలి హుజూర్‌నగర్ ఉపఎన్నికలోనూ బ్రహ్మాండమైన విజయం సాధించామని చెప్పారు. ప్రజల ఆశీర్వాదంతోనే కేసీఆర్ నాయకత్వంలో టీఆర్ఎస్ తిరుగులేని రాజకీయశక్తిగా ఎదిగిందని తెలిపారు. గడిచిన ఐదేండ్లలో ఎక్కడా కూడా నేల విడిచి సాము చేయలేదని కేటీఆర్ పేర్కొన్నారు.

**కేసీఆర్ కార్యదక్షతపై విశ్వాసం**

ప్రభుత్వ పనితీరు, సీఎం కేసీఆర్ కార్యదక్షత , ఆయన నాయకత్వంపై ప్రజలకున్న విశ్వాసం మున్సిపల్ ఎన్నికల్లో తమకు పెద్ద అస్త్రమని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల మందికి ఆసరా పెన్షన్లు అందిస్తున్నామని, గతంలో రూ.200 ఉన్న పింఛన్‌ను రూ. 2016కు పెంచామని తెలిపారు. రైతుబంధు, రైతుబీమా ఇలా అనేక పథకాలను అమలు

మిగతా 2వ పేజీలో


శుక్రవారం తెలంగాణభవన్‌లో టీఆర్ఎస్ రాష్ట్రకార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# సాంకేతిక అద్భుతం

## కాళేశ్వరం ప్రాజెక్టుపై గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ప్రశంసలు

దేశీయ పరిజ్ఞానాన్ని ఎక్కువగా వాడిన ఇంజినీర్ల కృషి భేష్

సాంకేతికతతో పేదల బతుకులనూ మార్చాలని పిలుపు

మౌలికసదుపాయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి: మంత్రి వేముల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు సాంకేతిక అద్భుతమని.. దేశీయ పరిజ్ఞానాన్ని ఎక్కువగా వినియోగించి ప్రాజెక్టును నిర్మించిన ఇంజినీర్ల కృషి ప్రశంసనీయమని గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ అన్నారు. శుక్రవారం హెచ్ఐసీసీలో ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్, తెలంగాణ స్టేట్‌సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన 34వ ఇండియన్ ఇంజినీరింగ్ కాంగ్రెస్‌లో రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టును ఇటీవలే సందర్శించానని.. చాలా గొప్పగా ఉన్నదని ప్రశంసించారు. సహజవనరుల సంరక్షణలో ఇంజినీర్ల పాత్ర కీలకమని, వ్యర్థాల నిర్వహణలోనూ సాంకేతికతను ఉపయోగించాలని సూచించారు. సాంకేతికత ద్వారా మురుగునీటిని శుద్ధిచేస్తే వేల ఎకరాలకు సాగునీరు అందించడం సాధ్యమవుతుందని చెప్పారు. సహజ వనరుల పరిరక్షణకూ కొత్త ఆవిష్కరణలు చేయాలని, పేదల బతుకులను మార్చేందుకు కృషి జరుగాలని ఆకాంక్షించారు. కృత్రిమమేధతో ఇంజినీర్లు తమ ప్రతిభ, పనితీరుకు పదును పెట్టాలని.. పర్యావరణాన్ని కాపాడుతూ అభివృద్ధి జరిగేలా చూడాలని సూచించారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి సదస్సుల

మిగతా 2వ పేజీలో


శుక్రవారం హెచ్ఐసీసీలో 34వ ఇండియన్ ఇంజినీరింగ్ కాంగ్రెస్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్. చిత్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కూడా ఉన్నారు.

ఆ 613 మంది
# ఏపీకి వెళ్లాల్సిందే!

**విద్యుత్ ఉద్యోగుల విభజనపై జస్టిస్ ధర్మాధికారి తుది నివేదిక**

- 1,157 మందిని విభజించిన కమిటీ
- తెలంగాణకు 502 మంది కేటాయింపు
- ఆప్షన్లు ఇవ్వని 42 మంది ఏపీకే
- నాలుగునెలల్లో అమలుకు ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఐదేండ్లుగా ఇరురాష్ట్రాల మధ్య ఉప్పునిప్పులా మారిన విద్యుత్ ఉద్యోగుల విభజన సమస్య ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. ఆంధ్రా స్థానికత ఉన్న ఉద్యోగులను తెలంగాణకు కేటాయించడంపై ఉద్యోగసంఘాల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నా.. కనీసం ఇప్పటికైనా సమస్యను పరిష్కరించారనే ఊరట కూడా కనపడుతున్నది. సుప్రీంకోర్టు ఏర్పాటుచేసిన ఏకసభ్య కమిటీ జస్టిస్ ధర్మాధికారి.. పలుమార్లు ఇరురాష్ట్రాల ప్రభుత్వ ప్రతినిధులు, విద్యుత్ సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు,

మిగతా 2వ పేజీలో


పౌరసత్వసవరణ చట్టానికి వ్యతిరేకంగా శుక్రవారం ఢిల్లీలోని జామామసీదు వద్ద ప్రార్థనల అనంతరం నిరసనకు దిగిన ఆందోళనకారులు

# ఇదో ఫాసిస్టు చట్టం

సీఏఏ, ఎన్నార్సీ ముస్లింలకు పూర్తి వ్యతిరేకం

దేశంలోని సమస్యలను కప్పిపుచ్చడానికే తరుచూ ఇంటర్నెట్ నిలిపివేత

కేంద్ర ప్రభుత్వానికి సాఫ్ట్‌వేర్ నిపుణుల ఘాటు లేఖ

దేశవ్యాప్తంగా కొనసాగుతున్న 'పౌర' ఆందోళనలు

5

# కేసీఆర్‌ను మించిన లౌకికవాదిలేడు

**జీవితాంతం ఆయన వెంటే ఉంటా**

పౌరసత్వ సవరణ చట్టం అందరి సమస్య

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్య

ఎన్నార్సీ, సీఏఏ, ఎన్పీఆర్‌కు వ్యతిరేకంగా నిజామాబాద్‌లో భారీ బహిరంగసభ

6



**చికెన్ ధరలు** (వెన్‌కాబ్) (రూ.)

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 100.00 | రిటైల్ లైవ్ | 122.00 |
| డ్రెస్డ్ | 177.00 | స్కిన్‌లెస్ | 201.00 |

**గుడ్ల ధరలు** (వందకు) (రూ.)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 450.00 | రంగారెడ్డి | 450.00 |
| మెదక్ | 450.00 | కరీంనగర్ | 453.00 |
| వరంగల్ | 453.00 | డజన్ ధర | 69.00 |

## ఎస్బీఐ ఏటీఎం మరింత భద్రం




నగదు విత్‌డ్రాయల్‌కు ఓటీపీ

9

# మొబైల్ వ్యసనంలో యువత

**పగటిపూట మూడోవంతు జీవితం స్మార్ట్‌ఫోన్‌లోనే**

**యువత పెడధోరణులకూ అదే కారణం!**

- టీనేజ్‌లోనే బానిసలుగా 41 శాతం మంది
- ఫోన్ చూడకుండా ఐదునిమిషాలు కూడా ఉండలేరు
- కుటుంబ బంధాలకు, ఆప్యాయతలకు దూరం
- ఇంటర్నెట్ వ్యసనంలో హైదరాబాద్ 4వ స్థానం
- సైబర్‌మీడియా రిసెర్చ్, వివో సంయుక్త సర్వేలో వెల్లడి

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**

మొబైల్ వినియోగం వ్యసనంగా మారుతున్నది. యవ్వనం మొబైల్‌కు బానిసవుతున్నది. ఇంట్లోనే ఉన్నా కుటుంబ బంధాలకు దూరంచేస్తున్నది. కొత్త రోగాలను తెచ్చిపెడుతూ కలహాలకు దారితీస్తున్నది. చేతిలో మొబైల్ అందులో ఇంటర్నెట్, చార్జింగ్ ఉంటే చాలు మరెవ్వరూ అవసరంలేదు అనుకొనేలా మనుషులు తయారయ్యారు. పగటిపూట మనిషి మూడింట ఒకటోవంతు జీవితం ఫోన్‌తోనే గడుపుతున్నట్టు సైబర్‌మీడియా రిసెర్చ్, ప్రముఖ మొబైల్ తయారీ రంగ సంస్థ వివో సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో వెల్లడయింది. ఏడాదిలో పగటిపూట సగటున 1800 గంటలు (75 రోజులు) సమయం మొబైల్‌నే చూస్తున్నట్టు తేలింది. ఇంటర్నెట్ వ్యసనంలో దేశంలోనే హైదరాబాద్ 4వ స్థానంలో ఉన్నట్టు సర్వే తేల్చింది. హైదరాబాద్‌తో కలిపి దేశవ్యాప్తంగా ఉన్న ఎనిమిది పెద్ద నగరాల్లో వివిధ వయసులకు చెందిన రెండువేల మందితో (వీరిలో 36 శాతం మంది మహిళలు, 64 శాతం మంది పురుషులు ఉండగా, ఇందులో ఎక్కువ శాతం యువతే ఉన్నది) నేరుగా నిర్వహించిన ఈ సర్వేలో మరిన్ని ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. 41 శాతం మందికి తమ గ్రాడ్యుయేషన్ కంటే ముందే యవ్వన వయసులోనే మొబైల్ ఫోన్ వాడటం అలవాటైందని సర్వే తేల్చింది.

**ఐదునిమిషాలూ ఉండలేరు**

చాలామంది తమ స్నేహితులు లేదా కుటుంబసభ్యులు, ఆత్మీయులతో మాట్లాడేప్పుడు కూడా వారి మొబైల్ వైపే ఎక్కువగా చూస్తున్నట్టు సర్వేలో తేలింది. కనీసం 5 నిమిషాలు కూడా ఎదుటివారి వైపు చూస్తూ మాట్లాడలేకపోతున్నారు. మొబైల్ కారణంగా తమవారితో మాట్లాడాల్సిన సమయం అంతకంతకూ తగ్గుతూ వస్తున్నది. తమకు తెలియకుండానే చాలామంది వారి స్నేహితులకు దూరమవుతున్నారు. స్నేహితులు సైతం.. అలాంటివారితో మాట్లాడితే సరైన స్పందన ఉండదనుకోవడంతో వారి మధ్య దూరం పెరుగుతున్నది.

**సరదాలు లేవు.. కుటుంబానికి దూరం**

ఒకప్పుడు పుస్తకాలు చదవడం, స్నేహితులు, కుటుంబసభ్యులతో కలిసి మాట్లాడుకోవడం, ఆటలు, పాటలు వంటి అనేక పనులుచేస్తూ సరదాగా గడిపేవారు. కానీ, మొబైల్ వినియోగం పెరిగాక

మిగతా 6వ పేజీలో



**సర్వే చేసినది**
హైదరాబాద్ సహా 8 పెద్ద నగరాల్లో

**పగటిపూట మొబైల్ చూస్తున్న సమయం**
ఏడాదిలో 1800 గంటలు

**సర్వేలో పాల్గొన్నవారు**
2,000
మహిళలు 36%
పురుషులు 64%

epaper.ntnews.com



బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో జరిగిన ఎటహోం కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, గవర్నర్ తమిళిసైసౌందర్‌రాజన్, సీఎం కే చంద్రశేఖర్‌రావు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ సుభాష్‌రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాఘవేంద్రసింగ్ చౌహాన్, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి, మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్, చామకూర మల్లారెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, కొప్పుల ఈశ్వర్ తదితరులు





ఎట్‌హోంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో కరచాలనం చేస్తున్న ఎంపీ సంతోష్‌కుమార్. చిత్రంలో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, సీఎం కేసీఆర్, ఎంపీ రంజిత్‌రెడ్డి తదితరులు

# ముగిసిన రాష్ట్రపతి విడిది

మొదటిపేజీ తరువాయి...

జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి, టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీలు సంతోష్‌కుమార్, రంజిత్‌రెడ్డి, బండా ప్రకాశ్, బడుగుల లింగయ్యయాదవ్, మాలోతు కవిత, ప్రభుత్వ విప్ ఎంఎస్ ప్రభాకర్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, తాటికొండ రాజయ్య, బేతి సుభాష్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, రేఖానాయక్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎం శ్రీనివాస్‌రెడ్డి, నారదాసు లక్ష్మణ్‌రావు, యెగ్గె మల్లేశం, నవీన్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్ పాల్గొన్నారు

# సాంకేతిక అద్భుతం

మొదటిపేజీ తరువాయి...

వల్ల సాంకేతికత, ఇంజినీరింగ్ అంశాలను పరస్పర మార్పిడి చేసుకోవటం సాధ్యమవుతుందన్నారు. ఒక ఇంజినీర్‌గా సదస్సులో పాల్గొనడం ఆనందంగా ఉన్నదన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో పద్దెనిమిది వేల కోట్లతో మౌలిక సదుపాయాలను కల్పించారని.. గృహ నిర్మాణం, రోడ్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకమైన శ్రద్ధతో పనిచేస్తున్నదని తెలిపారు. గతంలో మిషన్‌భగీరథ చైర్మన్‌గా.. ఇప్పుడు రోడ్లు, భవనాలశాఖ మంత్రిగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కొద్దిగానైనా భాగస్వామి కావడం తన అదృష్టమని, అవకాశమిచ్చిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ చైర్మన్ రామేశ్వర్‌రావు, ఆల్‌ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ అధ్యక్షుడు గుణరాజ, వివిధ విభాగాలకు చెందిన ఇంజినీర్లు పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వం సాధించిన విజయాలను గుర్తుచేసేలా ఏర్పాటుచేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. ఇందులోభాగంగా తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్, క్యాడ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కాళేశ్వరం ప్రాజెక్టు స్టాల్‌ను మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. జాతీయస్థాయిలో ఇంజినీరింగ్ రంగంలో విశేష కృషిచేసిన వారికి ప్రతిఏటా ఇచ్చే నేషనల్ డిజైన్ అండ్‌రిసెర్చ్ ఫోరం (ఎన్డీఆర్‌ఎఫ్) అవార్డులను ఈ సందర్భంగా అందజేశారు. ఆరు విభాగాల్లో అవార్డులు ఇవ్వగా.. మెకానికల్ ఇంజినీరింగ్ డిజైన్ అవార్డును హైదరాబాద్‌లోని డీఆర్డీవోలో అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లాబొరేటరీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్ కిశోర్‌నాథ్ అందుకున్నారు. గవర్నర్ తమిళిసై ఆయనకు ఈ పురస్కారం అందజేశారు.



శుక్రవారం హెచ్‌ఐసీసీలో గవర్నర్ తమిళిసైసౌందర్‌రాజన్ చేతుల మీదుగా ఉత్తమ నీటి సంరక్షణ అవార్డు అందుకుంటున్న ఆచార్య ఎంవీఎస్‌ఎస్ గిరిధర్

**ముహూర్తం**

సూర్యోదయం: 6.47 గంటలకు

సూర్యాస్తమయం: 5.41 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం విదియ ఉదయం 11.11 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: ఉత్తరాషాఢ సాయంత్రం 6.44 వరకు, తదుపరి శ్రవణం, అమృతఘడియలు: మధ్యాహ్నం 12.00 నుంచి 1.41 వరకు, రాహుకాలం: ఉదయం 9.31 నుంచి 10.53 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.47 నుంచి 8.15 వరకు, వర్జ్యం: రాత్రి 11.02 నుంచి 12.45 వరకు.







శుక్రవారం తెలంగాణభవన్‌లో నిర్వహించిన టీఆర్‌ఎస్ రాష్ట్ర కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో పార్టీ సెక్రటరీ జనరల్ కే కేశవరావు, మంత్రి సత్యవతి రాథోడ్, పార్టీ ప్రధాన కార్యదర్శులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బండా ప్రకాశ్, పీ రాములు, బడుగుల లింగయ్యయాదవ్, బీ వెంకటేశ్వర్లు, కార్యదర్శి, ఎంపీ మాలోతు కవిత తదితరులు ఉన్నారు.

# విజయం మనదే

మొదటిపేజీ తరువాయి...

చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు ఆరు లక్షల మందికి కేసీఆర్ కిట్లు అందజేసినట్టు తెలిపారు. మున్సిపాలిటీల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చామని, పైసా లంచం లేకుండా 21 రోజుల్లోనే భవన నిర్మాణ అనుమతులు ఇస్తున్నామన్నారు. టీఎస్‌ఐపాస్ లాగా టీఎస్ బీపాస్ (తెలంగాణ స్టేట్ బిల్డింగ్ పర్మిషన్ అప్రూవల్ సెల్ఫ్ సర్టిఫికేషన్) అనుమతి ఇవ్వడం, లేకపోతే డీమ్డ్ అప్రూవల్ విధానాన్ని తీసుకొచ్చినట్టు కేటీఆర్ చెప్పారు.

## బెంబేలెత్తుతున్న ప్రతిపక్షాలు

ఎన్నికల్లో కొట్లాడే సత్తాలేకనే కాంగ్రెస్ పార్టీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నదని కేటీఆర్ విమర్శించారు. అడలేక మద్దెల ఓడు అన్నట్టుగా ఆ పార్టీ తీరు ఉన్నదని, ఎన్నికలంటేనే ప్రతిపక్షపార్టీకి భయం పట్టుకున్నదని ఎద్దేవాచేశారు. ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడిగే ధైర్యం లేకనే రిజర్వేషన్ల అంశాన్ని సాకుగా చూపుతూ ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఆరునెలలుగా కోర్టులో వ్యాజ్యాలు నడుస్తున్నాయని.. ఇది అందరికీ తెలిసిన విషయమేనని చెప్పారు. చట్టప్రకారం ఎన్నికలు జరగాలి.. జరుగుతాయని అన్నారు. ఇందుకోసం కాంగ్రెస్ ఎందుకు బెంబెలెత్తుతుందో అర్థం కావడంలేదని ఎద్దేవాచేశారు. సొంతసీటులో ఉత్తమ్ ఓడిపోయారని.. ఇప్పుడు దానిపై మాట్లాడే పరిస్థితిలేక ఆయన నిరాశా, నిస్పృహల్లో ఉన్నారని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల దగ్గరికిపోయి ఓట్లు అడిగే ధైర్యం లేకపోవడం ఏమిటని కేటీఆర్ ఆశ్చర్యం వ్యక్తంచేశారు.

## నిధులు- విధులు ట్యాగ్‌లైన్‌తో పట్టణాల అభివృద్ధి

పల్లెలు, పట్టణాలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని మంత్రి కేటీఆర్ చెప్పారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలను తీసుకొచ్చామని తెలిపారు. పంచాయతీరాజ్‌చట్టం ఫలితాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. పల్లె ప్రగతి తర్వాత గ్రామాల్లో అద్భుతమైన మార్పులు వస్తున్నాయని.. పంచాయతీలకు నెలకు రూ. 339 కోట్లు ఠంచన్‌గా ఇస్తున్నామని చెప్పారు. దేశంలో ఏ ముఖ్యమంత్రికీ రాని ఆలోచనను సీఎం కేసీఆర్ అమలుచేసి చూపించారని అన్నారు. రాష్ట్రంలో మున్సిపాలిటీలను 73 నుంచి 141కి పెంచామని చెప్పిన కేటీఆర్.. నిధులు- విధులు ట్యాగ్‌లైన్‌తో పట్టణాల్లో అభివృద్ధి చేపట్టబోతున్నామని తెలిపారు. పల్లె ప్రగతిని పట్టణాల్లోనూ అమలుచేస్తామన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పంచాయతీలు, మున్సిపాలిటీలకు నిధులిచ్చామని చెప్పారు. కరంటు, నీరు, అభివృద్ధి ఫలాలు అందరికీ కనబడుతున్నాయని.. వాటి ద్వారానే మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌కు మద్దతివ్వాలని ప్రజలను కోరతామన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం మరో నాలుగేండ్లు అధికారంలో ఉంటుందని.. పట్టణాల్లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరిన తర్వాత చట్టప్రకారం వాటికి రావాల్సిన నిధులను కేటాయిస్తామని చెప్పారు. అయితే, విధుల విషయంలో బాధ్యతారాహిత్యాన్ని సహించబోమని అన్నారు. పల్లెలు ఇప్పటికే ప్రగతి బాటపట్టాయని, పట్టణాలనూ అదేదారిలో నడుపుతామని విశ్వాసం వ్యక్తంచేశారు.

## పార్లమెంట్‌లో అంశాలవారీగానే మద్దతు

సీఏఏపై పార్లమెంట్ సమావేశాల్లో ఏ విధమైన వైఖరితో ఉన్నామో ఇప్పుడు కూడా అదేవైఖరితో ఉన్నామని మంత్రి కేటీఆర్ స్పష్టంచేశారు. టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీనాయకుడు కే కేశవరావు, లోక్‌సభా పక్షనేత నామా నాగేశ్వర్‌రావు ఉభయసభల్లో మాట్లాడిన మాటలకు కట్టుబడి ఉన్నామన్నారు. అధికారంలో ఉన్న పార్టీగా, బాధ్యతగల పార్టీగా పార్లమెంట్‌లో అంశాలవారీగా నిర్ణయం తీసుకున్నామని, సీఏఏపై కూడా అదేవిధంగా వ్యవహరించామని చెప్పారు. సీఏఏలో ముస్లింలను చేర్చితే మద్దతిస్తామని పార్లమెంట్‌లో చెప్పామని ఆయన గుర్తుచేశారు. ఎన్పీఆర్, ఎన్నార్సీపై రాష్ట్ర క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పార్టీ సెక్రటరీ జనరల్ కే కేశవరావు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తంచేశారు. కేసీఆర్ నాయకత్వం, కార్యకర్తల అంకిత భావమే ఇందుకు ప్రధానకారణమని తెలిపారు.

# పంచాయతీ, పరిషత్ ఫలితాలే పునరావృతం

- మున్సిపోల్స్‌లో అందరం కష్టించి పనిచేయాలి.. స్థానికంగానే అభ్యర్థుల ఎంపిక
- బహిరంగ సభలు, ర్యాలీలు ఉండవు.. ఇంటింటి ప్రచారానికి ప్రాధాన్యం
- బీజేపీ, టీడీపీ నామమాత్రం.. కాంగ్రెస్ అక్కడక్కడా పోటీకి యత్నం
- టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే మున్సిపల్ ఎన్నికల్లోనూ పునరావృతమవుతాయని టీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కే తారకరామారావు అన్నారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం టీఆర్‌ఎస్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. పార్టీ సెక్రటరీ జనరల్ కే కేశవరావు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, పార్టీ ప్రధాన కార్యదర్శులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎం శ్రీనివాస్‌రెడ్డి, బండా ప్రకాశ్, పీ రాములు, బడుగుల లింగయ్యయాదవ్, బీ వెంకటేశ్వర్లు, కార్యదర్శి, ఎంపీ మాలోతు కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఓటూ విలువైనదేనని.. మున్సిపల్ ఎన్నికల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేయాలని సూచించారు. బహిరంగ సభలు, ర్యాలీలు ఉండవని.. ఎక్కడివారక్కడ ప్రచారం చేసుకోవాలని అన్నారు. ఎన్నికలులేని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన నాయకులు సేవలు ఏ విధంగా వినియోగించుకోవాలనే దానిపై త్వరలో సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. అభ్యర్థులను ఎమ్మెల్యేలు ఎంపికచేస్తారని.. అందుకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు రాష్ట్రపార్టీకి పంపించాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్లు, మేయర్లను ఎన్నికల తర్వాత సీఎం కేసీఆర్ నిర్ణయిస్తారని పేర్కొన్నారు. జనవరి మొదటివారంలో సీఎం కేసీఆర్.. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించి ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. ఆలోగా ఇంచార్జీలుగా ఉన్నవారు ఆయా నియోజకవర్గాల్లోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రస్తుతం ఉన్న వాస్తవ పరిస్థితులపై నివేదిక ఇవ్వాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కష్టపడి చేయాలని, ఎన్నికలు పూర్తయ్యే వరకు నాయకులు క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనని ఆదేశించారు. స్థానికంగా ఓటర్ల జాబితా సవరణలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ నామమాత్రమేనని, కాంగ్రెస్ పార్టీ అక్కడక్కడా పోటీఇచ్చే ప్రయత్నం చేస్తున్నదన్నారు. హుజూర్‌నగర్ ఉపఎన్నిక తర్వాత ప్రతిపక్షాలు నామమాత్రంగా మారాయని కేటీఆర్ తెలిపారు.



శామీర్‌పేటలో ఆర్టీసీ ఉద్యోగులతో వనభోజనం చేస్తున్న మంత్రులు పువ్వాడ అజయ్, చామకూర మల్లారెడ్డి, ఎండీ సునీల్‌శర్మ తదితరులు



శామీర్‌పేటలో మొబైల్ బయోటాయిలెట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ అజయ్



జేబీఎస్‌లో కార్గో బస్సును పరిశీలిస్తున్న మంత్రులు పువ్వాడ అజయ్, చామకూర మల్లారెడ్డి, ఎండీ సునీల్‌శర్మ

# లాభాల్లోకి తెచ్చి బోనస్ తీసుకోవాలి

**ఆర్టీసీ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, చామకూర మల్లారెడ్డి**

**శామీర్‌పేటలో మొబైల్ బయోటాయిలెట్స్ ప్రారంభం**

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు సంస్థను లాభాల్లోకి తెచ్చేందుకు కృషిచేయాలని, కొత్త ఉత్సాహంతో పనిచేసి ఏడాదిలోగా బోనస్ తీసుకోవాలని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కార్మికశాఖ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికుల పక్షపాతని, దేశంలోనే ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం కోసం పాటుపడే ఏకైక వ్యక్తి అని కొనియాడారు. శుక్రవారం జేబీఎస్‌లో ప్రదర్శనకు ఉంచిన కార్గో బస్సును మంత్రులు పరిశీలించారు. జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. శామీర్‌పేటలో ఆర్టీసీ ఉద్యోగులతో ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా నిర్వహించిన వనభోజన కార్యక్రమం లో పాల్గొన్నారు. తర్వాత మొబైల్ బయోటాయిలెట్స్‌ను మంత్రి పువ్వాడ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌ఆర్టీసీ దేశంలోనే నంబర్‌వన్ ఆర్టీసీగా రూపాంతరం చెందనున్నదని జోస్యం చెప్పారు. సమ్మెకాలంలోని రెండు నెలల జీతం ఒకేసారి ఇస్తామని తెలిపారు. జనవరిలో కార్గో సర్వీసులు ప్రారంభమవుతాయని, వీటిని త్వరలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభిస్తారన్నారు. ఆర్టీసీ సంస్థతోపాటు ఉద్యోగులపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు అపారమైన ప్రేమ ఉన్నదని మంత్రి సీహెచ్ మల్లారెడ్డి చెప్పారు.

# పల్లెసీమల అభివృద్ధికి రూ.339 కోట్లు

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. రూ.339 కోట్లు విడుదలచేస్తూ శుక్రవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. 2019-20 సంవత్సరానికి రాష్ట్ర ఆర్థికసంఘం గ్రాంటు రూపంలో ఇస్తున్న ఈ నిధుల్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు, ఉపాధి కల్పనకు వినియోగించాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలకు నిధులు పంపిణీ చేశారు. జిల్లా పంచాయతీ అధికారులు గ్రామ పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన పంపిణీచేయాలని సూచించారు.

# ఇస్రో మాజీ శాస్త్రవేత్తకు రూ.1.3 కోట్ల పరిహారం

- నంబి నారాయణ్‌తో కేసు పరిష్కారానికి కేరళ ప్రభుత్వం నిర్ణయం



**తిరువనంతపురం:** గూఢచర్యం చేస్తున్నారన్న తప్పుడు ఆరోపణలతో అరెస్టై, వేధింపులకు గురైన ఇస్రో మాజీ శాస్త్రవేత్త నంబి నారాయణ్‌కు రూ.1.3 కోట్ల పరిహారం ఇవ్వాలని కేరళ ప్రభుత్వం నిర్ణయించింది. తనను చట్టవిరుద్ధంగా అరెస్ట్ చేసి వేధింపులకు గురిచేసినందుకు పరిహారం కోరుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయన స్థానిక కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో నంబి నారాయణ్‌తో స్నేహపూర్వకంగా కేసును పరిష్కరించుకునేందుకు మాజీ ప్రధాన కార్యదర్శి జయకుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన సిఫార్సు మేరకు నంబి నారాయణ్‌కు ఈ మేరకు పరిహారం చెల్లించేందుకు గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆయనకు గత ఏడాది చెల్లించిన రూ.50 లక్షలు, జాతీయ మానవ హక్కుల కమిషన్ సిఫార్సు చేసిన రూ.10 లక్షల పరిహారానికి ఇది అదనమని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. భారతీయ అంతరిక్ష పరిశోధనలకు సంబంధించిన కొన్ని రహస్య పత్రాలను ఇద్దరు శాస్త్రవేత్తలు, మాల్దీవులకు చెందిన ఇద్దరు మహిళలతో పాటు మరో ఇద్దరి ద్వారా విదేశాలకు తరలించి గూఢచర్యానికి పాల్పడ్డారంటూ 1994లో నంబి నారాయణ్‌పై ఆరోపణలొచ్చాయి. తొలుత దర్యాప్తు జరిపిన కేరళ పోలీసులు ఆయనను అరెస్ట్ చేయడంతో రెండు నెలలపాటు జైలులో ఉన్నారు. అనంతరం దర్యాప్తు చేసిన సీబీఐ, నంబి నారాయణ్‌కు క్లీన్‌చిట్ ఇచ్చింది.

# ఆ 613 మంది ఏపీకి వెళ్లాల్సిందే!

మొదటిపేజీ తరువాయి...

ఉద్యోగులతో సమావేశమై అన్ని అంశాలను పరిశీలించి దాదాపు ఏడాది తర్వాత శుక్రవారం తన తుది నివేదికను ఇచ్చారు. ఆంధ్రా స్థానికత ఉన్న 1,157 మందిని తెలంగాణ విద్యుత్ సంస్థల నుంచి రిలీవ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ సంస్థల యాజమాన్యాలు తీసుకున్న నిర్ణయంతో ఆంధ్రా విద్యుత్ యాజమాన్యాలు గగ్గోలు పెట్టాయి. నాలుగేండ్లపాటు హైకోర్టు ఆపై సుప్రీంకోర్టుకు ఈ వివాదం నడిచింది. చివరకు సమస్య పరిష్కారానికి సుప్రీంకోర్టు జస్టిస్ ధర్మాధికారితో ఏకసభ్య కమిటీని ఏర్పాటుచేసింది. ఆయన విద్యుత్ ఉద్యోగుల విభజన పూర్వాపరాలు, రెండు రాష్ట్రాల వాదనలను లోతుగా విశ్లేషించారు. సబ్‌కమిటీతో సమావేశాలు, న్యాయపరమైన అంశాలు, రాష్ట్ర పునర్విభజన చట్టం, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పేర్కొంటూ.. తుది నివేదికను సిద్ధంచేశారు. ఇందులో 1,157 మంది ఉద్యోగుల విభజనే కీలకంగా మారిన అంశాన్నికూడా పేర్కొన్నారు. అనుబంధంగా కమిటీ దృష్టికి తీసుకొచ్చిన అంశాలనుకూడా జస్టిస్ ధర్మాధికారి తన నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. కొన్నిఅంశాల్లో సబ్‌కమిటీ విభేదించిన అంశాలనుకూడా ఉటంకించారు. ఇలాంటి అంశాల్లో మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుని కమిటీ తుదినిర్ణయం తీసుకున్నది. ఉద్యోగుల విభజనను నాలుగునెలల్లో అమలుచేయాలని ఇరురాష్ట్రాల విద్యుత్ సంస్థల యాజమాన్యాలను కమిటీ ఆదేశించింది.

## ఆప్షన్లు ఇచ్చిన ఉద్యోగులు అక్కడకే..

వివాదం తలెత్తిన 1157 మంది విద్యుత్ ఉద్యోగుల్లో ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లేందుకు ఆప్షన్లు ఇచ్చిన 613 మంది ఉద్యోగులను ఏపీకే కేటాయిస్తూ జస్టిస్ ధర్మాధికారి కమిటీ నిర్ణయించింది. ఇక తెలంగాణకు ఆప్షన్లు ఇచ్చిన 502 మందిని తెలంగాణ విద్యుత్‌సంస్థలకు కేటాయించింది. వాస్తవానికి ఆంధ్రా స్థానికత అయినప్పటికీ.. వివాదాన్ని పరిష్కరిద్దామనే ఆలోచనతో తెలంగాణ విద్యుత్ సంస్థల యాజమాన్యాలు తెలంగాణకు ఆప్షన్లు ఇచ్చిన 502 మందిని తీసుకొనేందుకు ముందుకొచ్చాయి. ఏపీకి ఆప్షన్ ఇచ్చిన 613 మందిని తీసుకోవాల్సిందేనంటూ తేల్చిచెప్పాయి. అలాగే ఎలాంటి ఆప్షన్ ఇవ్వని 42 మందిని కూడా ఏపీకే కేటాయించారు. ఇదిలాఉండగా.. ఏపీ నుంచి తమంతటతాముగా రిలీవ్ అయి తెలంగాణకు వచ్చిన 242 మందిని జస్టిస్ ధర్మాధికారి కమిటీ తెలంగాణకే కేటాయించింది. సంప్రదింపులు, సమావేశాల చివరి సమయంలో ఏపీ కొత్తగా తెరపైకి తీసుకొచ్చిన 256 మంది ఉద్యోగుల విషయాన్ని కమిటీ పరిగణనలోకి తీసుకోనట్టే. ఈ 256 మంది తెలంగాణకు ఆప్షన్ ఇచ్చినా ఏపీలో పనిచేస్తుండటం, కమిటీ ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడంతో వారంతా ఏపీకే చెందుతారనేది స్పష్టమయింది.

### పాక్షిక న్యాయమే..



**ఎన్ శివాజీ, తెలంగాణ విద్యుత్ ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడు**

ఆరుదశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న సమస్యకు సంపూర్ణ పరిష్కారం లభించలేదనే చెప్పవచ్చు. ఆంధ్రా స్థానికత కలిగిన 502 మంది ఉద్యోగులను తెలంగాణకు కేటాయించడం అసంతృప్తి కలిగిస్తున్నది. మాకు పాక్షిక న్యాయమే జరిగిందనే ఆవేదన ఉన్నది. ఐదేండ్లుగా విద్యుత్తు సంస్థలను, విద్యుత్ ఉద్యోగ సంఘాలను పట్టిపీడిస్తున్న 1157 మంది ఉద్యోగుల కేటాయింపుపై జస్టిస్ ధర్మాధికారి ఇచ్చిన నివేదికతో విద్యుత్ సంఘాల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది.

### మొత్తానికి సమస్య పరిష్కారమయింది



**పీ అంజయ్య, విద్యుత్ అకౌంట్స్ అధికారుల సంఘం**


జస్టిస్ ధర్మాధికారి తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని కొంత గుర్తించినట్టున్నారు. 502 మందిని తెలంగాణకు, 613 మందితో పాటు, ఆప్షన్ ఇవ్వని 42 మందిని ఏపీకి కేటాయిస్తూ మొత్తానికి సమస్యను పరిష్కరించారనే చెప్పవచ్చు. ఈ విభజన ప్రక్రియలో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, డైరెక్టర్ (హెచ్‌ఆర్‌డీ) అశోక్‌కుమార్ తోడ్పాటుకు కృతజ్ఞతలు.

# నేడు అసెంబ్లీ, మండలి కమిటీ చైర్మన్ల సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

అసెంబ్లీ, శాసనమండలి కమిటీల చైర్మన్ల సమావేశం శనివారం అసెంబ్లీ కమిటీ హాలులో జరుగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ టీ పద్మారావు, మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వీ నరసింహాచార్యులు పాల్గొంటారు. సమావేశానికి ప్రభుత్వ చీఫ్ విప్‌లు, విప్‌లను ఆహ్వానించారు. అసెంబ్లీ, శాసనమండలి కమిటీలను క్రియాశీలంచేయాలనే ఉద్దేశంతో చైర్మన్లందరితో సమావేశం నిర్వహించి, వాటి పాత్రపై సమగ్రంగా వివరించనున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను కమిటీల ద్వారా సమర్థంగా అమలుచేయడంపై దృష్టి పెట్టనున్నారు. సమావేశంలో కమిటీల పనితీరుపై సలహాలు, సూచనలు స్వీకరిస్తారు.

**లోకం పోకడ**





నేను పాక్ నుంచి మిలిటెంట్లు రాకుండా చూస్తా.. నువ్వు మిడతలు చొరబడకుండా చూస్కో..!

# ఉత్తరాది గాలుల్లేవ్

- చలికాలంలోనూ సాధారణ వాతావరణమే
- జనవరి మొదటివారం తర్వాత చలిగాలులు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్/ హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో చలికాలంలోనూ పలుప్రాంతాల్లో వాతావరణం సాధారణంగానే ఉంటున్నది. రాత్రి పూట కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండటం లేదు. ఆగ్నేయ, తూర్పు దిశల నుంచి వీస్తున్న తేమ గాలుల వల్ల చలి తీవ్రత కనిపించడంలేదు. కొన్ని రోజులు రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గినా రెండ్రోజులుగా సాధారణస్థాయికి చేరుకున్నాయి. చాలా జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 12 నుంచి 16 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. జనవరి మొదటివారం వరకు పరిస్థితి ఇలాగే కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఆ తర్వాత ఉత్తరాది నుంచి చలిగాలులు వీచే అవకాశమున్నదని చెప్పారు.

**నేడు గ్రేటర్ హైదరాబాద్‌కు వర్షసూచన**

ఆగ్నేయం వైపునుంచి వీస్తున్న గాలుల ప్రభావంతో శనివారం గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. గాలుల ప్రభావంతో ఇప్పటికే రాష్ట్రంలోని పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండగా, శుక్రవారం గ్రేటర్‌లో మబ్బులు కమ్ముకున్నాయని తెలిపారు. నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 28.7 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 20.4 డిగ్రీలుగా నమోదైందని చెప్పారు.

## ఆసిఫాబాద్ జిల్లాలో 9 డిగ్రీలు

ఈ సీజన్‌లో అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు

**ఆసిఫాబాద్, నమస్తే తెలంగాణ:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో చలితీవ్రత ఒక్కసారిగా పెరిగింది. ప్రస్తుత చలికాలంలో శుక్రవారం అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 9 డిగ్రీలుగా రికార్డయింది. వారంరోజులుగా సాధారణ వాతావరణం ఉండగా, రెండ్రోజుల నుంచి చలి పెరిగి ప్రజలు వణికిపోతున్నారు. సాయంత్రం ఆరుగంటలు దాటిందంటే ఇంటినుంచి అడుగు బయటపెట్టేందుకు జంకుతున్నారు. ఉదయం 8 గంటల వరకు పొగమంచు వీడకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లాలో అటవీవిస్తీర్ణం అధికంగా ఉండటంతో రానున్న రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు చెప్తున్నారు.



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ్‌వాడలో చలి మంట కాగుతున్న ప్రజలు





మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్‌శాఖమంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే అబ్రహం, టీఆర్‌ఎస్‌రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్ ఉన్నారు.

# టీఆర్‌ఎస్ లౌకికపార్టీ

- ప్రజలు కేసీఆర్ వైపు, యువత కేటీఆర్ వైపు చూస్తున్నారు
- సెంటిమెంట్‌తో ఓట్లు దండుకోవడం బీజేపీకి అలవాటే
- ఎక్సైజ్ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎన్నికలు వచ్చాయంటే కులమతాల సెంటిమెంట్ రెచ్చగొట్టి ఓట్లు దండుకోవడం బీజేపీకి ఆనవాయితేనని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. దేశంలో లౌకికత్వాన్ని పాటించే పార్టీ టీఆర్‌ఎస్ మాత్రమేనని చెప్పారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో ఎమ్మెల్యే అబ్రహం, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు సీఎం కేసీఆర్ వైపు, యువత కేటీఆర్ వైపు చూస్తున్నారన్నారు. కేంద్ర మంత్రులు తెలంగాణ అభివృద్ధిని మెచ్చుకుంటుంటే ఇక్కడి బీజేపీ నాయకులకు మాత్రం అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. ఇంట్లోవారిని గెలిపించుకోలేని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి టీఆర్‌ఎస్‌ను విమర్శిస్తారా అంటూ ప్రశ్నించారు. సీఏఏ తర్వాత దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాలు సహా అనేక రాష్ట్రాల్లో అల్లర్లు జరుగుతున్నాయని, తెలంగాణ మాత్రం ప్రశాంతంగా ఉన్నదని చెప్పారు. ఇక్కడి శాంతిభద్రతలు, పరిపాలన చూసి పెట్టుబడిదారులు పెద్దఎత్తున ముందుకు వస్తున్నారని తెలిపారు. సెంటిమెంట్ ద్వారా గెలవాలనేది బీజేపీ లక్ష్యమని, అభివృద్ధి అనేది వారికి పట్టదన్నారు. టీఆర్‌ఎస్‌ను తిడితే ఓట్లు రావనే విషయాన్ని గ్రహించాలని హితవుపలికారు. బీజేపీలో ఉన్న ఏకైక ఎమ్మెల్యేను కూడా ఇబ్బందిపెడుతున్నారని తెలిపారు. మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని అడిగినా కేంద్రం స్పందించడంలేదని, దమ్ముంటే బీజేపీ నేతలు ఈ పనిచేయించాలని, కాళేశ్వరం, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుల్లో ఒకదానికి జాతీయహోదా ఇప్పించాలన్నారు. సీఎంను ఏ పార్టీ నాయకులైనా కలువవచ్చని, ఈ విషయాన్ని బీజేపీ నేతలు రాజకీయం చేయడం తగదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలంటే భయపడుతున్నదని, యుద్ధమంటే ఎప్పుడైనా సిద్ధంగా ఉండాలన్నారు. టీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉంటుందని చెప్పారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌దే విజయమని పేర్కొన్నారు. టీఆర్‌ఎస్ పార్టీలో సీఎం కేసీఆర్ తర్వాత అంతటి సమర్థుడైన నాయకుడు మంత్రి కేటీఆర్ అని, ప్రజలు కూడా ఇదే విశ్వాసంతో ఉన్నారని అన్నారు. ఉద్యమంలో కేసీఆర్ వెంట కేటీఆర్ నడిచారని, కేటీఆర్ మంత్రిగా ఐటీరంగంలో తెలంగాణ దూసుకుపోతున్నదని చెప్పారు. భవిష్యత్‌లో ఆయన నాయకత్వంలో మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కేటీఆర్ సీఎం కావడంపై పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని మీడియా అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సమావేశంలో టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శులు రూప్‌సింగ్, మూల విజయారెడ్డి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే సీ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పల్లెప్రగతిని విజయవంతం చేయాలి

**రెండోవిడుతకు తగిన కార్యాచరణ రూపొందించండి**

- 2న నిర్వహించే గ్రామసభల్లో ఫ్లయింగ్ స్క్వాడ్స్ పాల్గొనాలి
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు.. బాగా పనిచేస్తే ప్రోత్సాహకాలు
- పరిశుభ్రతలో మెదక్ జిల్లా మల్కాపూర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రవ్యాప్తంగా జనవరి 2 నుంచి 12వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో నిర్వహించే రెండోవిడుత పల్లెప్రగతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విజ్ఞప్తిచేశారు. సీఎం కే చంద్రశేఖర్‌రావు పల్లెప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని, మొదటి విడుత విజయవంతంగా నిర్వహించారని, రెండోవిడుత పల్లెప్రగతి విజయవంతానికి తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. పల్లెప్రగతి నిర్వహణతో దేశవ్యాప్తంగా రాష్ట్రానికి మంచి గుర్తింపు వచ్చిందన్నారు. శుక్రవారం బీఆర్కేభవన్‌లో రెండోవిడుత పల్లెప్రగతి నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషితో కలిసి ప్రభుత్వం నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్స్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడారు. రెండోవిడుతకు సంబంధించి జిల్లాస్థాయి సమావేశాల నిర్వహణను వెంటనే పూర్తిచేయాలని కలెక్టర్లను ఆదేశించారు. గ్రామపంచాయతీల కోసం ప్రతి నెల రూ.339 కోట్లను విడుదల చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లోని యువకులు, మహిళలు, పెన్షనర్లు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులు అయ్యేలా చూడాలని చెప్పారు. గ్రామాలవారీగా చేపట్టిన, చేపట్టబోయే పనులు, కార్యక్రమాల వివరాలపై బుక్‌లెట్ అందించాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో ట్రాక్టర్ల కొనుగోలుకు చర్యలు సత్వరం పూర్తిచేయాలని ఆదేశించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునే స్ఫూర్తి కలిగేలా ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. గ్రామాల్లో నర్సరీలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులకు స్థల సేకరణ, నాటిన మొక్కల సంరక్షణ, శిథిల గృహాల తొలగింపు, పాతబావుల పూడ్చివేత, డస్ట్ బిన్ల సరఫరా, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం వంటి అంశాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. జనవరి 2న నిర్వహించే గ్రామసభల్లో ఫ్లయింగ్ స్క్వాడ్స్ పాల్గొనాలని చెప్పారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సరైన రీతిలో పల్లెప్రగతిని నిర్వహించేలా చూడాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించేవారిపై చర్యలు తీసుకోవడంతోపాటు బాగా పనిచేసేవారిని ప్రోత్సహించాలని తెలిపారు. పరిశుభ్రతలో మెదక్ జిల్లా మల్కాపూర్‌ను స్ఫూర్తిగా తీసుకొని గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలని చెప్పారు.

**ఒక్కో ఫ్లయింగ్ స్క్వాడ్‌కు 12 మండలాలు: సీఎస్ జోషి**

పల్లెప్రగతి కార్యక్రమాల పనితీరును పరిశీలించేందుకు 50 మంది రాష్ట్రస్థాయి అధికారులను ఫ్లయింగ్ స్క్వాడ్స్‌గా నియమించామని, ప్రతి అధికారికి 12 మండలాల చొప్పున కేటాయించామని, ప్రతి మండలంలో రెండు గ్రామపంచాయతీలను సందర్శించి పనుల పురోగతిని, నాణ్యతను, కార్యక్రమ అమలును పరిశీలిస్తారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి తెలిపారు. 2న నిర్వహించే గ్రామసభలో పాల్గొనాలని, మార్చి 31నాటికి తమకు కేటాయించిన మండలాలను సందర్శించి పల్లెప్రగతి కార్యక్రమాల అమలు, గ్రామాలకు చేకూరిన లబ్ధిని అంచనా వేయాలని చెప్పారు. ప్రతి అధికారికి 23 అంశాల ప్రొఫార్మాను ఇచ్చామని, ప్రతి అంశానికి 1 నుంచి 5 వరకు గ్రేడింగ్ ఇవ్వాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ రూపొందించే మొబైల్ యాప్‌లో డాటాను ఫీడ్‌చేయాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి గ్రామపంచాయతీని అభివృద్ధిచేసి దేశంలో రోల్‌మోడల్‌గా నిలువాలన్న సీఎం కేసీఆర్ ఉద్దేశాన్ని సక్రమంగా అమలుచేయాలని సీఎస్ కోరారు. రెండోవిడుత పల్లెప్రగతికి ముందే గత పల్లెప్రగతి కార్యక్రమాల అమలు, ఖర్చు, రెండోవిడుత నిర్వహణ ప్రణాళిక, బడ్జెట్‌ను గ్రామపంచాయతీ కార్యదర్శులు రూపొందించాలన్నారు. ప్రత్యేక ఆఫీసర్స్ తమకు కేటాయించిన గ్రామాలను సందర్శించాలని చెప్పారు. రెండోవిడుత పల్లెప్రగతిలో ఒకరోజు శ్రమదానానికి ప్రత్యేకంగా కేటాయించాలని తెలిపారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. పల్లెప్రగతిపై సీఎం కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర యంత్రాంగం అంతా ప్రత్యేక దృష్టి సారించిందని, కలెక్టర్లు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సమావేశంలో ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి కే రామకృష్ణారావు, కార్మిక, ఉపాధిశాఖల ముఖ్యకార్యదర్శి శశాంక్ గోయల్, ఎంసీహెచ్చార్డీ అడిషనల్ డీజీ హరిప్రీత్‌సింగ్, సీఎంవో కార్యదర్శి స్మితా సభర్వాల్, విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ రఘునందన్‌రావు, రిజిస్ట్రేషన్‌శాఖ ఐజీ చిరంజీవులు, కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ నీతూప్రసాద్, ఎక్సైజ్‌శాఖ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, మేడ్చల్ కలెక్టర్ ఎంవీ రెడ్డి, సివిల్ సప్లయ్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, దేవాదాయ కమిషనర్ అనిల్‌కుమార్, పోలీస్ అధికారులు గోవింద్‌సింగ్, డీఎస్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.



పల్లెప్రగతి నిర్వహణపై శుక్రవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో సీఎస్ ఎస్కే జోషి, ఇతర ఉన్నతాధికారులు కూడా ఉన్నారు.

# 5న పోలింగ్ కేంద్రాల జాబితా

- 13లోగా తుది జాబితా ప్రచురణ
- షెడ్యూల్ విడుదలచేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పురపోరుకు రాష్ట్ర ఎన్నికల సంఘం చకాచకా ఏర్పాట్లు చేస్తున్నది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై సర్క్యులర్ జారీచేసింది. ఆ ప్రతులను ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. పోలింగ్ కేంద్రాల ప్రకటనపై శుక్రవారం షెడ్యూల్ విడుదలచేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం.. వచ్చేనెల 5న పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రచురించాలని పేర్కొన్నది. వచ్చేనెల 13వ తేదీలోగా ఈ ప్రక్రియను పూర్తిచేయనున్నది. పోలింగ్ కేంద్రాల తుదిజాబితా వరకు జరిగే ప్రక్రియను కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు పర్యవేక్షించాలని ఎన్నికల సంఘం సూచించింది. రిటర్నింగ్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించాలని ఆదేశించింది.

**పోలింగ్ కేంద్రాల ప్రకటన షెడ్యూల్ ఇలా..**

- 4.1.2020న ప్రచురించే తుది ఓటరు జాబితాకు అనుగుణంగా అదేరోజు మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల కమిషనర్లు పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను రూపొందించాలి.
- 5.1.2020న పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను ప్రచురించాలి.
- 7.1.2020న ఉదయం 11 గంటలకు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లస్థాయిలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించాలి.
- 5.1.2020 నుంచి 8.1.2020 సాయంత్రం ఐదుగంటల వరకు పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాపై ఫిర్యాదులు, అభ్యంతరాలు, సూచనలు స్వీకరించాలి.
- 9.1.2020న ఫిర్యాదులు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని పరిష్కరించాలి.
- 13.1.2020న మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని పోలింగ్ కేంద్రాల తుది జాబితాను వార్డులవారీగా ప్రచురించాలి.

# రాజకీయ పార్టీలతో నేడు ఎస్‌ఈసీ భేటీ

- పురపోరులో బ్యాలెట్ పత్రాలపై అభ్యర్థుల పేర్లు, పార్టీ ఎన్నికల చిహ్నం
- శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా భద్రతా చర్యలు
- కలెక్టర్లు, ఎస్పీల వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌ఈసీ కమిషనర్ నాగిరెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పురపోరుకు సంబంధించి రాజకీయ పార్టీలతో భేటీ అయ్యేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఎస్‌ఈసీ కార్యాలయంలో శనివారం ఉదయం 11.30 గంటలకు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఇప్పటికే రాజకీయ పార్టీలకు సమాచారం ఇచ్చారు. వచ్చే నెల 22న రాష్ట్రంలోని 120 మున్సిపాలిటీలు, పది కార్పొరేషన్లకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పురపోరు నిర్వహణ, ఏర్పాట్లపై శుక్రవారం రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ వీ నాగిరెడ్డి.. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీజీపీ మహేందర్‌రెడ్డి, పురపాలకశాఖ డైరెక్టర్ టీకే శ్రీదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై కమిషనర్ నాగిరెడ్డి సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల బ్యాలెట్ పత్రాలపై అభ్యర్థుల పేర్లతో పాటు సంబంధిత పార్టీల ఎన్నికల గుర్తులు ముద్రిస్తామని తెలిపారు. అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాతే (జనవరి 14) బ్యాలెట్ పత్రాలు ముద్రణకు ఇవ్వనున్నట్లు స్పష్టంచేశారు. ఈ ఎన్నికల దృష్ట్యా ఎక్కడా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసుశాఖను ఆదేశించారు. ప్రస్తుతం ఎన్నికలు జరుగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో దాదాపు 53 లక్షల మంది ఓటర్లు ఉండొచ్చని ఎస్‌ఈసీ అంచనా వేస్తున్నది. గతంలో సిద్ధంచేసిన ఓటరు జాబితాతో పోలిస్తే కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఓటర్ల సంఖ్య మరింత పెరుగొచ్చని భావిస్తున్నది. ఇప్పటికే ఒక్కో బూత్‌లో గరిష్ఠంగా 800 ఓటర్ల చొప్పున ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించిన విషయం తెలిసిందే. కొత్తగా పెరిగే ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన చోట్ల కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఎస్‌ఈసీ ఆదేశించింది. పెరుగనున్న పోలింగ్ కేంద్రాలకు అనుగుణంగా బందోబస్తుకు అదనంగా పోలీసులను నియమించాలని సూచించింది. గతంలోనే ఎన్నికల విధులు నిర్వహించే వివిధ స్థాయిల అధికారులకు పలు విడుతలుగా శిక్షణ ఇచ్చినప్పటికీ కీలకమైన రిటర్నింగ్ అధికారులు (ఆర్వో)గా విధులు నిర్వహించేవారికి ఎన్నికల విధులు, బాధ్యతలకు సంబంధించి మరోసారి శిక్షణ ఇవ్వాలని ఆదేశించింది.


MSME-TOOL ROOM, HYDERABAD
(CENTRAL INSTITUTE OF TOOL DESIGN)
(A Government of India Society, Ministry of MSME)
Balanagar, Hyderabad, PIN-500 037

**Walk-in Interview**

Applications are invited for the following posts; which are purely on consolidate payment and contractual basis, which will be renewed yearly on performance review and need of the institute.

**1. Faculty for CAD/CAM/CAE** *(Date of Interview- 04/01/2020)*
**Essential Qualification:** M.E/M.Tech in Mechanical Engineering/PG in Tool Design & CAD CAM/M.E. Mechanical CAD/CAM or equivalent.
**Experience:** Should have expertise in imparting technical training in the field of mechanical CAD/CAM/CAE subjects for at least 03 years.

**2. Faculty for Tool Design** *(Date of Interview- 04/01/2020)*
**Essential Qualification:** Diploma in Tool, Die & Mould Making/ PG in Tool Design & CAD CAM /M.E. in Tool Design or equivalent.
**Experience:** Should have expertise in imparting technical training in the field of Tool Design subjects (both theory & practicum) and humanities subjects viz. Industrial Management/Entrepreneurship for at least 03 years.

**3. Faculty for Computer Science** *(Date of Interview- 04/01/2020)*
**Essential Qualification:** B.E./B.Tech or M.E./M.Tech in Computer Science or equivalent.
**Experience:** Should have expertise in imparting technical training in the field computer science subjects (both theory & practicum) for at least 02 years.

**4. Lab Engineer for Electronics Lab** *(Date of Interview- 04/01/2020)*
**Essential Qualification:** Diploma in Electronics/Mechatronics or equivalent.
**Experience:** Should have expertise in repair and maintenance of electronics equipment, inventory management of consumables, preparation of lab manuals for electronics experiments for at least 02 years.

**5. Lab Assistant for Electronics Engineering** *(Date of Interview- 11/01/2020)*
**Essential Qualification:** Diploma in Electronics/Electrical/Mechatronics Engineering or equivalent.
**Experience:** Should have expertise in imparting practical technical training in the field of Electronics and Electrical Engineering subjects for at least 05 years.

**6. Faculty for Mechanical Engineering** *(Date of Interview- 11/01/2020)*
**Essential Qualification:** M.E/M.Tech in Mechanical Engineering or equivalent.
**Experience:** Should have expertise in imparting technical training in the field of Mechanical Engineering subjects viz. Engineering Research Methodology, Rapid Proto Typing and Reverse Engineering (both theory & practicum).

**7. Instructor/Operator for Grinding Machine** *(Date of Interview- 04/01/2020)*
**Essential Qualification:** ITI/Diploma in relevant branch of engineering.
**Experience:** Should have expertise in operating Surface, Cylindrical, Tool & Cutter Grinding Machines for at least 03 years. Should able to communicate in English.
**Job Role:** To impart training to diploma students.

Candidates fulfilling the eligibility criteria may step-in for walk-in interview **(09:30 a.m. - 11:30 a.m. registration time)** with one passport size photo, original documents & one set self-attested photocopies of all certificates. Candidates are advised to prepare to stay till late evening whenever necessary.

***N.B.: No applicants will be entertained after 11:30 a.m.***
**Contact Details: E-Mail: adminltrg@citdindia.org**

Sd/-
PRINCIPAL DIRECTOR


## 'పీఎం కిసాన్' నిధులు విడుదల

22.36 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమకానున్న నాలుగోవిడుత రూ.447 కోట్లు


**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం నిధులు విడుతలవారీగా రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఇప్పటివరకు మూడువిడుతల్లో నిధులు రాగా, తాజాగా నాలుగోవిడుత నిధులు రైతుల ఖాతాల్లో జమకానున్నాయి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.447 కోట్లను శుక్రవారం విడుదల చేసినట్టు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేల చొప్పున, మొత్తం 22.36 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

## ఓయూ దూరవిద్య పీజీ ఫలితాల విడుదల

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రం ప్రొఫెసర్ జీ రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్‌ఆర్‌సీడీఈ) పరిధిలోని పీజీ కోర్సుల ఫలితాలను విడుదల చేసినట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఉర్దూ, ఫిలాసఫీ, జర్నలిజం, వేదిక్ ఆస్ట్రాలజీ, హిందీ తదితర పీజీ కోర్సుల ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు.

# ఎస్సారార్ @ 25.04 టీఎంసీలు

- జలాశయాన్ని తొలిసారి పూర్తిగా నింపిన అధికారులు
- కాళేశ్వరం మోటర్లతో జలాల ఎత్తిపోత నిలుపుదల



తొలిసారి పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరడంతో జలకళ సంతరించుకొన్న శ్రీరాజరాజేశ్వర జలాశయం

**హైదరాబాద్/ రామడుగు /ధర్మారం/బోయినపల్లి/వేములవాడ, నమస్తేతెలంగాణ:** శ్రీరాజరాజేశ్వర జలాశయం నిండుకుండలా మారింది. అధికారులు తొలిసారిగా పూర్తిస్థాయిలో నింపారు. 25.873 టీఎంసీల పూర్తి నీటినిల్వ సామర్థ్యానికిగాను శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకు 25.04 టీఎంసీలకు చేరుకున్నది. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టు లింక్ -2లోని నంది, గాయత్రీ పంప్‌హౌస్‌లలో 23 రోజులుగా విరామం లేకుండా నడుస్తున్న మోటర్లను అధికారులు నిలిపివేశారు. రాత్రివరకు స్వల్పంగా ఇన్‌ఫ్లో వచ్చి చేరే అవకాశం ఉండటంతో అధికారులు ముందుగా ప్రకటించిన మేరకు జలాశయంలో 25.05 టీఎంసీల మేర నీటినిల్వను నిర్వహించనున్నారు. గతంలో ఎస్సారార్‌ను తొలి విడుతగా 15 టీఎంసీల వరకు నింపి... సాంకేతిక ప్రొటోకాల్‌ను పరిశీలించిన అధికారులు ఈదఫా అన్నిరకాల జాగ్రత్తలతో పూర్తిస్థాయిలో నింపడం సఫలీకృతులయ్యారు. ఒకవైపు లోయర్ మానేరు డ్యాంలోనూ 22.581 టీఎంసీల నీటి నిల్వ ఉండటంతో ఇప్పటికైతే ఎస్సారార్ నుంచి నీటిని విడుదల చేయాల్సిన అవసరం లేదని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఎస్సారార్ నుంచి దాని పరిధిలోని చెరువులను కూడా నింపినందున జలాశయంలోని నిల్వలను అలాగే ఉంచుతామని తెలిపారు. రానున్న రోజుల్లో ఎల్‌ఎండీకి అవసరమైతే వెంటనే నీటిని విడుదలచేసేందుకు సిద్ధంగా ఉంటామన్నారు. అదేవిధంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా అన్నపూర్ణ (అనంతగిరి) రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు ఏర్పాట్లు పూర్తయితే అటువైపు నీటిని తరలించేందుకు కూడా ఈ నిల్వల్ని వినియోగించనున్నారు.

**వేములవాడ శివారుకు కాళేశ్వరం జలాలు**

ఎస్సారార్ జలాశయం నిండుకుండలా మారడంతో కాళేశ్వరం జలాలు వేములవాడ శివారును తాకాయి. మహాలక్ష్మి వీధి నుంచి సంకెపల్లికి వెళ్లే పాత రహదారి పూర్తిగా మునిగిపోయింది. వందల ఎకరాల్లోకి జలాలు చేరుకొని కోనసీమను తలపిస్తున్నాయి. తాటి, కొబ్బరిచెట్ల మధ్య నీరుచేరి ప్రజలను కనువిందు చేస్తున్నది. 40 అడుగుల మేరకు నీరు చేరుకోవడంతో పట్టణ మత్స్యకారులు ఇప్పటికే చేపల వేటను ప్రారంభించారు. మహాలక్ష్మీ వీధిలోని మూల వాగులోని ఎల్లమ్మ ఆలయం దాటి బావివరకు నీళ్లు వచ్చాయి. వేములవాడ పట్టణంతోపాటు రాజన్న గుడిచెరువుకు నీటిని అందించే పంపుహౌస్ వద్దకు భారీగా చేరిన జలదృశ్యాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

**సరస్వతీ బరాజ్‌కు తరలుతున్న గోదావరి**

**కాళేశ్వరం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని లక్ష్మీ (కన్నెపల్లి)పంప్‌హౌస్‌లో శుక్రవారం ఇంజినీర్లు ఒక మోటర్‌ను నడిపించారు. పంప్‌హౌజ్‌లోని 4వ మోటర్ ద్వారా సరస్వతీ (అన్నారం)బరాజ్‌కు 2300 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. పైపుల ద్వారా డెలివరీ సిస్టర్న్‌లో ఎత్తిపోసిన గోదావరి జలాలు గ్రావిటీ కెనాల్ ద్వారా సరస్వతీ బరాజ్‌కు తరలుతున్నాయి. ప్రస్తుతం బరాజ్‌లో 7.01టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇంజినీర్లు తెలిపారు.


TATA INSTITUTE OF FUNDAMENTAL RESEARCH
(Autonomous Institution of the Department of Atomic Energy, Government of India)
Sy.No.36/P, Gopanpally Village, Serilingampally Mandal, Ranga Reddy Dist. Hyd - 500 107
Tel: +91(0) 40 2020 3040 Website: www.tifrh.res.in

**Advertisement No. 2019/4**
Applications are invited for the following posts tenable at Hyderabad. Please visit our website for application details and prescribed requirements **http://www.tifrh.res.in/index.php/staff-positions/**.

| Sr. No. | NAME OF THE POST | RESERVATIONS UR | SC | ST | OBC | PWD | AGE BELOW | CONSOLIDATED PAY RS. | TME |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | Project Scientific Officer (C) | 1 | - | - | - | - | 28 | Rs.71,000/- Consolidated | Rs.71,000/- (including HRA of Rs.12100/-) |
| 2 | Project Scientific Officer (C) | 1 | - | - | - | - | 28 | Rs.71,000/- Consolidated | Rs.71,000/- (including HRA of Rs.12100/-) |
| 3 | Project Scientific Officer (B) | 1 | - | - | - | - | 28 | Rs.58,000/- Consolidated | Rs.58,000/- (including HRA of Rs.10200/-) |
| 4 | Project Scientific Officer (B) | 1 | - | - | - | - | 28 | Rs.58,000/- Consolidated | Rs.58,000/- (including HRA of Rs.10200/-) |

On-Line applications must be submitted by **17-01-2020 and applications by post must reach to the Administrative Officer by 17-01-2020.** Applicants who are required to send the applications by post must super scribe the post applied for, advertisement no. & Serial Number of the post on the envelope. The format of the application is as prescribed for on-line applications

Administrative Officer



తృణముల్ కాంగ్రెస్ సమస్యలను సృష్టిస్తున్నది.
మేం కూడా సమస్యలను సృష్టిస్తాం. బెంగాల్ రాజకీయాల లక్షణం ఇది.
మేం అన్నింటికీ సిద్ధంగా ఉన్నాం. జర్నలిస్టులు వార్తల కోసం చూస్తారు కదా..
అందుకోసం మేం ప్రజల్లో సమస్యలను సృష్టిస్తాం.


**దిలీప్ ఘోష్, బెంగాల్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు**

అన్నిరాష్ట్రాల్లో ప్రజలు బీజేపీని తిరస్కరిస్తున్నారు.
ఇప్పుడు వారు హింస ద్వారా బెంగాల్‌పై ఆధిపత్యం తెచ్చుకోవాలనుకుంటున్నారు.
ఘోష్‌కు బెంగాల్ రాజకీయ సంస్కృతి తెలియదు.
అందుకే అసహనంతో మాట్లాడుతున్నారు.

**తపస్ రాయ్, తృణముల్ నేత**



**చరిత్రలో నేడు**



1934

ఇంగ్లండ్-ఆస్ట్రేలియాల మధ్య ఆస్ట్రేలియాలో మొదటి అంతర్జాతీయ మహిళల టెస్ట్ క్రికెట్ మ్యాచ్.

1976

వర్ణవివక్షకు వ్యతిరేక ఉద్యమకారిణి విన్నీ మండేలాను దేశం నుంచి బహిష్కరించిన దక్షిణాఫ్రికా.





1981

అమెరికాలో మొదటి టెస్ట్‌ట్యూబ్ బేబీ జననం.

నిరంతర హింస, అంతర్గత యుద్ధంలో మునిగి ఉన్న పొరుగు దేశం ఆఫ్ఘనిస్థాన్‌లో అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగుతున్నది. దీంతో రాజకీయ ప్రక్రియ అనిశ్చితికి లోనై శాంతిస్థాపన అన్నది కనుచూపు మేరలో కనిపించటం లేదు. 2001లో తాలిబన్ల పతనం తర్వాత జరుగుతున్న ఈ నాలుగో అధ్యక్ష ఎన్నికలు కూడా సుదీర్ఘ ప్రక్రియగా జరుగుతున్నాయి. అష్రఫ్ ఘనీ 50.64 శాతం ఓట్లు తెచ్చుకొని ముందంజలో ఉన్నా ప్రత్యర్థి డాక్టర్ అబ్దుల్లా ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఎన్నికల ప్రక్రియనే తిరస్కరించటం గమనార్హం.

**ది హిందూ**

ఇవ్వాళ ఒకరోజు ఇంటర్నెట్ లేకపోతే మనిషి జీవితమే ఊహించటం కష్టంగా మారింది. మనిషి ఎక్కుడున్నా, ఏ స్థితిలో ఉన్నా చేతిలోని సెల్‌ఫోన్‌లో ఇంటర్నెట్ ద్వారా ప్రపంచంలో మునిగిపోతున్నాడు. ప్రపంచంలోనే అతి ఎక్కువ నెలసరి డాటా వినియోగిస్తున్న దేశం మనది. ఈ క్రమంలో సెల్‌ఫోన్, ఇంటర్నెట్‌లు ప్రపంచాన్ని కుగ్రామం చేస్తే, మనిషి మాత్రం ఒంటరయ్యాడు.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**



# సంయమనం అవసరం

పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా చెలరేగిన ఆందోళనల్లో దాదాపు 25 మంది మరణించడం బాధాకరం. నిరసనల తీవ్రత ఎక్కువగా ఉన్న ఉత్తరప్రదేశ్‌లోనే ఇరువై మందికిపైగా మరణించారు. నిరసనల సందర్భంగా విధ్వంసాలు సాగడం ఆందోళనకర పరిణామమే. అయితే ఉత్తరప్రదేశ్‌లోని ఘటనల సందర్భంగా పోలీసుల వ్యాఖ్యలు ఈ ఘటనల పట్ల మరింత కలవరం కలిగిస్తున్నాయి. ఆందోళనల మూలంగా యూపీలోని దాదాపు 21 జిల్లాల్లో అధికారులు ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేశారు. 327 మందిపై కేసులు నమోదు కాగా, దాదాపు ఐదు వేల మందిని ముందుస్తు అరెస్టు చేశారు. కాల్పుల్లో మరణించిన వారి వారి దేహాల్లో బుల్లెట్ గాయాలు కనిపిస్తున్నాయి. కానీ తాము కాల్చలేదని పోలీసులు అంటున్నారు. తాము ప్లాస్టిక్ పెల్లెట్లు, రబ్బర్ బుల్లెట్లు మాత్రమే ప్రయోగించామని పోలీసులు చెబుతున్నారు. తమ కాల్పుల్లో ఒకరు మాత్రమే మరణించారని వారు చెప్పడంతో మరి మిగతా వారెట్లా మరణించారనే సందేహం కలుగుతున్నది. 288 పోలీసులు గాయపడ్డారని, వారిలో అరువై రెండు మందికి బుల్లెట్ గాయాలయ్యాయన్నది వారి వాదన. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఢిల్లీతో సహా దేశవ్యాప్తంగా ఆందోళనలు సాగుతున్న నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. పలుచోట్ల మహిళలు కూడా నిరసనలకు దిగుతుండటం కూడా గమనించదగిన విషయం. పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌరపట్టికల పట్ల మొదట్లోనే విమర్శలు వచ్చినప్పటికీ, దేశవ్యాప్తంగా ఈ స్థాయిలో నిరసనలు వ్యక్తమవుతాయనేది కేంద్ర ప్రభుత్వం ఊహించి ఉండదు.

**ఉత్తరప్రదేశ్‌లో చెలరేగిన విధ్వంసం గురించి ప్రధాని ఆవేదన అర్థం చేసుకోదగినదే. నిరసనలు వ్యక్తం చేసేవారు తమ వాదనలలో బలం ఉందని భావిస్తే ఆ వాదనను ప్రజలకు సమర్థవంతంగా వినిపించాలె. ప్రభుత్వం దిగివచ్చే విధంగా తమ శాంతియుత విధానాల ద్వారా ఒత్తిడి తేవాలె. ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడమే నిరసనల ప్రధాన లక్ష్యం కావాలె. ప్రధాని మోదీ కూడా ప్రతిపక్షాలు అధికారకాంక్షతో ఈ విధమైన చర్యలకు పాల్పడుతున్నట్టుగా చిత్రీకరించడం తగదు.**

ప్రభుత్వ విధానాలు నచ్చకపోతే నిరసన తెలుపడం ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగమే. కానీ ఈ నిరసనల వ్యక్తీకరణ కూడా శాంతియుతంగా సాగాలె. నిరసనలకు దిగినవారే విధ్వంసాలకు పాల్పడకపోవచ్చు. సంఘ విద్రోహశక్తులు ఎప్పుడు ఇటువంటి సందర్భం కోసం కాచుకొని ఉంటాయి. మరోవైపు నిరసనలను తప్పుదారి పట్టించాలనే వారూ ఉంటారు. ఉత్తరప్రదేశ్‌లో విధ్వంసం తీవ్రస్థాయిలో సాగిన నేపథ్యంలో నిరసనలను సాగించేవారు జాగరూకతతో ఉండాలె. తాము నిరసనలను వ్యక్తం చేస్తున్న సందర్భంగా ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగ్రహావేశాలకు తావివ్వకూడదు. దీనివల్ల వారు ఆశించిన లక్ష్యం నెరవేరదు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను గౌరవించే సంస్కృతి ఉంటుంది. పలు సమూహాలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి లేదా తమ వాదనను చాటడానికి, ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడానికి ప్రదర్శనలు జరుపడం పరిపాటి. స్వాతంత్ర్యోద్యమంలో కూడా ఉద్యమాన్ని శాంతిబాటలో నడిపించడానికి నాయకత్వం ఎంతో ప్రయాసపడవలసి వచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ప్రజాస్వామ్యం అనేక విషమ పరీక్షలను ఎదుర్కొన్నది. అనేక సందర్భాలలో నల్ల చట్టాలకు వ్యతిరేకంగా బీజేపీతో సహా ప్రతిపక్షాలు నిరసనలు తెలిపి ప్రభుత్వ విధానాలను మార్చిన సందర్భాలున్నాయి. ఎమర్జెన్సీ విధించినప్పుడు బీజేపీ అగ్రనాయకులు కూడా నిరసనలు తెలిపి జైలు జీవితం గడిపారు. అందువల్ల నిరసనలు తప్పేమీ కాదని కేంద్ర ప్రభుత్వం కూడా గ్రహించాలె. ఇదే సందర్భంలో హింస, విధ్వంసాలు చెలరేగకుండా జాగ్రత్త పడవలసిన బాధ్యత అన్ని పక్షాలపై ఉంటుంది. ప్రభుత్వం కూడా నిరసనలు తెలిపినవారిపైనే బాధ్యతను తోసివేయకూడదు. ఉత్తరప్రదేశ్‌లో కాల్పులకు సంబంధించి భిన్నవాదనలు వినిపిస్తున్న నేపథ్యంలో దర్యాప్తు జరిపి వాస్తవాలు తేల్చవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది.

ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ భారత దేశ సంస్కృతిని భిన్నత్వంలో ఏకత్వం అంటూ ప్రశంసించారు. పౌర సవరణ చట్టానికి వ్యతిరేకంగా సాగుతున్న నిరసనలను ప్రస్తావిస్తూ, హింస, విధ్వంసాలను తీవ్రంగా ఖండించారు. మోదీని వ్యతిరేకించండి, కానీ ప్రజల ఆస్తులను నాశనం చేయకండి అని ఆయన హితవు చెప్పారు. హక్కులతో పాటు విధులు కూడా ఉంటాయని ఆయన గుర్తుచేశారు. విధ్వంసకారులు తాము చేసేది సబబేనా ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోవాలని అంటూ గాయపడిన సామాన్యులు, పోలీసుల మాటేమిటిటని ఆయన ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్‌లో చెలరేగిన విధ్వంసం గురించి ప్రధాని ఆవేదన అర్థం చేసుకోదగినదే. నిరసనలు వ్యక్తం చేసేవారు తమ వాదనలలో బలం ఉందని భావిస్తే ఆ వాదనను ప్రజలకు సమర్థవంతంగా వినిపించాలె. ప్రభుత్వం దిగివచ్చే విధంగా తమ శాంతియుత విధానాల ద్వారా ఒత్తిడి తేవాలె. ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడమే నిరసనల ప్రధాన లక్ష్యం కావాలె. ప్రధాని మోదీ కూడా ప్రతిపక్షాలు అధికారకాంక్షతో ఈ విధమైన చర్యలకు పాల్పడుతున్నట్టుగా చిత్రీకరించడం తగదు. నిరసనల ఆంతర్యాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలె. ఈశాన్యంలోని బీజేపీ మిత్రపక్షాలు కూడా కేంద్ర విధానాలకు ఎందుకు మద్దతు ఇవ్వలేకపోతున్నాయనేది ఆలోచించాలె. విధాన నిర్ణయాలు తీసుకునే ముందు సుదీర్ఘ చర్చ నిర్వహించడం, అందరి అభిప్రాయాలను గౌరవించడం ప్రజాస్వామ్య లక్షణం. నిరసనలు వ్యక్తమైనప్పుడు అన్నివర్గాలతో చర్చించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ మధ్య మోదీ ప్రభుత్వ పోకడ ఇందుకు భిన్నంగా సాగుతున్నదనే అభిప్రాయం కలుగుతున్నది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం చొరవచూపి రాజకీయ దేశవ్యాప్తంగా రాజకీయపక్షాలతో చర్చించడం మంచిది.

**జనగళం**

## కాలుష్యాన్ని నియంత్రించాలి

హైదరాబాద్‌కు సమీప పట్టణంగా, చౌటుప్పల్ పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. పరిశ్రమల అభివృద్ధి వల్ల యువతకు ఉపాధి అవకాశాలేమో కానీ చౌటుప్పల్ పరిసర ప్రాంతం కాలుష్యమయం అవుతున్నది. భూగర్భ జలాలు కూడా రసాయనాలతో కాలుష్యమైపోయి ఉపయోగానికి పనికిరాకుండాపోయాయి. కనీసం జంతువులు కూడా తాగనివిధంగా కాలుష్యమయ్యాయి. ఇక వాయు కాలుష్యానికి అంతేలేదు. నగర శివారు పట్టణాలుగా వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాలకు సమీపంలో పరిశ్రమల స్థాపనకు అనుమతులను నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసు కోవాలి.

**- బద్దం శ్రీనివాస్‌రెడ్డి, పెద్దకొండూరు, చౌటుప్పల్**

## పుస్తకోత్సవాన్ని విస్తరించాలె

హైదరాబాద్‌లో నిర్వహించబడుతున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్ విజయవంతంగా నడుస్తున్నది. బుక్ ఫెయిర్ ప్రాంగణమంతా పుస్తక ప్రియులతో కిటకిటలాడుతున్నది. నిత్యం వేలాదిమంది పుస్తక ప్రియులు సందర్శించి పుస్తకాలను కొంటున్నారు. దీంతో ఆధునిక ఇంటర్నెట్ యుగంలో పుస్తకానికి కాలం చెల్లిందన్న వాదనలకు భిన్నంగాబుక్ ఫెయిర్‌కు సందర్శకులు పోటెత్తుతున్నారు. ఈబుక్ ఫెయిర్‌లో పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు, సామాజికాంశాల పుస్తకాలు, కథలు, నవల లు, కవితా పుస్తకాలు, బాలసాహిత్యం, జాతీయంగా ప్రఖ్యాత రచయితల రచనలతో పాటు వివిధ దేశాల సాహిత్యం కూడా అందుబాటులో ఉండటం విశేషం. యువకులు, వృద్ధులతో పాటు విద్యార్థులు కూడా పెద్ద సంఖ్యలో హాజరవుతున్న తీరు పుస్తక పఠనానికి కాలం చెల్లలేదని చాటుతున్నది. ఈ పుస్తక ప్రదర్శనలను జిల్లా, మండలస్థాయి వరకు విస్తరించి నిర్వహిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఏడాదికొక్కసారి ఒక్క హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఎప్పుడూ బుక్ ఫెయిర్‌లు నిర్వహిస్తూనే ఉండాలి. ఈ దిశగా బుక్ ఫెస్టివల్ నిర్వాహకులు, ప్రభుత్వం ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాలని పుస్తక ప్రియులు కోరుతున్నారు.

**- బండారు జయశ్రీ, భువనగిరి**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

**ముక్తసరి**



**దేవులపల్లి ప్రభాకరరావు**

# రాజ్యాంగస్ఫూర్తికి విఘాతం

**యాభై ఏండ్ల కిందట 1973లో కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు (దేశంలోని అత్యున్నత న్యాయస్థానం) స్వతంత్ర భారత రాజ్యాంగం ప్రాతిపదిక స్వరూపంలో (మౌలిక స్వరూపంలో, పునాదుల్లో) మార్పులు చేసే అధికారం ఎవరికీ లేదని, పార్లమెంటుకు కూడా లేదని చరిత్రాత్మకమైన, మహత్తరమైన తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుతో ఏకీభవిస్తూ సుప్రీంకోర్టు తర్వాత ఇంకెన్నో తీర్పులు ఇచ్చింది. సుప్రీంకోర్టు తీర్పులను గౌరవించినట్లయితే భారత రాజ్యాంగంపై ఎటువంటి విభేదాలకు, వివాదాలకు, విచిత్ర వ్యాఖ్యలకు ఆస్కారం ఉండదు.**

ఏడవ నిజాం పాలనలోని, హయాంలోని చీకట్లను చూస్తున్న వారు ఎక్కువమంది-వెలుగులను చూస్తున్నవారు, ఏడవ నిజాం ఏలుబడిలో కొన్ని వెలుగులు కూడా ఉండేవని గుర్తిస్తున్నవారు చాలా తక్కువమంది. అప్పుడు కొన్ని మంచి పనులు కూడా జరిగాయని అనగానే, ఆ మాటలు అన్నవారిని వెంటనే రాజభక్తులని, దేశద్రోహులని ఆరోపించడం, ముద్రవేయడం విజ్ఞతారహితం. నిజాం పాలనలో నీతిశాస్త్రం-అఖ్‌లాఖియాత్-పాఠశాలలు, విద్యాసంస్థల పాఠ్యాంశాలలో ఒకటిగా ప్రాధాన్యం పొందింది. ఆ తర్వాత నీతిశాస్త్రాన్ని-అఖ్‌లాఖియాత్‌ను-అడిగినవారు లేరు. నీతి నియమాలకు, నైతిక వర్తనకు అనంతర సమాజంలో విలువ తగ్గింది; నీతి నియమాలు ఘోరంగా దిగజారిన సమాజం కళ్లెదుట కన్పిస్తున్నదంటే అతిశయోక్తి కాదు. ఒక తల్లి తన విలాస, క్షుద్ర జీవితానికి అడ్డుతగులుతాడన్న భయం; అనుమానంతో తన కన్న కొడుకును చంపేసిన నేరం కంటే నీచమైన, హేయమైన నేరం ఇంకేమైనా ఉంటుందా! వావివరుసలను విస్మరించిన తండ్రులు, తల్లులు, సోదరీసోదరులు, ఆత్మీయ బంధువుల గురించి విన్నప్పుడు 'ఇదా ఈనాటి కుళ్లు సమాజం' అని తలవంచక తప్పడం లేదు. బడులను గుడులుగా పరిగణించి, బడులలో పిల్లలకు నీతి పాఠాలను బోధించడానికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చిన 7వ (చివరి) నిజాం కొన్ని సందర్భాల్లో నైతిక విలువలకు, నీతి నియమాలకు, నైతిక జీవితానికి అతిగా ప్రాధాన్యం ఇచ్చారన్పిస్తుంది. హైదరాబాద్‌లోని కొందరు విద్యావంతులు వెళ్లి ఉస్మానియా విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో బాలికల హాస్టల్స్ కూడా ఉంటే బాగుంటుందని అన్నారట. 'వద్దు బాబూ వద్దు, అక్కడ బాలికల వసతి గృహాలు వద్దు. యువకుల హాస్టళ్ల దగ్గరే యువతుల హాస్టళ్లు వద్దు' అని అంటూ మరోమాట కూడా అన్నాడట. ఆ మరో మాటను ఇక్కడ రాయడం లేదు. 7వ నిజాం మాటకారి-మాటల కారిగర్, సంభాషణా చతురుడు. ఎన్నో ప్రయత్నాలు, సిఫారసుల ఫలితంగా 7వ నిజాం ఓ రోజు మొహమ్మదలీ జిన్నాకు దర్శనం ఇవ్వడానికి అంగీకరించాడు. అప్పటి హైదరాబాద్ ప్రధానమంత్రి వెంట రాగా జిన్నా కింగ్ కోఠీకి వచ్చాడు. నిజాం, జిన్నా మధ్య ఆసక్తికర సంభాషణ జరుగుతుందని భావించినవారికి ఆశాభంగం తప్పలేదు. తనముందు జిన్నా సిగరెట్ కాల్చడం నిజాంకు ఇష్టం కాలేదు. జిన్నాను చూడగానే నిజాం ముఖం కోపోద్రిక్తమైంది. వారిద్దరి సమావేశం ఆదిలోనే విఫలమైందని ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. పరిపాలన ఎవరిదైనా నీతి నియమాలకు, నీతి పాఠాలకు ప్రాధాన్యం లభించిన రోజులవి. 7వ నిజాం పాలన అంతమై, హైదరాబాద్ సంస్థానం విచ్ఛిన్నమైన తర్వాత కూడా నైతికతకు విలువ ఇచ్చిన వారున్నారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఆంగ్లంలో అద్భుత వక్తగా పేరొందిన నాటి ఒక విద్యార్థి గురించి ప్రత్యేకించి చెప్పాలె. ఆ విద్యార్థి అన్ని విషయాల్లో అత్యంత ప్రతిభావంతుడు, స్వర్ణపతక విజేత. మొదట వామపక్ష భావాలు, మార్క్స్ సిద్ధాంతాల వైపు ఆకర్షితుడైన ఆ విద్యార్థి తర్వాత క్రమంగా ఆధ్యాత్మిక చింతనకు, నీతి నియమాలకు ప్రాధాన్యం ఇచ్చాడు-ఎం.ఎన్.రాయిస్టుల వలె. ఆ విద్యార్థి ఐఏఎస్ రాత పరీక్షలో ప్రథముడిగా నెగ్గి ఇంటర్వ్యూకు వెళ్లాడు. ఇంటర్వ్యూ బాగా జరిగినా ఆ విద్యార్థిని తిరస్కరించారు. కారణం వివిధ దేశాల మధ్య వినాశకరంగా జరుగుతున్న ఆధునిక ఆయుధ ఉత్పత్తి పోటీని చూసి కలత చెంది, ఆందోళనపడి రెండవ ప్రపంచయుద్ధం ముందు, ఎనభై ఏండ్ల కిందట అమెరికాలో (యూఎస్‌ఏలో) ఓ పెద్దమనిషి ఫ్రాంక్ బుచ్‌మన్ నైతికత పరిరక్షణ ఉద్యమాన్ని ప్రారంభించాడు. ఆ ఉద్యమంతో సంబంధం ఉందన్న నెపంతో లేక కారణంతో ఓయూ విద్యార్థిని తిరస్కరించారు. నైతికతకు గ్రహణం-సంపూర్ణ గ్రహణం-బహుశా ఆ రోజుల్లోనే మొదలై ఉంటుంది. నైతికతకు గ్రహణం పట్టడం వల్లనే సమకాలిక సమాజం ఘోరంగా దిగజారుతున్నది. అతి సామాన్యులతో పాటు సమాజాన్ని నైతిక పథంలో నడిపించవలసిన పెద్దలు కొందరు కూడా ఘోర, అమానుష నేరాలకు పాల్పడుతున్న వార్తలు మరింత ఆందోళన కలిగించడం సహజం. స్వాములు, బాబాలు, పీఠాధిపతులు, ఆశ్రమాల సంఖ్య గతంలో ఎన్నడూ లేనంతగా పెరుగడం సంతోషకరమే, హర్షణీయమే. అయినా, నైతిక విలువల పతనం, సమాజం క్షీణత ఆగడంలేదు-కనీసం తగ్గడం లేదు; నిజానికి పెరుగుతున్నది. స్వాములు, బాబాలు, పీఠాధిపతులు, ఆశ్రమాల నిర్వాహకులు దర్బారు దర్శనాలను పరిమితం చేసి తమ మహిమాన్విత తపోశక్తిని సమాజంలో నైతిక విలువల పునరుద్ధరణ మీదికి అణుమాత్రమైనా ప్రసరింపజేస్తే దేశానికి ఎంతో మేలు జరుగుతుంది. కీర్తి ప్రతిష్ఠలతో పాటు బాధ్యత పెరుగుతుందని బ్రిటన్ మాజీ ప్రధాని సర్ విన్‌స్టన్ చర్చిల్ ఓ సందర్భాన అన్నాడు. ఈ దేశం స్వాములు, బాబాలు, పీఠాధిపతులకు కీర్తిప్రతిష్ఠల లోటు లేదు.

సామాజిక అక్రమాల బాధ స్వతంత్ర భారత రాజ్యాంగానికి కూడా తప్పడం లేదు. రాజ్యాంగ నైతికతకు విఘాతం విపరీతంగా జరుగుతున్నదని రాజ్యాంగ నిపుణు లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు యాభై ఏండ్ల కిందట 1973 లో కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు (దేశంలోని అత్యున్నత న్యాయస్థానం) స్వతంత్ర భారత రాజ్యాంగం ప్రాతిపదిక స్వరూపంలో (మౌలిక స్వరూపంలో, పునాదుల్లో) మార్పులు చేసే అధికారం ఎవరికీ లేదని, పార్లమెంటుకు కూడా లేదని చరిత్రాత్మకమైన, మహత్తరమైన తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుతో ఏకీభవిస్తూ సుప్రీంకోర్టు తర్వాత ఇంకెన్నో తీర్పులు ఇచ్చింది. సుప్రీంకోర్టు తీర్పులను గౌరవించినట్లయితే భారత రాజ్యాంగంపై ఎటువంటి విభేదాలకు, వివాదాలకు, విచిత్ర వ్యాఖ్యలకు ఆస్కారం ఉండదు. బ్రిటన్ తదితర దేశాలకు భిన్నంగా స్వతంత్ర భారతదేశంలో రాజ్యాంగమే సుప్రీం. ఈ సత్యాన్ని గుర్తించకపోవడం వల్లనే రాజ్యాంగానికి తూట్లు పొడిచే కుట్రలు చేస్తున్నారు. గత ఆరేండ్లలో ఇటువంటి కుట్రలు విచ్చలవిడిగా జరిగాయి, జరుగుతున్నాయి. సెక్యులరిజం (మతాతీత లౌకిక విధానం) భారత రాజ్యాంగ ప్రాతిపదిక స్వరూపంలో ప్రధాన భాగమన్న నిశ్చితాభిప్రాయాన్ని కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు స్పష్టంగా వ్యక్తపరిచింది. నిజానికి, కేశవానంద భారతి కేసు తీర్పు తర్వాతనే భారత రాజ్యాంగం అవతారికలో 'సెక్యులరిజం' అన్న పదం చేరింది. సెక్యులరిజం నామరూపాలు లేకుండా చేసి భారత రాజ్యాంగం స్ఫూర్తికి విఘాతం కలిగించడమే ఈరోజు గత ఆరేండ్ల నుంచి నయా పాలకుల ప్రధాన లక్ష్యమైంది. ఇందుకు ఇటీవలి ప్రబల నిదర్శనాలు-సంబంధిత ప్రజల, ప్రజాప్రతినిధుల, నేతల, అక్కడి రాజకీయపార్టీల అభిప్రాయాలు తెలుసుకోకుండానే, కట్టుకథలు ప్రచారం చేసి జమ్ము కశ్మీరు రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న 370వ ఆర్టికల్ ను నిర్వీర్యపరిచి ఆ రాష్ట్రాన్ని మూడుముక్కలు చేయడం; రాజ్యాంగస్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ ఒక వర్గం వారిని భారత పౌరసత్వానికి అనర్హులను (మతం పేరిట) చేసే పౌరసత్వ సవరణ బిల్లును చట్టం చేసి, ఏదో ఒక రూపంతో భారతపౌరుల జాతీయ రిజిస్టర్‌ను రూపొందించే కుట్రలు చేయడం. ఇటీవల ఢిల్లీలో అటల్ బిహారీ వాజపేయి స్మారక ప్రసంగం కావిస్తూ మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ వ్యక్తపరచిన ఈ అభిప్రాయం గమనార్హమైనది. ఆయన మాటలు.. "A numerical majority in elections gives you the right tomake stable government. The lack of popular majority forbids you from a majoritari-an government.That is the message and essence of our parliamentary democracy.." 2014లో, 2019లో మోదీజీ బీజేపీ కూటమికి కేంద్రంలో ఒక సుస్థిర ప్రభుత్వం ఏర్పాటుచేసే సంఖ్యాబలం మాత్రమే లభించింది. 2014లో మోదీజీ పార్టీకి 31 శాతం, 2019లో 37 శాతం ఓటర్ల (మొత్తం పోలయిన ఓట్లలో) మద్దతు మాత్రమే లభించింది. ఆయనది 2014లో గానీ, 2019లో గానీ మెజారిటీ ప్రజల ప్రభుత్వం కానే కాదు. 2014 నుంచి మోదీజీ ప్రభుత్వపు వివిధ చర్యల పట్ల దేశ ప్రజల గుండెల్లో బలంగా పేరుకుపోయిన నిరసన ఈ రోజు అగ్నిపర్వతం వలె బద్దలై ప్రతిఘటన రూపం ధరిస్తున్నది. ఇది స్వచ్ఛంద ప్రజా ఉద్యమం. దేశమంతటా విస్తరించిన ఈ నిరసన, ప్రతిఘటన ఉద్యమం ఏదో ఒక పార్టీది కాదు-అది విశేషం. గత ఆరేండ్ల నుంచి కపట, కుహనా దేశభక్తిని, జాతీయవాదాన్ని (నేషనలిజాన్ని) తమ గుత్తాధిపత్యంతో, తమ జాగీరుగా చేసుకొని కోట్లాది దేశ ప్రజలను తమ ఇష్టానుసారం ఆటలాడించిన వారికి ఈ ప్రజా ఉద్యమాలతో చుక్కలు కనిపిస్తున్నాయి. దేశ ప్రజలిక తమ కూడు, గుడ్డ, గూడు సమస్యలకు ప్రాధాన్యం ఇస్తూ, నిజమైన దేశభక్తికి నీరాజనం ఇస్తున్నారు. గిరీశం చివరి డైలాగ్ 'డామిట్ కథ అడ్డం తిరిగింది' అని అనక తప్పడం లేదు.

**2014లో మోదీజీ పార్టీకి 31 శాతం, 2019లో 37 శాతం ఓటర్ల (మొత్తం పోలయిన ఓట్లలో) మద్దతు మాత్రమే లభించింది. ఆయనది 2014లో గానీ, 2019లో గానీ మెజారిటీ ప్రజల ప్రభుత్వం కానే కాదు. 2014 నుంచి మోదీజీ ప్రభుత్వపు వివిధ చర్యల పట్ల దేశ ప్రజల గుండెల్లో బలంగా పేరుకుపోయిన నిరసన ఈ రోజు అగ్నిపర్వతం వలె బద్దలై ప్రతిఘటన రూపం ధరిస్తున్నది.**

# తెలంగాణ యోధ మర్రి చెన్నారెడ్డి


**సందర్భం**



**ప్రొఫెసర్ జి.లక్ష్మణ్**

తెలంగాణ గడ్డపై పుట్టిన రాజకీయ దురంధరుల్లో అగ్రగణ్యుడు డాక్టర్ మర్రిచెన్నారెడ్డి. తెలంగాణ ప్రాంత సమస్యలు వాటి మూలాలపైనే కాకుండా వాటి శాశ్వత పరిష్కార మార్గాలపైన కూడా స్పష్టమైన అవగాహన ఉండి, ప్రజల మనోభావాలను పసిగట్టడంలో తనకు తనే సాటి అనిపించుకున్న వ్యక్తి మర్రిచెన్నారెడ్డి. అందుకే మేధావి, రాజనీతిజ్ఞుడు అయిన చెన్నారెడ్డి అంటే కేసీఆర్‌కు అత్యంత అభిమానం. రాజకీయాల్లో ఎన్నో విమర్శలు, ఒడిదుడుకులు ఎదుర్కొని స్వశక్తితో ఆశించినస్థాయిలో అధిష్టానం ఆశీస్సులు లేకున్నా అంచెలంచెలుగా ఎదిగి రెండు పర్యాయాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన ఘనత ఆయనది. ఈ నెల 29న జరుగనున్న వారి శతజయంతి ముగింపు వేడుకల సందర్భంగా ఓసారి ఆయన గురించి మననం చేసుకుందాం.

మర్రి చెన్నారెడ్డి పూర్వ రంగారెడ్డి జిల్లా మర్పల్లి మండంలోని సిరిపురం గ్రామంలో 1919 జనవరి 13న బుచ్చమ్మ-లక్ష్మారెడ్డి దంపతులకు జన్మించారు. విద్యార్థి దశ నుంచి పలు రంగాల్లో క్రియాశీలం గా ఉంటూ, ప్రతిభావంతమైన చురుకైన విద్యార్థిగా పేరు సంపాదించుకున్నారు. తన విద్యాభ్యాసం అంతా ఉర్దూ మాధ్యమంలోనే కొనసాగింది. వైద్య విద్యను సహితం (ఎంబీబీఎస్) ఉర్దూ మాధ్యమంలోనే పూర్తిచేసుకుని కొంత కాలంపాటు వైద్యవృత్తిని ఆచరించారు. 1942లో ఆంధ్ర మహాస భ ప్రధాన కార్యదర్శిగా, 1946లో హైదరాబాద్ సిటీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా 1950-52 మధ్యకాలంలో కొనసాగిన ప్రొవిజినల్ పార్లమెంట్ కు నామినేటెడ్ మెంబర్‌గా, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ విప్‌గా కొనసాగారు. 1952లో తొలిసారి శాసనసభకు ఎన్ని కైన ఆయన ఆ తర్వాత వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై వ్యవసాయం, వాణిజ్యపన్నులు, పంచాయతీరాజ్, ప్లానింగ్, ఆర్థిక, విద్యా శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వహించినారు. 1967లో కేంద్రంలో ఉక్కుగనుల శాఖ మంత్రిగా విశిష్ట సేవలందించి అదే సంవత్సరం రాజ్యసభకు ఎన్నికైండు. తర్వాత ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, తమిళనాడు, పాండిచ్చేరిలకు గవర్నర్‌గా విశిష్ట సేవలందించారు.



ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల మధ్య వివిధరంగాల్లో నెలకొని ఉన్న వ్యత్యాసాల మూలంగా రెండు ప్రాంతాలను కలిపి ఒకే రాష్ట్రంగా ఏర్పాటుచేసి ఒకే పాలనా యంత్రాంగం కిందికి తీసుకవస్తే తెలంగాణ ప్రాంతానికి భవిష్యత్తులో జరుగబోయే నష్టాల గురించి ముందుగానే పసిగట్టిన మేధావి చెన్నారెడ్డి. అందుకే తెలంగాణవాదం కనుమరుగైపోకుండా అది సజీవంగా ఉండేవిధంగా దానికి బీజాలు వేసిన వ్యక్తి చెన్నారెడ్డి. 1956లో భాషా ప్రాతిపదికన తెలంగాణను ఆంధ్రలో విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పాటుచేసే ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించి, అనివార్య పరిస్థితుల్లో గత్యంతరం లేక తెలంగాణ విలీనాన్ని తెలంగాణ రక్షణల పేరిట కుదిరిన పెద్దమనుషుల ఒప్పందం ద్వారా అంగీకరించి, ఆ ఒప్పందానికి తానే స్వయాన రూపమిచ్చి విలీనం బేషరతుకాదు కొన్ని షరతులకు లోబడే అన్న విషయాన్ని చెప్పకనే చెప్పిండు. ఒప్పందం ద్వారా తెలంగాణకు ఇవ్వబడిన రక్షణలు ఉల్లంఘనకు గురైతే తమకు విడిపోయే హక్కు ఉంటుందన్న భావజాలం ఒప్పందంలో అంతర్లీనంగా ఉంది. రక్షణల ఉల్లంఘన జరిగినందుననే తానే స్వయాన 1969లో తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించింది. 1973లో అమ ల్లోకి వచ్చిన ఆరు సూత్రాల పథకంలో సహితం విద్యా ఉపా ధి అవకాశాల్లో తెలంగాణకు కొన్ని రిజర్వేషన్లు కల్పించబడినవి. ఈ ఆరు సూత్రాల పథకం రూపకర్త కూడా చెన్నారెడ్డే. అవి కూడా ఉల్లంఘనకు గురికావడం వల్లనే మలిదశ ఉద్యమం ఊపిరి పోసుకున్నది. ఊపందుకున్నదన్నది.

చెన్నారెడ్డి ఎదుర్కొనన్ని విమర్శలు మరో రాజకీయ నాయకుడెవ్వరు ఎదుర్కోలేదు. 1971లో లోక్‌సభకు జరిగిన మధ్యంతర ఎన్నికల్లో తెలంగాణలోని 14 లోక్‌సభ స్థానాల్లో ఆయన నేతృత్వంలోని ప్రజాసమితి నాటి ఇందిరా ప్రభంజనాన్ని ఎదురొడ్డి పదిస్థానాలను కైవసం చేసుకున్నది. దీన్ని గమనించిన ఇందిరా గాంధీ 1972లో జరుగబోయే శాసనసభ ఎన్నికలను దృష్టితో ఉం చుకొని గెలిచిన పదిమంది సభ్యుల్లో 8 మందిని జి.వెంకటస్వామి మధ్యవర్తిత్వం ద్వారా తన పార్టీలోకి లాక్కొని చెన్నారెడ్డిని నిస్సహాయస్థితికి నెట్టివేసింది. జరిగిన ఈ విషయాన్ని వెంకటస్వామి బహిరంగంగా పలుసందర్భాల్లో వెల్లడించారు. గెలిచిన ప్రజాసమితి అభ్యర్థులను ఏ విధంగా కాంగ్రెస్‌పార్టీలో కలుపుకున్నారో తెలుపుతూ వెంగళరావు తన ఆత్మకథలో ఇదే విషయాన్ని ప్రస్తావించారు. వాస్తవం ఇలా ఉంటే గవర్నర్ పదవికోసం చెన్నారెడ్డి ప్రజాసమితిని కాంగ్రెస్‌లో విలీనం చేసి తెలంగాణ ప్రజలను మోసగించారనే దుష్ప్రచారం తీవ్రంగా కొనసాగింది. దీనికి కొన్ని పత్రికలు వత్తాసు పలికినయి. 1978లో ఓ సారి, 1989లో మరోసారి రెండు పర్యాయాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన చెన్నారెడ్డిని పూర్తికాలం ఎప్పుడూ కొనసాగనివ్వలేదు. రెండు పర్యాయాలు కలిపి కూడా మూడున్నరేండ్లకు మిం చి పనిచేయనీయలేదు. అతను పనిచేసిన స్వల్పకాలంలో అమ లుచేసిన ప్రధాన నిర్ణయాలను ఓసారి పరిశీలిద్దాం.

1978కి పూర్వం రంగారెడ్డి జిల్లా లేదు. అది అప్పటి హైదరాబాద్ జిల్లాలో భాగంగా ఉండేది. దాన్ని రూరల్ హైదరాబాద్ జిల్లాగా పిలిచేవారు. 1973లో వచ్చిన ఆరు సూత్రాల పథకంలోని స్థానిక ఉద్యోగ రిజర్వేషన్లు ఈ జిల్లాకు వర్తించవని ఇది ఫ్రీజోన్‌లో భాగమని ఈ రూరల్ హైదరాబాద్ ప్రాంతంలో కూడా అమలుచేసేవారు కాదు. దీన్ని గమనించిన చెన్నారెడ్డి 1978లో తొలిసారి ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన తర్వాత రూరల్ హైదరాబాద్ ప్రాంతాన్ని జంటనగరాలతో విడగొట్టి దాన్నొక జిల్లాగా ఏర్పాటుచేసి అక్కడి ఉద్యోగాల్లో సైతం స్థానికులకు రిజర్వేషన్లు అమలుజరిగేలా చర్యలు చేపట్టారు. ఈ జిల్లా ఏర్పాటుకు సంబంధించిన కారణాలు ఇలా ఉంటే ప్రచారం జరిగింది మాత్రం దీనికి భిన్నంగా ఉంది. చెన్నారెడ్డికి తన మామపై ఉన్న ప్రేమాభిమానాలను చాటుకునేందుకే ఆ జిల్లాను ఏర్పాటుచేసి దానికి రంగారెడ్డి జిల్లా అని పేరు పెట్టినట్లు దుష్ప్రచారం చేశారు. 1969 ఉద్యమ ఫలితంగా పురుడుపోసుకున్న శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు పనులు నత్తనడకన కొనసాగడం గమనించి కోటిరెడ్డి అనే ఇంజినీర్ ద్వారా యుద్ధప్రాతిపదికన కాల్వలు పూర్తిచేసి వరంగల్ జిల్లా బీడు భూములకు నీళ్లందించిన ఘనత చెన్నారెడ్డిది. ప్రతీ పల్లెకు బస్సు, విద్యుత్ అనే నినాదంతో గ్రామాల వికాసానికి దోహదపడినారు. జంట నగరాల్లో సెట్విన్ సర్వీస్ నిర్వహణను నిరుద్యోగులకు అప్పజెప్పి సిటీ పరిసర ప్రాంతాల రైతుల కోసం కార్గో బస్సులను ప్రవేశపెట్టారు. ఇంటికో బర్రె అనే నినాదంతో తెలంగాణలో పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషిచేశారు. ఉద్యోగస్తుల పదవీ విరమణ వయస్సు 55 ఏండ్ల నుంచి 58కి పెంచటంతోపాటు స్థానిక సంస్థల్లో ఎస్సీలకు కార్యనిర్వాహక పదవుల్లో రిజర్వేషన్లు కల్పించారు. ఇలా స్వల్పకాల వ్యవధిలోనే చాలా సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టారు చెన్నారెడ్డి.

ఉర్దూ, తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో అనర్గళంగా ప్రసంగించే వ్యక్తి చెన్నారెడ్డి. రాజకీయంగానే కాకుండా తార్కికంగా కూడా తెలంగాణ వాదానికి పెద్దమనుషుల ఒప్పందం, ఆరు సూత్రాల పథకం పేరిట బీజాలు వేసి వాదం సజీవంగా ఉండేలా దోహదపడినారు. అలాంటివ్యక్తి శతజయంతి వేడుకల సందర్భంగా వారిని స్మరించుకోవాల్సిన అవసరం ఉన్నది. దీంతో పాటు పూర్వరంగారెడ్డి జిల్లాలో చెన్నారెడ్డి స్మారక స్థూపాన్ని స్థాపిస్తారని ఆశిద్దాం.

**(మరి చెన్నారెడ్డి శతజయంతి ఉత్సవ వేడుకల సందర్భంగా)**

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com




# ఆ క్షిపణి వేగం గంటకు 33,000 కి.మీ.

## రష్యా అమ్ములపొదిలో 'అవాన్‌గార్డ్' క్షిపణి!

### ధ్వని కంటే 27 రెట్లు ఎక్కువ వేగం

**మాస్కో:** రష్యా సైనిక బలగాల అమ్ములపొదిలోకి అధునాతన 'అవాన్‌గార్డ్' క్షిపణి వచ్చి చేరింది. దీన్ని శుక్రవారం సైనిక బలగాలకు అందజేసినట్లు ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు రక్షణశాఖ మంత్రి సెర్గెయి షోయ్గు చెప్పారు. రష్యా సైనిక బలగాల అమ్ముల పొదిలో చేరిన తొలి హైపర్ సోనిక్ క్షిపణి కూడా ఇదే. గంటకు సుమారు 33 వేల కిలోమీటర్ల వేగం లేదా 'మ్యాక్ 27' వేగంతో ఈ క్షిపణి ప్రయాణిస్తుందని పరీక్షల్లో తేలింది. 'మ్యాక్ 1' అంటే ధ్వని వేగంతో సమానం (ధ్వని వేగం గంటకు 1,235 కి.మీ.)తాజా క్షిపణికి సంబంధించిన చిత్రాలను గతఏడాది ఓ సమావేశంలో అధ్యక్షుడు పుతిన్ విడుదల చేశారు. ఇప్పటివరకున్న అన్ని క్షిపణి వ్యవస్థలను ఓడించగల సత్తా ఈ అవాన్‌గార్డ్ క్షిపణికి ఉన్నట్టు ఆయన ఆ సందర్భంగా పేర్కొన్నారు. ధ్వని వేగంతో పోలిస్తే 27 రెట్లు ఎక్కువ వేగంతో ప్రయాణించే తొలి హైపర్‌సోనిక్ క్షిపణిగా ఈ అవాన్‌గార్డ్ క్షిపణి నిలిచిందని నిపుణులు పేర్కొంటున్నారు.కంబాట్ సర్వీసుల్లో ఇలాంటి వేగవంతమైన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని తీసుకొచ్చిన తొలి దేశం రష్యానేనని వాళ్లు తెలిపారు. అత్యధిక వేగంతో ప్రయాణించే ఈ క్షిపణి కదలికలను అంచనా వేయడం అంత సులువు కాదని ఉప ప్రధాని బోరిసోవ్ అన్నారు.

### ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన క్షిపణులు

**పేరు:** డీఎఫ్ 41
**దేశం:** చైనా
**వేగం గంటకు:** 30,626 కి. మీ.





**పేరు:** అగ్ని I–IV
**దేశం:** భారత్
**వేగం గంటకు:** 12,600 కి. మీ.

**పేరు:** యూజీఎం–133 ట్రైడెంట్ II
**దేశం:** అమెరికా
**వేగం గంటకు:** 29,020 కి.మీ.

**పేరు:** కొర్రమ్‌షహర్
**దేశం:** ఇరాన్
**వేగం గంటకు:** 19,750 కి. మీ.

**పేరు:** ఆర్ఎస్ –24
**దేశం:** రష్యా
**వేగం గంటకు:** 24,500 కి. మీ.

**పేరు:** జెరికో III
**దేశం:** ఇజ్రాయెల్
**వేగం గంటకు:** 11,500 కి. మీ.

**పేరు:** ఎల్ జీఎం–30 మిన్యూట్ మ్యాన్ III ఐసీఎంబీ
**దేశం:** అమెరికా
**వేగం గంటకు:** 24,140 కి. మీ.

**పేరు:** డీప్‌స్ట్రైక్
**దేశం:** అమెరికా
**వేగం గంటకు:** 7,500 కి. మీ.

**పేరు:** బ్రహ్మోస్ (క్రూయిజ్ క్షిపణుల్లో ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైనది)
**దేశం:** భారత్
**వేగం గంటకు :** 9,878 కి.మీ.





**పేరు:** ఆర్–36ఎం(ఎస్ఎస్–18 సతన్)
**దేశం:** రష్యా
**వేగం గంటకు:** 16,000 కి. మీ.

# దేశం విడిచి వెళ్లిపొండి

## నార్వే మహిళను ఆదేశించిన అధికారులు



**కొచ్చి:** సీఏఏ వ్యతిరేక ఆందోళనలో పాల్గొన్న నార్వేకు చెందిన మహిళను దేశం విడిచి వెళ్లిపోవాల్సిందిగా అధికారులు ఆదేశించారు. ఈ నెల 23న కేరళలోని కొచ్చిలో జరిగిన సీఏఏ వ్యతిరేక నిరసనలకు సంబంధించిన వీడియోలను విశ్లేషించగా జెన్నె మెట్టె జాన్సన్(71) అనే నార్వే మహిళ అందులో పాల్గొన్నట్టు తేలిందని ఓ అధికారి తెలిపారు. ఇది వీసా నిబంధనలకు విరుద్ధమని, ఈ మేరకు ఆమెను నార్వేకు తిరిగివెళ్లాల్సిందిగా సూచించామని విదేశాంగశాఖ ప్రాంతీయ కార్యాలయ అధికారి అనూప్ కృష్ణన్ పేర్కొన్నారు. పర్యాటక వీసాపై కొచ్చికి వచ్చిన జెన్నె సీఏఏ వ్యతిరేక ప్లకార్డును పట్టుకొన్న ఫొటోను సోషల్‌మీడియాలో పోస్టుచేశారు. దీంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. 'నన్ను వెళ్లిపొమ్మని, లేదంటే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. నేను వివరణ ఇస్తానన్నా ఒప్పుకోవడం లేదు. ఒక అధికారి నా వెంటే ఉంటున్నారు. దుబాయ్‌కి వెళ్లేందుకు నా మిత్రులు విమాన టికెట్లు సమకూర్చుతున్నారు. అక్కడి నుంచి నార్వేకు వెళ్లిపోతా' అని జెన్నె ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు.

# పింఛన్‌దారులకు శుభవార్త

- భవిష్య నిధి నుంచి అడ్వాన్స్ తీసుకునే అవకాశం
- జనవరి 1 నుంచి అందుబాటులోకి రానున్న సౌలభ్యం

**న్యూఢిల్లీ:** పింఛన్‌దారుల చిరకాల కోరిక నెరవేరనున్నది. భవిష్య నిధి నుంచి కొంత మొత్తాన్ని అడ్వాన్స్‌గా తీసుకునే వెసులుబాటు కలుగనున్నది. 2020 జనవరి 1 నుంచి ఈ సౌలభ్యం అందుబాటులోకి రానున్నది. 2009లో రద్దు చేసిన ఈ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) నిర్ణయించింది. తద్వారా 2009కు ముందు పింఛన్‌లో అడ్వాన్స్ మొత్తాన్ని తీసుకోవాలని కోరుకున్న 6.3 లక్షల మంది పెన్షనర్లు లబ్ధి పొందుతారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దీని ప్రకారం 15 ఏండ్ల వరకు నెలవారీ పింఛన్‌లో మూడో వంతు కోత వేసి ఆ మొత్తాన్ని పింఛనుదారులకు చెల్లిస్తారు. 15 ఏండ్ల తర్వాత పూర్తి పింఛన్ అందుబాటులోకి వస్తుంది. ప్రభుత్వ ఉద్యోగులకు అమలవుతున్న దీన్ని ప్రైవేటు ఉద్యోగులకూ వర్తింపజేయాలని కేంద్రం నిర్ణయించింది.



# ఇదో ఫాసిస్టు చట్టం







పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా కేరళలోని వయనాడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

- సీఏఏ, ఎన్నార్సీ ముస్లింలకు పూర్తి వ్యతిరేకం
- తరుచూ ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం గర్హనీయం
- దేశంలోని సమస్యలను కప్పిపుచ్చడానికే ఈ వ్యూహం
- కేంద్ర ప్రభుత్వానికి సాఫ్ట్‌వేర్ సంస్థల నిపుణుల ఘాటు లేఖ
- దేశవ్యాప్తంగా కొనసాగుతున్న 'పౌర' ఆందోళనలు

**న్యూఢిల్లీ/ముంబై/కొచ్చి/లక్నో, డిసెంబర్ 27:** కేంద్రం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)పై ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలకు చెందిన నిపుణులు, ఉద్యోగులు ఘాటుగా స్పందించారు. ఈ చట్టాన్ని 'ఫాసిస్టు (నియంతృత్వ) చట్టం'గా అభివర్ణిస్తూ కేంద్ర ప్రభుత్వానికి బహిరంగ లేఖ రాశారు. 'మీడియం' అనే సోషల్‌మీడియా వెబ్‌సైట్‌లో ప్రచురితమైన ఈ లేఖలో ప్రపంచవ్యాప్తంగా గూగుల్, ఫేస్‌బుక్, అమెజాన్, ఉబర్ వంటి అగ్రశ్రేణి ఐటీ సంస్థల్లో పని చేస్తున్న భారతీయ, భారతీయ మూలాలున్న దాదాపు 150 మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు సంతకాలు చేశారు. 'టెక్ అగేనెస్ట్ ఫాసిజం' పేరుతో ఉన్న ఈ లేఖలో కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. 'టెక్నాలజీ పరిశ్రమకు చెందిన ఇంజినీర్లు, డిజైనర్లు, పరిశోధకులు, విశ్లేషకులమైన మేము భారత ప్రభుత్వం తీసుకొచ్చిన ఫాసిస్టు చట్టాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. నిరసనకారులపై ప్రభుత్వం జరుపుతున్న దమనకాండను తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాం. సీఏఏ, ఎన్నార్సీ ఒకదానితో ఒకటి ముడివడి ఉన్నాయి. ఈ పథకం ముస్లింలకు పూర్తిగా వ్యతిరేకం. ఇది ముస్లింలకు నిలువ నీడ లేకుండా చేయడంతోపాటు అసమానతలను సృష్టిస్తుంది' అని పేర్కొన్నారు. దేశంలో రికార్డు స్థాయికి చేరిన నిరుద్యోగం, దిగజారుతున్న ఆర్థిక వ్యవస్థ, పెరిగిపోతున్న రైతుల ఆత్మహత్యలు, ధ్వంసమవుతున్న పర్యావరణం వంటి తీవ్రమైన సమస్యలను కప్పిపుచ్చేందుకు, ప్రజలను తప్పుదోవపట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ వ్యూహాన్ని అమలుచేస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వం ఇష్టానుసారం ఢిల్లీ, అసోం, కశ్మీర్ వంటి ప్రాంతాల్లో ఇంటర్నెట్‌పై నిషేధం విధిస్తున్నదని మండిపడ్డారు. 'ఈ తిరోగమన ప్రభుత్వం ఓవైపు దేశాన్ని డిజిటల్ ఇండియాగా మారుస్తున్నామని, టెక్ కంపెనీలు పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానిస్తున్నది. మరోవైపు పౌరుల గొంతును అణచివేయడానికి ఇంటర్నెట్‌ను ఓ రాజకీయ సాధనంగా వాడుకుంటున్నది. అదేసమయంలో నకిలీవార్తల వ్యాప్తికి అన్ని నెట్‌వర్క్‌లను వినియోగించుకుంటున్నది' అని తీవ్రంగా విమర్శించారు. సుందర్ పిచాయ్ (ఆల్ఫాబెట్, గూగుల్), సత్యానాదెళ్ల (మైక్రోసాఫ్ట్), మార్క్ జుకర్‌బర్గ్ (ఫేస్‌బుక్), జాక్ డోర్సే (ట్విట్టర్), దారా ఖోస్రోషాహి (ఉబర్), ముఖేశ్ అంబానీ (జియో), గోపాల్ విఠల్ (ఎయిర్‌టెల్), కల్యాణ్ కృష్ణమూర్తి (ఫ్లిప్‌కార్ట్, శంతను నారాయణ్ (అడోబ్) వంటి టెక్ కంపెనీల యజమానులు ఈ చట్టాన్ని బహిరంగంగా వ్యతిరేకించాలని కోరారు. ప్రభుత్వానికి కొమ్ము కాయొద్దని, వినియోగదారుల వివరాలను ప్రభుత్వాలకు వెల్లడించవద్దని, ఇంటర్నెట్ సేవలను ఇష్టానుసారం నిషేధించడాన్ని ఖండించాలని, టెక్నాలజీని మంచి కోసం ఒక సాధనంగా, ప్రజలను ఏకంచేసే మార్గంగా వినియోగించాలని వారికి విజ్ఞప్తి చేశారు. బెంగళూరుతోపాటు శాన్ ఫ్రాన్సిస్కో, సియాటెల్, లండన్, ఇజ్రాయెల్ తదితర దేశాలకు చెందిన టెకీలు ఈ లేఖ రాసిన వారిలో ఉన్నారు. ఇది తమ వ్యక్తిగత అభిప్రాయమని, తమ సంస్థలకు దీనితో సంబంధం లేదని స్పష్టం చేశారు.

**ఆగని నిరసనలు**

సీఏఏకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఢిల్లీలోని ప్రఖ్యాత జామా మసీదు వద్ద శుక్రవారం ప్రార్థనల అనంతరం వందల మంది శాంతియుత నిరసన చేపట్టారు. సీఏఏ, ఎన్నార్సీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ నేత అల్కలాంబ, మాజీ ఎమ్మెల్యే షోయబ్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో నిరసనకారులపై జరిగిన హింసను వ్యతిరేకిస్తూ జామియా సమన్వయ కమిటీకి చెందిన సభ్యులు ఢిల్లీలోని యూపీ భవన్ ముందు ఆందోళన చేపట్టేందుకు ప్రయత్నించారు. దీంతో 75 మంది మహిళలు సహా 357 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని అనంతరం విడిచిపెట్టారు. భీమ్ ఆర్మీ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు కార్యకర్తలు ప్రధాని మోదీ నివాసం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

- హింసతో అట్టుడుకుతున్న ఉత్తరప్రదేశ్‌లో శుక్రవారం ప్రార్థనలు ప్రశాంతంగా ముగిశాయి. సున్నిత ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించారు. కోల్‌కతాలో కాంగ్రెస్, వామపక్ష పార్టీలు కలిసి భారీ ర్యాలీ నిర్వహించాయి. కేరళలోని వయనాడ్, పంజాబ్‌లోని అమృత్‌సర్ తదితర ప్రాంతాల్లోనూ నిరసనలు కొనసాగాయి.




సీఏఏకు అనుకూలంగా ముంబైలో భారీ ర్యాలీ

## ముంబైలో పోటాపోటీ ప్రదర్శనలు

ముంబైలో ఎన్నార్సీ, సీఏఏకు వ్యతిరేకంగా, అనుకూలంగా పోటాపోటీ ప్రదర్శనలు జరిగాయి. జాయింట్ యాక్షన్ కమిటీ ఫర్ సోషల్ జస్టిస్ ఆధ్వర్యంలో సీఏఏ, ఎన్నార్సీకి వ్యతిరేకంగా దక్షిణ ముంబైలోని ఆజాద్ మైదానంలో భారీ బహిరంగ సభ జరిగింది. అంతకు ముందు భారీ ర్యాలీ నిర్వహించారు. మరోవైపు సీఏఏకు అనుకూలంగా బీజేపీ ఆధ్వర్యంలో ఆగస్ట్ క్రాంతి మైదానంలో భారీ బహిరంగ సభ జరిగింది. మాజీ సీఎం ఫడ్నవీస్ , పలువురు బాలీవుడ్ నటులు, బీజేపీయేతర పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.


# న్యాయ నిర్దేశం

- ఈ ఏడాది పలు చారిత్రాత్మక, కీలక తీర్పులను వెలువరించిన సుప్రీంకోర్టు
- అయోధ్య భూవివాదం, రాఫెల్ కేసు, ఆర్టీఐ పరిధిలోకి సీజేఐ ఆఫీస్..
- మహిళలు, పిల్లలపై లైంగిక దాడుల కేసుల్లో సత్వర విచారణకు మార్గదర్శకాలు
- ఉన్నావ్ బాధితురాలికి అండగా నిలిచిన సర్వోన్నత న్యాయస్థానం



**న్యూఢిల్లీ:** మరో నాలుగు రోజుల్లో కొత్త సంవత్సరం ప్రారంభం కానున్నది. ఎన్నెన్నో జ్ఞాపకాలతో నిండిన 2019లో భారత అత్యున్నత న్యాయస్థానం(సుప్రీంకోర్టు) ఇచ్చిన తీర్పులు మరెన్నో సంచలనాలకు చిరునామాగా మారాయి. కొన్ని దశాబ్దాలపాటు చిక్కుముడిగా ఉన్న అయోధ్యలోని వివాదాస్పద రామ జన్మభూమి–బాబ్రీ మసీదు స్థల వివాదం, శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం, దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన రాఫెల్ ఒప్పందం, ఆర్టీఐ పరిధిలోకి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయాన్ని తీసుకురావాలా? వద్దా? తదితర కేసుల్లో సర్వోన్నత ధర్మాసనం తీర్పును వెలువరించింది. 2019లో సుప్రీంకోర్టు ఇచ్చిన అతి ముఖ్యమైన తీర్పులను పరిశీలిస్తే..







### అయోధ్యలో ఆలయం-మసీదు

దశాబ్దాలుగా నలుగుతున్న అయోధ్య భూవివాదం కేసులో నవంబర్ 9న సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. స్థలాన్ని ఆలయ నిర్మాణం కోసం రామ జన్మభూమి న్యాస్‌కు అప్పగిస్తున్నట్లు పేర్కొంది. మూడునెలల్లో ట్రస్టును ఏర్పాటు చేయాలని, ముస్లింలకు ప్రత్యామ్నాయంగా అయోధ్యలోని మరోచోట మసీదు నిర్మాణం కోసం ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ఆదేశించింది. మధ్యవర్తిత్వ కమిటీ విఫలమవడంతో 40 రోజుల పాటు రోజువారీ విచారణ జరిపింది.

### శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం

శబరిమల ఆలయంలోకి అన్ని వయసుల మహిళలకు ప్రవేశాన్ని కల్పిస్తూ 2018లో ఇచ్చిన తీర్పుపై దాఖలైన రివ్యూ పిటిషన్లపై తుది తీర్పును సుప్రీంకోర్టు పెండింగ్‌లో ఉంచింది. విస్తృత పరిశీలన అవసరమని ఐదుగురు సభ్యుల ధర్మాసనం అభిప్రాయపడింది. నవంబర్ 14న ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనానికి బదిలీ చేసింది. మసీదు, దర్గాల్లోకి ముస్లిం మహిళలకు అనుమతి నిరాకరణ, పార్శీయేతర వ్యక్తిని వివాహమాడిన పార్శీ మహిళలకు అగ్యారీ ఆలయంలోకి అనుమతిపైనా నిషేధం ఉన్నదని వీటిపైనా చర్చ జరుగాలని పేర్కొంది.




### ఆర్టీఐ పరిధిలోకి సీజేఐ ఆఫీసు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయం సమాచారహక్కు చట్టం (ఆర్టీఐ) పరిధిలోకి వస్తుందన్న ఢిల్లీ హైకోర్టు తీర్పును అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. కేసు విచారణను అప్పటి చీఫ్ జస్టిస్ న్యాయమూర్తులు రాజ్యాంగబద్ధమైన పదవులను అనుభవిస్తున్నారని, ప్రజావిధులు నిర్వర్తిస్తుంటారని, కాబట్టి న్యాయవ్యవస్థ విధుల్లో పూర్తిస్థాయి గోప్యత పాటించడం సాధ్యం కాదన్నది.

### రాఫెల్ తీర్పు

మోదీ సర్కారుపై విపక్షాలు తీవ్ర విమర్శలు చేసిన రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు కేసులో సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునిచ్చింది. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంపై కోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలని, ఈ కేసుపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని దాఖలైన అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టేసింది. రాఫెల్ యుద్ధ విమానాల ధరలపై విచారణ చేపట్టాల్సిన అవసరం లేదని చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని సర్వోన్నత ధర్మాసనం స్పష్టం చేసింది.





### సీజేఐపై లైంగిక ఆరోపణలు

అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ రంజన్ గొగోయ్‌పై ఆయన కార్యాలయంలో పని చేసిన మాజీ ఉద్యోగిని ఒకరు లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. అయితే, సుప్రీంకోర్టులోని అంతర్గత విచారణ కమిటీ చేసిన విచారణలో ఆయనకు క్లీన్ చిట్ లభించింది. ఆ కమిటీకి ప్రస్తుత చీఫ్ జస్టిస్ ఎస్ ఏ బొబ్డే నేతృత్వం వహించారు.

### మరిన్ని కీలక కేసులు

పౌరసత్వ సవరణ చట్టం రాజ్యాంగ ప్రామాణికతను నిర్ధారించడంలో భాగంగా కేంద్రానికి నోటీసులు జారీచేయాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. అసోంలో ఎన్నార్సీ తుది జాబితాను పర్యవేక్షించనున్నట్టు పేర్కొంది. లైంగిక కేసుల సత్వర విచారణకు ప్రతి జిల్లాలోపోక్సో ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఉన్నావ్ లైంగిక దాడి బాధితురాలి కేసును లక్నో కోర్టు నుంచి ఢిల్లీ కోర్టుకు బదిలీ చేసింది. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కాంగ్రెస్ నేత చిదంబరానికి బెయిల్ మంజూరు చేసింది. స్థిరాస్తి సంస్థ ఆమ్రపాలి గ్రూప్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసింది. సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ లోధా కమిటీ సిఫారసులకు అనుగుణంగా జరిగిన ఎన్నికల తర్వాత బీసీసీఐ బోర్డు సరికొత్త కార్యవర్గానికి మార్గం సుగమయ్యింది. స్వీడన్‌కు చెందిన ఎరిక్‌సన్ కంపెనీకి 4 వారాల్లోగా రూ.453 కోట్లు కట్టి తీరాలని, లేనిపక్షంలో జైలుకెళ్లకతప్పదంటూ రిలయన్స్ అడాగ్ చైర్మన్ అనిల్ అంబానీని హెచ్చరించింది.

# సీఏఏతో ఎవరి పౌరసత్వం రద్దు కాదు

## ప్రజలను కాంగ్రెస్ తప్పుదారి పట్టిస్తున్నది: అమిత్ షా



హిమాచల్‌లో రెండేండ్ల పాలన పూర్తయిన సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతున్న అమిత్ షా

**సిమ్లా:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) వల్ల ఎవరి పౌరసత్వం రద్దుకాదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లైన సందర్భంగా సిమ్లాలో శుక్రవారం జరిగిన భారీ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'ముస్లింలు పౌరసత్వం కోల్పోతారని కాంగ్రెస్ తదితర పక్షాలు పుకార్లు వ్యాప్తింపజేస్తున్నాయి. రాహుల్ బాబాకు నేను చాలెంజ్ చేస్తున్నా. ఎవరి పౌరసత్వమైనా తొలగిస్తారని ఈ చట్టంలో ఎక్కడైనా ఉంటే నా దృష్టికి తీసుకురండి' అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉన్న సీఏఏ గురించి తెలుసుకోవాలని ముస్లింలను ఆయన కోరారు.

# హిందుత్వదేశంగా భారత్‌ను మార్చేందుకు కుట్ర

## మోదీ సర్కార్‌పై సీపీఎం నేత సీతారాం ఏచూరి ధ్వజం



ఉస్మానియా వర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏచూరి

**ఉస్మానియా యూనివర్సిటీ:** భారత్‌ను హిందుత్వ దేశంగా మార్చడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోపించారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) కేవలం ముస్లింలకే కాదని, పేదలకూ వ్యతిరేకమేనన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలోని వివిధ విద్యార్థి సంఘాలు శుక్రవారం 'భారత్‌ను రక్షించండి– రాజ్యాంగాన్ని రక్షించండి' అనే పేరుతో నిర్వహించిన ముఖాముఖీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేశాన్ని వెంటాడుతున్న పలు సమస్యలను వదిలేసి ఎన్నార్సీ, సీఏఏలను మోదీ సర్కార్ తీసుకొచ్చిందని మండిపడ్డారు.

# 130 కోట్ల మంది హిందువులంటే అంగీకరించను!

## మోహన్ భాగవత్ వ్యాఖ్యతో విబేధించిన కేంద్రమంత్రి అథావలే

**ముంబై:** భారతదేశంలో జీవిస్తున్న 130 కోట్ల మంది హిందువులేనన్న ఆరెస్సెస్ అధిపతి మోహన్ భాగవత్ వ్యాఖ్యతో కేంద్ర మంత్రి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) అధినేత రాందాస్ అథావలే విభేదించారు. 'దేశంలోని ప్రతి ఒక్కరినీ (హిందువుగా పరిగణించడానికి బదులు) భారతీయుడిగా పరిగణిస్తున్నామని, మనమంతా ఒక్కటే అని ఆరెస్సెస్ చెప్పి ఉంటే బాగుండేది. మెజారిటీ హిందువులతోపాటు బౌద్ధులు, ముస్లింలు, క్రైస్తవులు, జైనులు, దళితులు, వెనుకబడిన వర్గాల వారు ఉన్నారు. మనమంతా ఒక్కటే. భారతీయులంతా సమైక్యం' అని అథావలే చెప్పారు.

# రేపు జార్ఖండ్ సీఎంగా హేమంత్ సొరేన్ ప్రమాణం

## హాజరు కానున్న పలు రాష్ట్రాల సీఎంలు, ప్రతిపక్ష నేతలు



**రాంచీ, డిసెంబర్ 27:** జార్ఖండ్ నూతన సీఎంగా హేమంత్ సొరేన్ ప్రమాణానికి హాజరు కావాల్సిందిగా ప్రధాని నరేంద్రమోదీ, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీతోపాటు వివిధ రాష్ట్రాల సీఎంలు, ప్రధాన రాజకీయ పార్టీల అధినేతలను ఆహ్వానించామని జేఎంఎం ప్రధాన కార్యదర్శి సుప్రియో భట్టాచార్య చెప్పారు. రాంచీలోని మొహ్రాబాడీ గ్రౌండ్స్‌లో ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు హేమంత్ సొరేన్ సీఎంగా ప్రమాణం చేయనున్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధినేత శరద్‌పవార్‌తోపాటు సీఎంలు మమతా బెనర్జీ (పశ్చిమ బెంగాల్), ఉద్ధవ్ ఠాక్రే (మహారాష్ట్ర), అశోక్ గెహ్లోట్ (రాజస్థాన్), కమల్‌నాథ్ (మధ్యప్రదేశ్), భూపేశ్ భఘేల్ (ఛత్తీస్‌గఢ్), అరవింద్ కేజ్రీవాల్ (ఢిల్లీ), సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, బీఎస్పీ అధినేత్రి మాయావతి తదితరులను ఆహ్వానించామని తెలిపారు. ప్రధాని మోదీ తన బిజీ షెడ్యూల్ కారణంగా ప్రమాణ స్వీకారానికి రాలేనన్నారని, హేమంత్ సొరేన్‌కు తన శుభాకాంక్షలు అందజేశారని తెలిపారు. ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్, కర్ణాటక మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి, సీపీఐ నేత కన్హయ్య కుమార్ తదితరులను ఆహ్వానించామన్నారు.

# ముగిసిన మిగ్-27 ప్రస్థానం

- మూడు దశాబ్దాలపాటు సేవలందించిన యుద్ధ విమానాలకు వీడ్కోలు
- 1999 కార్గిల్ యుద్ధంలో సత్తా చాటిన మిగ్-27



**జోధ్‌పూర్:** భారత వైమానిక దళం(ఐఏఎఫ్)లోని శక్తిమంతమైన మిగ్–27 యుద్ధవిమానం చరిత్ర పుటలకెక్కింది. 1999 కార్గిల్ యుద్ధం, ఆపరేషన్ పరాక్రమ్ వంటి అత్యంత కీలక సమయాల్లో ఐఏఎఫ్‌కు వజ్రాయుధంగా నిలిచిన మిగ్–27 ప్రస్థానం శుక్రవారంతో ముగిసింది. గత మూడు దశాబ్దాలకుపైగా దేశ వైమానిక దళానికి చెరగని సేవలందించిన ఈ లోహ విహంగాలకు శుక్రవారం ఐఏఎఫ్ ఘన వీడ్కోలు పలికింది. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ వైమానిక స్థావరం నుంచి ఏడు మిగ్–27 విమానాలు చివరిసారి గగనవిహారం చేశాయి. 'తన(మిగ్–27) లక్ష్యాల్ని చేరుకున్నది. తానిచ్చిన వాగ్దానాల్ని నిలబెట్టుకున్నది. రవి అస్తమించినట్టు ఎంతో పవిత్రంగా, మరెంతో అందంగా తన సేవల నుంచి విరామం తీసుకుంటున్నది' అని ఐఏఎఫ్ ఓ భావోద్వేగ వీడ్కోలు సందేశాన్ని ట్వీట్ చేసింది.

**ఎగిరే శవపేటిక**

1970నుంచి మిగ్ రకానికి చెందిన పలు విమానాలు కూలిపోయి 180మందికి పైగా ఐఏఎఫ్ పైలట్లు చనిపోయారు. దీంతో మిగ్ విమానాలను 'ఎగిరే శవపేటిక'గా పలువురు విమర్శించారు. డిజైనింగ్ లోపాలు, సాంకేతిక కారణాల వల్లే ఈ విమానాలు కూలిపోతున్నట్టు నిపుణులు పేర్కొన్నారు. దీంతో మిగ్ విమానాల్ని అన్నిదేశాలు ఇప్పటికే ఉపసంహరించుకున్నాయి. ప్రస్తుతం ఏ దేశంలోనూ ఇవి వినియోగంలో లేవు.

# చైనా సమాచార ఉపగ్రహం


## షిజియాన్-20 ప్రయోగం విజయవంతం

**బీజింగ్, డిసెంబర్ 27:** చైనా అత్యధిక బరువైన, అత్యంత ఆధునిక సమాచార ఉపగ్రహం 'షిజియాన్–20'ను తన లాంగ్‌మార్చ్–5 వాహననౌక ద్వారా విజయవంతంగా ప్రయోగించింది. శుక్రవారం రాత్రి విజయవంతంగా ఉపగ్రహం కక్ష్యలో ప్రవేశించిందని చైనా అధికార వార్తా సంస్థ జిన్హువా తెలిపింది. చైనా దక్షిణాది రాష్ట్రం హైనాన్‌లోని వెన్‌చాంగ్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి 'షిజియాన్–20'ని ప్రయోగించినట్లు పేర్కొంది. ఎనిమిది టన్నులకు పైగా బరువున్న షిజియాన్–20 చైనా చేపట్టిన ఉపగ్రహ ప్రయోగాల్లో అత్యధిక బరువైన ఉపగ్రహం. వాహన నౌక 'లాంగ్‌మార్చ్–5' చైనా శక్తిమంతమైన రాకెట్. జియోక్రయోజనిక్ కక్ష్యలోకి గరిష్ఠంగా 25 టన్నుల పేలోడ్స్ తీసుకెళ్లగల సామర్థ్యం దీని సొంతం. 2020లో అంగారక గ్రహంపైకి ఉపగ్రహాన్ని ప్రయోగించాలన్న ప్రణాళిక రూపొందించిన చైనాకు తాజా ప్రయోగం భారీ ముందడుగు అని భావిస్తున్నారు.



## ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు రూ.10 కోట్ల గ్రాంట్

- పరిశోధనల కోసం ప్రత్యేక నిధులు




**బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ:** వైద్య పరిశోధన కేంద్రం ఏర్పాటుకోసం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం, అహ్మదాబాద్), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (ఐఐపీహెచ్ హైదరాబాద్)లతో కలిసి ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ రూ.10 కోట్ల గ్రాంట్‌ను అందుకున్నది. ఈ మేరకు వెల్‌కమ్ ట్రస్ట్, డీబీటీ ఇండియా అలయెన్స్ ప్రజా స్వచ్ఛంద సంస్థ ఈ మొత్తాన్ని ఎల్వీ ప్రసాద్ సంస్థకు అందచేసింది. ఈ సందర్భంగా ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గుళ్లపల్లి ఎన్ రావు మాట్లాడుతూ.. ఇండియా అలయెన్స్ గ్రాంట్ దేశంలో క్లినికల్ రిసెర్చ్, ట్రైనింగ్, సైన్స్, హెల్త్ ఎకనామిక్స్, హెల్త్ పాలసీల్లో సేవలను అందిస్తున్నదని తెలిపారు. తమ దవాఖాన ప్రారంభమైనప్పటి నుంచి పరిశోధనలపై అత్యధికంగా దృష్టి పెట్టిందని చెప్పారు. కార్యక్రమంలో ఐఐపీహెచ్ ప్రతినిధి డాక్టర్ మూర్తి, ఐఐఎంఏ ప్రొఫెసర్ చిరంతన్ చటర్జీ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీలో జూనియర్ అసిస్టెంట్లకు వెరిఫికేషన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీలో జూనియర్ అసిస్టెంట్ పోస్టుల అభ్యర్థులు నాలుగో విడుత నిర్వహించే ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలని టీఎస్‌పీఎస్సీ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించింది. జనవరి 3న, ఉదయం 10.30 గంటలకు నాంపల్లిలోని ప్రతిభాభవన్‌కు రావాలని, వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ జనవరి 2 నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపింది.

## త్వరలో మొబైల్ ఫిష్ ఔవుట్‌లెట్లు

- పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడి


మొబైల్ ఫిష్ ఔట్‌లెట్ నమూనాను మంత్రి తలసానికి అందజేస్తున్న మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జీహెచ్‌ఎంసీ పరిధిలోని 150 డివిజన్లలో త్వరలో మొబైల్ ఫిష్ ఔట్‌లెట్లను ప్రారంభించనున్నట్టు మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. వీటి నిర్వహణకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, లబ్ధిదారుల ఎంపికకు మార్గదర్శకాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మత్స్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొబైల్ ఫిష్ ఔట్‌లెట్ నమూనాను మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ మంత్రికి అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మొబైల్ ఫిష్ ఔట్‌లెట్లకు రూ.18 కోట్ల నిధులు వెచ్చించనున్నట్టు తెలిపారు. ఔట్‌లెట్లలో ఉదయం లైవ్‌ఫిష్, సాయంత్రం చేపపంటకాలు విక్రయించడానికి వీలుగా సౌకర్యాలు కల్పించనున్నట్టు చెప్పారు. సమావేశంలో మత్స్యశాఖ డీడీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు




జర్నలిస్టు కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

## జర్నలిస్టుల సంక్షేమవేదిక మీడియా అకాడమీ

- ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లే సాధ్యమైంది
- మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ
- జర్నలిస్టు కుటుంబాలకు చెక్కుల పంపిణీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కృషితోనే తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమానికి, శిక్షణకు మీడియా అకాడమీ వేదికగా రూపుదిద్దుకున్నదని అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ పేర్కొన్నారు. కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని 2017లో జర్నలిస్టుల సంక్షేమపథకాన్ని ప్రారంభించామని.. ఆయన చిత్తశుద్ధితో సంక్షేమనిధిని ఏర్పాటు చేసుకోగలిగామని చెప్పారు. ఇటీవల మృతిచెందిన, అచేతనంగా ఉన్న జర్నలిస్టుల కుటుంబాలకు శుక్రవారం సమాచారభవన్‌లోని మీడియా అకాడమీ కార్యాలయంలో అల్లం నారాయణ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమనిధికోసం రూ. వంద కోట్లు ఇస్తామని ప్రకటించిన సీఎం కేసీఆర్.. వెంటనే రూ.34.50 కోట్లు ఇచ్చారని తెలిపారు. ఈ నిధిపై వచ్చిన వడ్డీతో జర్నలిస్టులకు ఆర్థికసహాయం అందజేశామన్నారు. ఇప్పటివరకు చనిపోయిన, అచేతనంగా ఉన్న జర్నలిస్టుల కుటుంబాలకు పెన్షన్లతో కలిపి దాదాపు రూ.5 కోట్లు అందించినట్టు తెలిపారు. జర్నలిస్టులకు ఈ పథకం ఎప్పటికీ కొనసాగుతుందని చెప్పారు. జర్నలిస్టులు పలువురు వృత్తిపరమైన ఒత్తిడితో లివర్, బ్రెయిన్ స్ట్రోక్, గుండెపోటుకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 2014 నుంచి ఇప్పటివరకు 224 మంది చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు లక్ష చొప్పున సహాయం అందించామని.. నెలకు రూ.3 వేల చొప్పున ఐదేండ్లపాటు పెన్షన్ కూడా అందిస్తున్నట్టు తెలిపారు. జర్నలిస్టుల పిల్లలు చదువుకోవడానికి కూడా ఏడాదికి రూ.5వేల వరకు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్టు వివరించారు. అచేతనంగా ఉన్న 87 మందికి రూ.50వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశామన్నారు.

**10నెలల్లోనే 34 మంది మృతి**

2019 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు 10నెలల్లోనే 34 మంది జర్నలిస్టులు మృతిచెందారని, ఆరుగురు అచేతనంగా ఉండిపోయారని.. 40 మంది కుటుంబాలకు ఆర్థికసహాయం కింద చెక్కులు పంపిణీ చేస్తున్నామని అల్లం నారాయణ తెలిపారు, చనిపోయిన జర్నలిస్టుల కుటుంబసభ్యులకు రూ.లక్ష, అచేతనంగాఉన్న జర్నలిస్టులకు రూ.50 వేల చెక్కులను పంపిణీచేశారు. ప్రమాదాల వల్ల ఎవరైనా జర్నలిస్టులు మరణిస్తే రూ.5 లక్షల ప్రమాద బీమా వస్తుందని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తెలిపా రు. దీనిపై అవగాహన లేక చాలామంది ప్రమాద బీమాకు దరఖాస్తు చేసుకోవడంలేదని అన్నారు. రాష్ట్రంలో దాదాపు 9 వేల మంది జర్నలిస్టులకు ప్రమాద బీమా ఉన్నదని, ఎవరికైనా ప్రమాదం జరిగితే వెంటనే మీడియా అకాడమీకి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి, జర్నలిస్టు సంఘాల నేతలు పాల్గొన్నారు.

# నీరాపాలసీ అమలుకు ప్రణాళికలు


- వీలైనంత త్వరగా విక్రయాలకు చర్యలు తీసుకోవాలి
- సమీక్షలో ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


నీరా విక్రయాలపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో ఎమ్మెల్సీ బాలసాని, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య, ఆర్థిక సంఘం చైర్మన్ రాజేశంగౌడ్ ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో వీలైనత త్వరగా నీరా ఉత్పత్తులను విక్రయించేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని ఎక్సైజ్‌శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. సీఎం కేసీఆర్ గీతవృత్తిదారుల సంక్షేమం, అభివృద్ధితోపాటు ప్రజలకు ఆరోగ్యకరమైన నీరాను అందుబాటులోకి తెచ్చేందుకు నీరాపాలసీని తెచ్చారన్నారు. నీరా పాలసీఅమలు, గీతకార్మికుల సమస్యలు, గుర్తింపుకార్డుల పంపిణీ, ఎక్స్‌గ్రేషియా అములు తదితర అంశాలపై శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. బేగంపేటలోని టూరిజం ప్లాజాలో నిర్వహించిన ఈ సమీక్షలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజేశంగౌడ్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, ఆబ్కారీ శాఖ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర గీత వృత్తిదారుల సహకార సొసైటీ ఎండీ అలోక్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గీత కార్మికుల సంక్షేమం, అభివృద్ధికోసం ప్రతిష్ఠాత్మకంగా నీరాపాలసీని ప్రకటించారని, నీరా అనుబంధ ఉత్పత్తుల తయారీకి అవసరమైన సాంకేతిక అంశాలపై అధ్యయనం చేయాలని సూచించారు. ఏపీలోని రాజమండ్రిలో గల వైఎస్సార్ ఉద్యాన వర్సిటీలో నీరా అధ్యయన కమిటీ స్టడీ టూర్ వివరాలను రాష్ట్ర గీత వృత్తిదారుల సహకారసొసైటీ ఎండీ అలోక్‌కుమార్‌ను మంత్రి అడిగితెలుసుకున్నారు. రాష్ట్రంలో తాటి, అనుబంధ ఉత్పత్తులపై అధ్యయనానికి రీసెర్చ్ సెంటర్‌ను ఉద్యానవర్సిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేయడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధంచేయాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పరిసరాల్లో నీరా పార్లర్‌ను కేఎఫ్‌సీ, పిజాహట్ స్టోర్ల మాదిరిగా ఆధునిక హంగులతో ఏర్పాటుచేయాలని చెప్పారు. నీరా పార్లర్లను త్వరలోనే జిల్లా కేంద్రాలకు విస్తరించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

# కేసీఆర్‌ను మించిన లౌకికవాదిలేడు

- జీవితాంతం ఆయన వెంటే ఉంటా
- పౌరసత్వ సవరణ చట్టం అందరి సమస్య
- ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్య
- ఎన్నార్సీ, సీఏఏ, ఎన్పీఆర్‌కు వ్యతిరేకంగా నిజామాబాద్ లో భారీ బహిరంగసభ



శుక్రవారం రాత్రి నిజామాబాద్‌లోని ఖిల్లా ఈద్గా వద్ద ఎంఐఎం ఆధ్వర్యంలో యునైటెడ్ ముస్లిం యాక్షన్ కమిటీ నిర్వహించిన బహిరంగసభకు భారీగా హాజరైన ప్రజలు.. సభలో ప్రసంగిస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ. చిత్రంలో టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సురేందర్, షకీల్ తదితరులు ఉన్నారు.

**నిజామాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి:** సీఎం కేసీఆర్‌ను మించిన లౌకికవాది మరొకరులేరని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. టీఆర్‌ఎస్ సెక్యులర్ విధానాన్ని వదిలిపెట్టబోదని కేసీఆర్ తనకు చెప్పారని, తాను బతికినంతకాలం ఆయన వెంటే ఉంటానని స్పష్టంచేశారు. శుక్రవారం రాత్రి నిజామాబాద్‌లోని ఖిల్లా ఈద్గా వద్ద ఎంఐఎం ఆధ్వర్యంలో యునైటెడ్ ముస్లిం యాక్షన్ కమిటీ నిర్వహించిన బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ.. పౌరసత్వసవరణ చట్టం ఒక్క ముస్లింలకే వ్యతిరేకంకాదని, అన్ని వర్గాలకు నష్టమని చెప్పారు. సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌లకు, మోదీ విషపూరిత చట్టాలకు వ్యతిరేకంగా అందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. ఒకే మతస్థులైన ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ మధ్య చాలా తేడా ఉన్నదని చెప్పారు. మోదీ మతాన్ని అందరిపై రుద్దాలని చూస్తారని, కేసీఆర్ అన్ని మతాలను గౌరవిస్తారని పేర్కొన్నారు. కేరళలో మాదిరిగా రాష్ట్రంలో కూడా ఈ చట్టాన్ని అమలుచేయవద్దని తాము సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేయగా.. అంతకంటే ఎక్కువే చేస్తానని హామీ ఇచ్చారని వెల్లడించారు.

**మోదీ, షా అబద్ధాలు**

ఎన్పీఆర్, ఎన్నార్సీ నాణేనికి బొమ్మ, బొరుసులాంటివని.. మోదీ, అమిత్‌షా అవి వేర్వేరనిఅబద్ధాలు చెప్తున్నారని ధ్వజమెత్తారు. పౌరసత్వం నమోదు పేరుతో అన్ని వర్గాలను అవమానపర్చేలావ్యవహరిస్తున్నారని విమర్శించా రు. అన్నిపార్టీలు ఈ పోరాటానికి మద్దతిచ్చి నా.. కాంగ్రెస్ మాత్రం వేదికను పంచుకోవడానికి ఇష్టంగాలేదన్నారు. ఆ పార్టీ మరోసారి ఆలోచించుకోవాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నల్లమడుగు సురేందర్, షకీల్, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి తారీఖ్ అన్సారీ, నెడ్కో చైర్మన్ ఎస్ఏ అలీం, టీఆర్ఎస్ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముజీబుద్దీన్, క్రైస్తవ పరిషత్, సీపీఐఎంఎల్, భీమ్‌ఆర్మీ, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

**సిద్దిపేటలో ర్యాలీ**

**సిద్దిపేట టౌన్:** పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సిద్దిపేటలో శుక్రవారం ముస్లింలు, టీఆర్ఎస్‌తోపాటు వివిధపార్టీల నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఎక్బాల్‌మినార్ నుంచి పాతబస్టాండ్ వరకు సాగిన ర్యాలీలో భారీ జాతీయ పతాకం, ప్లకార్డులు ప్రదర్శించారు. అంతకుముందు పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు.

**మందమర్రిలో జాతీయపతాకంతో ర్యాలీ**

**జన్నారం:** పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా మంచిర్యాల జిల్లా మందమర్రి, జన్నారంలో వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. జన్నారం బస్టాండ్ నుంచి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. మందమర్రిలో సెక్యులర్ యునైటెడ్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో 33 మీటర్ల జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు.

### సీఏఏ, ఎన్నార్సీకి వ్యతిరేకంగా
## మజ్లిస్ ఉద్యమం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), ఎన్నార్సీలకు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టడానికి ఆల్‌ఇం డియా మజ్లిస్-ఏ-ఇత్తేహాదుల్ ముస్లిమీన్ (ఎంఐఎం)దేశవ్యాప్తంగా వివిధపార్టీల మద్దతు కూడగడుతున్నది. ఇప్పటికే సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, వివిధ ముస్లిం మైనార్టీ సంస్థల ప్రతినిధులు రాష్ట్రంలో సీఏఏ, ఎన్నార్సీలను అమలుచేయవద్దని కోరారు. భావసారూప్యత కలిగిన పార్టీలతో ఉద్యమిస్తామని ప్రకటించిన ఒవైసీ.. బీహార్, జార్ఖండ్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లోని పార్టీల ప్రతినిధులతో చర్చిస్తున్నారు.

# ఏపీ రాజధానిపై మరో కమిటీ

- జీఎన్ రావు, బీసీజీ నివేదికల అధ్యయనానికి హైపవర్ కమిటీ
- చంద్రబాబు హయాంలో జరిగిన ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై సీబీఐ విచారణ
- రైతుల ఆందోళనను పరిగణనలోకి తీసుకుంటాం
- ఏపీ క్యాబినెట్ భేటీ వివరాలు వెల్లడించిన మంత్రి పేర్ని నాని


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఏపీ మంత్రి పేర్ని నాని

**అమరావతి/హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని అంశంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకున్నది. రాజధాని, ఏపీ సమగ్రాభివృద్ధిపై ఏర్పాటుచేసిన కమిటీల నివేదికలపై అధ్యయనానికి హైపవర్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. శుక్రవారం జరిగిన ఏపీ క్యాబినెట్ భేటీ వివరాలను సమాచారశాఖ మంత్రి పేర్నినాని మీడియాకు వెల్లడించారు. జీఎన్ రావు కమిటీ నివేదికపై చర్చించామని, బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ (బీసీజీ) నివేదిక జనవరి మొదటివారంలో అందుతుందని చెప్పారు. ఈ నివేదికల అధ్యయనానికి మంత్రులు, సీనియర్ ఐఏఎస్ అధికారులతో హైపవర్ కమిటీని ఏర్పాటుచేయనున్నామని తెలిపారు. ఈ కమిటీపై త్వరలోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేస్తుందన్నారు. హైపవర్ కమిటీ నివేదిక తర్వాతే రాజధానిపై ప్రకటన ఉంటుందని స్పష్టంచేశారు. అమరావతి ప్రాంత రైతుల ఆందోళనను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపారు.

**రాజధాని భూములపై దర్యాప్తు**

రాజధాని నిర్మాణంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో భారీ మొత్తంలో అక్రమాలు జరిగినట్టు ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం తేల్చిందని మంత్రి పేర్నినాని వెల్లడించారు. రాజధాని ప్రకటనకు ముందు చంద్రబాబు వాటాలు ఉన్న కంపెనీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు కొనుగోలు చేసిన భూములపై న్యాయనిపుణుల సలహా తీసుకొని విచారణ జరిపిస్తామని తెలిపారు. లోకాయుక్త లేదా సీబీఐ దర్యాప్తుకు నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా, అమరావతి కుంభకోణంపై కీలక అంశాలను మంత్రివర్గ ఉపసంఘం నివేదిక బయటపెట్టినట్టు తెలుస్తున్నది. హెరిటేజ్ సంస్థ, లింగమనేని, వేమూరి హరిప్రసాద్ పేర్లతో భారీగా భూములు కొన్నట్టు వివరాలు నివేదికలో ఉన్నట్టు సమాచారం. రాజధాని ప్రకటన కంటే ముందే టీడీపీ నేతలు ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కుపాల్పడి 4,075 ఎకరాలు కొన్నట్టు నివేదికలో పేర్కొన్నట్టు తెలిసింది. గత ప్రభుత్వంలో మంత్రులుగా వ్యవహరించిన ప్రత్తిపాటి పుల్లారావు, నారాయణ, పరిటాల సునీతతో సహా టీడీపీకి చెందిన పలువురు ముఖ్య నేతలు భూ కుంభకోణంలో ఉన్నట్టు కమిటీ తేల్చినట్టు సమాచారం. 900 ఎకరాల అసైన్డ్ భూములు ఎస్సీ, ఎస్టీల నుంచి టీడీపీ నేతలు బలవంతంగా కొన్నట్టు కూడా కమిటీ నివేదికలో ఉన్నట్టు తెలిసింది.

**సీఎంకు నివేదిక అందజేత**

గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన ప్రాజెక్టులు, నిర్మాణాలపై మంత్రివర్గ ఉపసంఘం నివేదికను సీఎం వైఎస్ జగన్‌కు అందజేసింది. దాదాపు నాలుగు నెలలపాటు రాజధాని సహా అన్ని ప్రభుత్వ విభాగాలు, ప్రాజెక్టుల్లో జరిగిన అవకతవకలపై మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేసింది. రాజధాని ప్రాంతంలోని నిర్మాణాలు, ల్యాండ్ పూలింగ్, రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపుపైనా ఈ కమిటీ అధ్యయనం చేసింది. కాగా,2011 జనాభా లెక్కల ప్రకారమే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది.

## తల, మొండెం, చేతులు వేరుచేస్తారా?

- సీఎం జగన్ ప్రకటనపై చంద్రబాబు ఆగ్రహం

**అమరావతి, నమస్తే తెలంగాణ:** 'రాజధానిని మార్చే అధికారం ఎవరిచ్చారు? ప్రపంచంలో మూడు రాజధానులు ఎక్కడైనా ఉన్నాయా? రాజధాని మార్చడానికి మీరెవరు? రాజధానుల పేరుతో తల, మొండెం, చేతులు వేరు చేస్తారా' అని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. దేశ చరిత్రలో రాజధాని మార్పు ఎక్కడా జరుగలేదన్నారు. అన్ని ప్రాంతాలకు సమానదూరంలో ఉన్న అమరావతిని రాజధానిగా చేశామని చెప్పారు. విశాఖను ఐటీ, ఫార్మా హబ్‌గా అభివృద్ధి చేయాలనుకున్నామని వివరించారు.

## రాయలసీమకు మరోసారి అన్యాయం

- ఎంపీ టీజీ వెంకటేశ్

**కర్నూలు:** ఏపీ రాజధాని విషయంలో రాయలసీమకు మరోసారి అన్యాయం జరిగిందని బీజేపీ రాజ్యసభసభ్యుడు టీజీ వెంకటేశ్ ఆవేదన వ్యక్తంచేశారు. రాయలసీమకు కూడా రాజధాని హంగులు కావాల్సిందేనని చెప్పారు. కర్నూలుకు హైకోర్టు రావడానికి చాలా సమయం పడుతుందన్నారు.

## బీజేపీ నేత కన్నా మౌనదీక్ష

**అమరావతి, నమస్తే తెలంగాణ:** అమరావతి నుంచి రాజధానిని తరలించే ప్రయత్నాలను నిరసిస్తూ ఏపీ బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ మౌనదీక్ష నిర్వహించారు. రాజధాని అమరావతి కోసం ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన శిలాఫలకం వద్ద శుక్రవారం మౌనదీక్షకు దిగారు. రాజధాని కోసం రైతులు త్యాగాలు చేశారని, ఏపీ అభివృద్ధి కోసం కేంద్రం ఎన్నో నిధులు ఇచ్చిందని చెప్పారు. సాయంత్రం ఆయన దీక్ష విరమించారు.

## 'విశాఖ పర్‌ఫెక్ట్'

- ఎంపీ సుబ్బరామిరెడ్డి

**విశాఖపట్టణం:** ఏపీ ఎగ్జిక్యూటివ్ రాజధానిగా విశాఖ పర్‌ఫెక్ట్ అని ఎంపీ టీ సుబ్బరామిరెడ్డి అన్నారు. పరిశ్రమలు ఉండ టం, పారిశ్రామికవేత్తలకు పరిచయమైన ప్రాంతం కావడంతో పారిశ్రామికవేత్తలు వస్తారని చెప్పారు.

# అమరావతిలో జర్నలిస్టులపై దాడి

**అమరావతి, నమస్తే తెలంగాణ:** రాజధాని మార్పు వార్తల నేపథ్యంలో ఏపీలోనిఅమరావతి ప్రాంతంలో ఆందోళనలు తీవ్రమవుతున్నాయి. శుక్రవారం ఉద్దండరాయునిపాలెంలో జర్నలిస్టులపై కొందరు రైతులు దాడికి పాల్పడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ మౌనదీక్షను కవర్ చేయడానికి వెళ్తున్న టీవీ9 రిపోర్టర్ దీప్తిపై కొందరు రైతులు దాడికి పాల్పడ్డారు. మహిళా రిపోర్టర్‌పై దాడి వద్దని వారించిన ఎన్టీవీ, మహాటీవీ, ఐ న్యూస్ ప్రతినిధులు హరీశ్, వసంత్, రామారావుపై కూడా దాడిచేశారు. మీడియా వాహనాలను చుట్టుముట్టి కర్రలతో దాడిచేసి ధ్వంసంచేశారు. తప్పించుకొనేందుకు యత్నించినవారిని వెంబడించి మరీ దాడికి దిగారు. ఈ ఘటనలో గాయపడ్డ జర్నలిస్టు దవాఖానలో చికిత్స పొందుతున్నారు. రైతుల ముసుగులో అసాంఘిక శక్తులు జర్నలిస్టులపై దాడిచేసినట్టు సమాచారం అందిందని పోలీసులు తెలిపారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఘటనను డీజీపీ దృష్టికి తీసుకెళ్తున్నట్టు మంత్రి పేర్ని నాని వెల్లడించారు.

## మొబైల్ వ్యసనంలోయువత

మొదటిపేజీ తరువాయి...

ఆ పరిస్థితులు కనిపించడంలేదు. మొబైల్ వ్యసనంగా మారడంతో 30 శాతం మంది మాత్రమే నెలలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువసార్లు కుటుంబసభ్యులతో గడుపుతున్నట్టు సర్వేలో వెల్లడయింది. చాలామంది నెలలో ఒక్కసారి లేదా అసలు గడపనివారు ఉన్నారు. దీని కారణంగా కుటుంబ బాధ్యతలు సరిగా నిర్వర్తించని పరిస్థితులు నెలకొంటున్నాయి. కుటుంబసభ్యుల మధ్య ఆప్యాయతలు తగ్గిపోతున్నాయి. ఇటీవల ఎక్కువవుతున్న కుటుంబ కలహాలకు మొబైల్ వ్యసనం ఓ కారణమవుతున్నది. తమను పట్టించుకోవడం లేదని.. కావాలనే దూరం పెడుతున్నారనే అనుమానాలతో గొడవలు పెరుగుతున్నాయి.

**పెడదోవ పడుతున్న యువత**

నలుగురితో తమ భావాలను పంచుకున్నప్పుడే మనిషికి మంచి జ్ఞానం, ఉన్నతమైన ఆలోచనలు ఏర్పడతాయి. మనుషుల మధ్య పరస్పర సంభాషణలు, సంబంధాలు వారిలోని మంచికి ప్రోత్సాహన్నిస్తాయి. కానీ, నేటి యువత పెడదోవలకు మొబైల్ ఓ కారణంగా మారుతున్నది. ఎక్కువ సమయం మొబైల్‌కు అతుక్కుపోయి ఇంటర్నెట్‌లో వచ్చే అనేక ప్రలోభాలకు గురవుతూ యువత తప్పుదారి పడుతున్నది. మొబైల్‌పై ధ్యాసపెడుతూ.. పెద్దలు చెప్పే మాటలు వినే పరిస్థితిలో చాలామంది లేరని సర్వేలో తేలింది.

**ఆరోగ్యానికి హాని**

సర్వే ప్రకారం అతి ప్రమాదకరస్థాయిలో ఉన్న మొబైల్ వ్యసనం.. ఇలాగే కొనసాగితే రానున్న కాలంలో చాలామందికి మానసిక, శారీరక సమస్యలు విపరీతంగా వచ్చే అవకాశాలున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొబైల్‌ను ఎక్కువగా వినియోగించడం వల్ల మెదడుపై తీవ్ర ఒత్తిడి పెరిగి మానసికంగా అనేక సమస్యలతోపాటు డిప్రెషన్ వంటి రోగాలకు గురవుతున్నారు. మొబైల్ నుంచి వచ్చే నీలికాంతితో వేగంగా కంటిచూపు కూడా తగ్గిపోతున్నది. మొబైల్ వాడుతున్న చాలామందిలో నిద్రలేమి ఓ పెద్ద సమస్యగా ఏర్పడింది. నిద్రలోకి వెళ్లినా.. ఫోన్‌లో చిన్నచప్పుడు రాగానే చటుక్కున లేస్తున్నవారు చాలామందే ఉన్నట్టు సర్వే తేల్చింది. కంటినిండా నిద్రకు దూరమై అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. వృత్తిలోనూ రాణించలేకపోతున్నారు. వీటికితోడు గుండెపోటు వంటివి అదనం.

## చెరువులపై జాతీయ సదస్సు

- శాతవాహన వర్సిటీలో 30, 31 తేదీల్లో నిర్వహణ
- సీఎంవో ఓఎస్డీ దేశ్‌పాండే 'మిషన్ కాకతీయ'పై ప్రజెంటేషన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చిన్ననీటి వనరులైన చెరువులు, వాటికి సంబంధించిన సమస్యలు-సవాళ్లపై కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీలో రెండ్రోజులపాటు జాతీయ సదస్సు జరుగనున్నది. శాతవాహనవర్సిటీ, సెంటర్ ఫర్ ఎకనమిక్స్, సోషల్ స్టడీస్ ఆధ్వర్యంలో ఈనెల 30, 31 తేదీ ల్లో సదస్సు నిర్వహిస్తున్నారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ హాజరుకానున్నారు. సదస్సులో సాంకేతిక అంశాలపై ప్రసంగిస్తారు. సీఎం కార్యాలయ ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే మిషన్ కాకతీయపై ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. భూగర్భజలాల సమస్యలు- సవాళ్లపై రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీ ప్రకా శ్ ప్రసంగిస్తారు. సాంకేతిక చర్చలు, ప్రసంగాల్లో విద్యావేత్తలు, పండితులు పాల్గొని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులు, వాటి ఫలితాలు, చెరువుల పునరుద్ధరణతోపాటు రాష్ట్రంలో వ్యవసాయం, సాగునీటిరంగాల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులపై ప్రసంగిస్తారు.


తెలంగాణ ప్రభుత్వం
O/o సూపరింటెండింగ్ ఇంజినీర్, PR రీజియన్ వరంగల్
టెండరు ప్రకటన

NIT No. 100/SCDD/19-20, సవరణ నెం.1, తేది: 24-12-2019.71/DMF/19-20, సవరణ నెం.3, తేది: 05-10-19.04/SCDD/19-20, సవరణ నెం.1, 102, 103/DMFT/19-20, 104/SDF/19-20, తేది: 24-12-2019. పనుల సంఖ్య: (6), పనుల పేరు: దిగువ సంతకందారు పరిధిలో శ్యాంపేట్ (మం), శ్యాంపేట్ మండల HQ వద్ద SC కమ్యూనిటీ హాల్ నిర్మాణం, భూపాలపల్లి (గ్రా&మం) వద్ద గవర్నమెంట్ కాలేజ్ BC హాస్టల్ కాంప్లెక్స్ నిర్మాణం, JS భూపాలపల్లి జిల్లా హెడ్ క్వార్టర్ వద్ద SC కమ్యూనిటీ హాల్ నిర్మాణం, భూపాలపల్లి (మం)లో ఖాశింపల్లి వద్ద రోడ్ డ్యామ్ నిర్మాణం, ధర్మసాగర్ (మం), జానకీపురం (గ్రా) వద్ద మహిళా కమ్యూనిటీ హాల్ నిర్మాణం మరియు ఇతర అన్ని సివిల్ పనులు. మొత్తం ECV: రూ. 491 లక్షలు. బిడ్ దాఖలు ప్రారంభ తేదీ & సమయం: 03-01-2020న రా॥ 9.00 గం. బిడ్ దాఖలుకు ముగింపు తేదీ & సమయం: 10-01-2020న మ॥ 3.00 గం. తదుపరి వివరాల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్: www.eprocurement.gov.in దర్శించండి.
DIPR RO.No. 2072-DP/CL/ADVT/1/2019-20, Dt: 27-12-2019 సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, PR రీజియన్ వరంగల్



Telangana State Industrial Infrastructure Corporation Limited
(Govt. of Telangana Undertaking)
5th Floor, Parisrama Bhavanam, H.No.5-9-58/B, Fateh Maidan Road, Hyderabad-04
Ph: +9140 23237672, website: www.tsiic.telangana.gov.in

e-Procurement Notice

Chief Engineer, TSIIC Ltd., Hyderabad invites bids for the following work

TN.No.35: Construction of Ware House and Cold Storage at Primary Processing Centre in Jillela (V), Tangalapally (M), Rajanna Siricilla District. ECV Rs. 2,50,79,311.00
Bid download starts date : 24.12.2019 from 04.00 PM
Last date for submission of bids : 31.12.2019 upto 03.00 PM
The details of tender notices and bid documents can be downloaded from web site: www.tender.telangana.gov.in
Sd/- CHIEF ENGINEER



THE TELANGANA STATE DAIRY DEVELOPMENT CO-OPERATIVE FEDERATION LIMITED
Vijaya Bhavan, Lalapet, Hyderabad-500 017. E-mail: eecivil.tsddcf@gmail.com

e-Procurement

Tender Notice No:226-230/SDE-EE/TSDDCF/2019 Dated:23.12.2019

Technical cum Commercial Tenders are invited from the experienced and reputed manufacturers / suppliers / authorized dealers / agencies for Supply, installation, Testing & Commissioning of following works in Peddakarpamula, Nagarkurnool District in Telangana State through e-procurement platform @ www.tender.telangana.gov.in.

| Tender No. | Tender Description |
|---|---|
| 226 | 10KLPD Milk Chilling centre on turn-key basis |
| 227 | 160KVA Transformer, Main electrical panel board and other allied electrical |
| 228 | 3 KL capacity Blast Freezer and Incubation room |
| 229 | Double head curd pouch filling machine |
| 230 | 500 Kgs / hr capacity Coal / Multi (Solid) fuel fired boiler along with accessories including water softening plant |

Start of downloading bid documents will commence from 28.12.2019.
Sd/- Executive Engineer



తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్
e - ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

నం. 36-37/CE/SE/EE/TS/AEE/2019-20, తేది: 27-12-2019.

రూ. 9.43 కోట్ల అంచనా కాంట్రాక్టు విలువతో రెండు(2)రోడ్ పునరుద్ధరణ పనుల కొరకు e-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి మరియు రూ. 246.43 కోట్ల అంచనా విలువ కలిగి మిస్సింగ్ లింక్స్/ స్లిప్ రోడ్ పనుల కొరకు సవరణ జారీ చేయబడినది.

| క్ర.సం. | దీని కొరకు | చదువుకొనవలసినది |
|---|---|---|
| 1 | NIT నం.32-33/CE/SE/EE/TS/AEE /2019-20, తేది:19-12-2019 | NIT నం.32-35/CE/SE/EE/ TS/AEE/2019-20, తేది:19-12-2019 |
| 2. | రెండు(2) ప్యాకేజీల కొరకు మిస్సింగ్ లింక్స్ రోడ్లు ECV. రూ. 284.0కోట్లు | 4 కాంట్రాక్ట్ ప్యాకేజీల కొరకు మిస్సింగ్ లింక్స్ రోడ్లు ECV రూ. 246.43 కోట్లు |
| 3. | బిడ్ల దాఖలుకు ఆఖరి తేది: 31-12-2019, మ.3.30 గం.కు. | బిడ్ల దాఖలుకు ఆఖరి తేది: 03-01-2020 మ.3.30 గం.కు. |

1. టెండరుదార్లు అన్ని పనుల కొరకు టెండరు షెడ్యూళ్లను e-మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.inలో 27-12-2019 మ.3.00 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
2. బిడ్ల స్వీకరణకు ఆఖరి తేదీ, సమయం: 03-01-2020న లేదా ఆలోగా మ.3.30గం.వరకు
3. సాంకేతిక బిడ్ తెరచుట 03-01-2020న సా.4.00 గం.కు
4. ఆర్థిక బిడ్ లేదా ధర బిడ్ తెరచుట: 06-01-2020న సా.4.00 గం.కు.
5. తదుపరి వివరాలను e-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చును.

సం/- చీఫ్ ఇంజినీర్ & COO, HRDCL, హైదరాబాద్
Dipr RO. No.567-PP/CL/Advt/1/2019-20, తేది: 27-12-2019



భద్రాద్రిలో శ్రీవైకుంఠ ఏకాదశి అధ్యయన మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వేకువజామునే అర్చకులు రామయ్యకు సుప్రభాతసేవ నిర్వహించారు. ఆరాధన, ఆరగింపు చేశారు. మధ్యాహ్నం స్వామిని మత్స్యావతారం రూపంలో అలంకరించారు. పల్లకీపై వేంచేయింపజేసి బాజాభజంత్రీలు, సన్నాయిమేళాలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా మిథిలా ప్రాంగణానికి తీసుకొచ్చారు. స్వామి వారిని దర్శించుకొని భక్తులు పునీతులయ్యారు. వేడుకలో ఆలయ ఈవో నరసింహులు తదితరులు పాల్గొన్నారు. - భద్రాచలం, నమస్తేతెలంగాణ

# సైకిల్‌పై దవాఖానకు కలెక్టర్

- నిజామాబాద్ జిల్లాకేంద్ర హాస్పిటల్ ఆకస్మిక తనిఖీ
- కంగుతిన్న వైద్యులు, సిబ్బంది


**ఖలీల్‌వాడి:** కలెక్టర్ ఓ సాధారణ వ్యక్తిలా సైకిల్‌పై ప్రభుత్వ దవాఖానకు వెళ్లి అక్కడి సిబ్బంది పనితీరును పరిశీలించారు. కొద్దిసేపటి తరువాత కలెక్టర్ అని తెలుసుకొని వైద్యులు, సిబ్బంది కంగుతిన్నారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నిజామాబాద్ కలెక్టర్ చింతకుంట నారాయణరెడ్డి శుక్రవారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎవరికీ సమాచారం ఇవ్వకుండా సైకిల్‌పై ఒక్కరే ఎన్టీఆర్ చౌరస్తా, బస్టాండ్ మీదుగా జిల్లాకేంద్ర దవాఖానకు వెళ్లి అన్ని విభాగాలను పరిశీలించారు. సైకిల్ మీద వెళ్తూ రోడ్డుకు ఇరుపక్కలా ఉన్న చెత్తాచెదారాన్ని, జిల్లాకేంద్ర బస్టాండ్ పరిసరాలను చూశారు. ప్రభుత్వ దవాఖాన గేటు నుంచి మొదలుకొని అంబులెన్స్ సర్వీసులు, సెక్యూరిటీని పనితీరును పర్యవేక్షించారు. సామాన్యుడి మాదిరిగానే రోగులను, వారి సహాయకులను పలకరించి వైద్యం అందుతున్న తీరును తెలుసుకున్నారు. కలెక్టర్‌నని వైద్యులను పరిచయం చేసుకొని దవాఖానలోఎక్స్‌రే, రక్తపరీక్షలు విభాగాలను పరిశీలించారు. ఒక్కో డిపార్టుమెంట్‌కు సంబంధించిన అధికారులు, వారు చేస్తున్న పనిని స్వయంగా చూశారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను చూసి ఉదయం విధులకు గైర్హాజరైన వారికి మెమోలు జారీచేయాలని అధికారులకు ఆదేశించారు.



సైకిల్‌పై నిజామాబాద్ జిల్లా దవాఖానకు వస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

## నేడు నేరెళ్ల వేణుమాధవ్ జయంతి

వరంగల్‌లో కాంస్య విగ్రహం ఆవిష్కరణ



వేణుమాధవ్ (ఫైల్)

**పోచమ్మమైదాన్(వరంగల్):** ప్రపంచ ప్రఖ్యాత మిమిక్రీ కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత నేరెళ్ల వేణుమాధవ్ 88వ జయంతిని శనివారం వరంగల్‌లో నిర్వహించనున్నారు. ఆయన మిమిక్రీ కళాకారుడిగానే గాక పలు చిత్రాల్లో నటుడిగా రాణించారు. ఎంతోమందిని మిమిక్రి కళాకారులుగా తీర్చిదిద్దారు. వేణుమాధవ్ జయంతి సందర్భంగా నగరంలోని హన్మకొండ పబ్లిక్ గార్డెన్‌లో నేరెళ్ల కాంస్య విగ్రహాన్ని శనివారం ఆవిష్కరిస్తారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, మిమిక్రీ ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి వందలాది మంది కళాకారులతో స్వరార్చన కార్యక్రమం కొనసాగిస్తున్నట్టు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ స్మారక పురస్కారాలను ఈ ఏడాది ఇద్దరికి అవార్డులు ఇవ్వనున్నారు. వీరిలో వరంగల్‌కు చెందిన ఫొటోగ్రఫీ ఆర్టిస్ట్ భరత్ భూషణ్ గుడిమళ్ల, విజయవాడకు చెందిన హరికథ కళాకారుడు జాగర్లమూడి నాగేశ్వర శర్మ ఉన్నారు. అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తదితరులు పాల్గొనున్నారు.





జనగామలో రెండో విడుత పల్లె ప్రగతిపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి. చిత్రంలో ఎమ్మెల్యే రాజయ్య తదితరులు ఉన్నారు.

## గ్రామాలకు రూ.339 కోట్లు విడుదల

పల్లెప్రగతి అవగాహన సదస్సులో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**జనగామ జిల్లాప్రతినిధి, నమస్తేతెలంగాణ:** గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకెళ్తున్నదని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. జనవరి 2 నుంచి 12వ తేదీ వరకు రెండోవిడుత పల్లె ప్రగతి చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం జనగామలో ప్రజాప్రతినిధులు, అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి కోసం నిధులకు ఢోకా లేదన్నారు. ఇటీవలే రూ.84 కోట్లు విడుదల చేయడానికి సీఎం ఆమోదం తెలిపారన్నారు. పల్లెప్రగతి కార్యక్రమంలో హరితహారం, డంపింగ్‌యార్డు, వైకుంఠధామం, నర్సరీ, ఇంకుడు గుంతలు, శుభ్రత, పూర్వవిద్యార్థుల సమ్మేళనం, పట్టణాల్లో నివసిస్తున్న వారితో సమావేశాలు నిర్వహించి ప్రగతి సాధించిన గ్రామానికి రూ.25 లక్షలు అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 2.26 ఎకరాలకు పాస్‌బుక్ ఇప్పించండి

నర్మెట తాసిల్ ఎదుట మహిళా రైతు ఆందోళన

**నర్మెట:** తన మొత్తం భూమికి పాస్‌పుస్తకాలు ఇవ్వాలని ఓ మహిళా రైతు పెట్రోల్ బాటిల్, పురుగుమందు డబ్బాతో శుక్రవారం జనగామ జిల్లా నర్మెట తాసిల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. నర్మెట మండలం దొంగలశెలిమెతండాకు చెందిన భూక్య ప్రమీలకు సర్వేనంబర్ 86/బీలో 2.26 ఎకరాల భూమి ఉన్నది. మల్లన్నగండి రిజర్వాయర్ ముంపు కింద 1.39 ఎకరాల భూమి పోను 27 గుంటలు మాత్రమే వర్తిస్తుందని రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. దీంతో ఆమె శుక్రవారం తాసిల్ కార్యాలయానికి కుటుంబసభ్యులతో వచ్చి పెట్రోల్ బాటిల్, పురుగులుమందు డబ్బాతో నిరసన వ్యక్తంచేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై జక్కుల పరమేశ్వర్, పోలీస్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి తగిన న్యాయం చేయాలని బాధితురాలు వేడుకున్నారు. ఈ విషయమై తాసిల్దార్ మురళీధర్‌రావును వివరణ కోరగా.. విచారణ జరిపి న్యాయం చేస్తామని వెల్లడించారు.



వన్‌బీ పత్రాన్ని చూపుతున్న బాధితురాలు

# ‘పుర’ పోరులోనూ గెలుపు మనదే..

- టీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశాల్లో మంత్రులు
- మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా కార్యకర్తలకు దిశానిర్దేశం





కరీంనగర్‌లో ఎన్నికల సమరభేరి సభలో మాట్లాడుతున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్.. సూర్యాపేట టీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

**నమస్తేతెలంగాణ నెట్‌వర్క్:** పురపోరులోనూ గెలుపు గులాబీదే కావాలని మంత్రులు గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయాచోట్ల జరిగిన కార్యకర్తల సమావేశాల్లో వారు మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో జరిగిన టీఆర్‌ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్.. మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసేవారికి తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. ఎంపీ ఎన్నికల్లో ఓటమిని గుణపాఠంగా తీసుకొని, అతి విశ్వాసానికి పోకుండా టీఆర్‌ఎస్ చేపడుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి ఓట్లు అభ్యర్థించాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్‌ఎస్‌తోనే నగర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. మతాన్ని రెచ్చగొట్టే రాజకీయాలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉన్నదన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా తీసుకున్న పౌరసత్వ సవరణ చట్టాన్ని టీఆర్‌ఎస్ వ్యతిరేకిస్తున్నదన్నారు.

**కోట్లాది నిధులతో నగరాభివృద్ధి..**

బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. ప్రజల్లో టీఆర్‌ఎస్ పట్ల చెక్కుచెదరని విశ్వాసం, సీఎం కేసీఆర్ పాలనపై పరిపూర్ణమైన నమ్మకం ఉన్నదన్నారు. నగర అభివృద్ధికి కోట్లాది నిధులు ఇచ్చారని తెలిపారు. ఎంపీగా గెలిచిన బీజేపీ నాయకుడు ఏడు నెలలైనా ఏడు రూపాయలు కూడా తేలేదన్నారు. కలిసికట్టుగా పనిచేసి నగరంలో అన్ని స్థానాల్లో విజయఢంకా మోగించాలని కార్యకర్తలను కోరారు. సమావేశంలో జెడ్పీ అధ్యక్షురాలు కనుమల్ల విజయ, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్‌హుస్సేన్, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు కోడూరి సత్యనారాయణగౌడ్, ఆరెపల్లి మోహన్ పాల్గొన్నారు.

**అభివృద్ధే టీఆర్‌ఎస్ ఎజెండా**

శాంతియుత వాతావరణం, సుస్థిరత పాలన, అభివృద్ధే టీఆర్‌ఎస్ ఎజెండా అని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల పరిధిలోని అనంతారం క్రాస్ రోడ్డు వద్ద సూర్యాపేట నియోజకవర్గ స్థాయి టీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. త్వరలో జరగనున్న సూర్యాపేట మున్సిపల్ ఎన్నికలో టీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తల అభిప్రాయాలు సేకరించి, పలు సూచనలు అందించారు. సూర్యాపేటలోని అన్ని వార్డులకు ఇంచార్జీలను ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో సూర్యాపేట పట్టణంలోని 48 స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ప్రతిపక్ష పార్టీలు అభ్యర్థులను ఎవరిని నిలబెట్టాలని సందిగ్ధంలో ఉన్నాయని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ రాకముందు నుంచే ఆ పార్టీ పెద్దలు అయోమయంలో పడ్డారని, ఆ పార్టీల తరపున పోటీ చేయడానికి అభ్యర్థులు దొరకటం లేదన్నారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నిక తరహాలోనే మున్సిపల్ ఫలితాలు కూడా టీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఉంటాయన్నారు.



మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న విప్ బాల్క సుమన్

**గులాబీ జెండా ఎగురేస్తాం..**

టీఆర్‌ఎస్ అంటేనే అభివృద్ధికి చిరునామా అని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ స్పష్టంచేశారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూర్ మున్సిపాలిటీలోని మొత్తం 18 వార్డుల్లో టీఆర్‌ఎస్ ఘన విజయం సాధిస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు వార్డుల వారీగా ఇంటింటి ప్రచారం చేయాలని కోరారు.

# గ్రామస్వరాజ్యం కల నెరవేరింది

- కేసీఆర్ రూపొందించిన ‘పల్లెప్రగతి’కి ప్రజాదరణ
- రెండో విడుతలోనూ సిద్దిపేట జిల్లా ఆదర్శంగా నిలువాలి
- ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు



గజ్వేల్‌లోని మహతి ఆడిటోరియంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

**గజ్వేల్, నమస్తేతెలంగాణ:** పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామస్వరాజ్యం సిద్ధించిందని, సీఎం కేసీఆర్ మానస పుత్రిక ‘పల్లె ప్రగతి’ మొదటి విడుతలోనే రాష్ట్రంలో అద్భుత ఫలితాలు వచ్చాయని ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. జనవరి రెండు నుంచి చేపట్టే రెండో విడుత పల్లె ప్రగతిపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు శుక్రవారం గజ్వేల్‌లోని మహతి ఆడిటోరియంలో సిద్దిపేట జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి రెండో విడుతలో సిద్దిపేటను మరోసారి ఆదర్శంగా నిలుపాలని కోరారు. పల్లె ప్రగతి కార్యక్రమాన్ని మరింత విజయవంతానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం కోసం ఏర్పాటు చేసిన పల్లె పురోగతి ప్రత్యేక యాప్‌ను మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన గాలి గ్రామాల్లో అందుబాటులో ఉండటంతో పట్టణాల ప్రజలు కూడా గ్రామాల వైపు చూస్తున్నారన్నారు. రెండో విడుత పల్లె ప్రగతి కార్యక్రమంలో 10 రోజులు అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ఉండి పెండింగ్ పనుల పూర్తితోపాటు కొత్తగా చేపట్టిన పనులను ప్రజల భాగస్వామ్యంతో పూర్తి చేయడానికి పంచాయతీల మధ్య పోటీతత్వం ఏర్పరచుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీలకు ప్రతి నెలా విడుదల చేసే రూ. 339 కోట్లు ఈ నెలలో కూడా విడుదల చేశామని, పంచాయతీలకు నిధులు, అధికారుల సహకారం, ప్రభుత్వ సూచనలు పుష్కలంగా ఉన్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**పల్లె పురోగతి యాప్‌తో బహుళ ప్రయోజనాలు**

పల్లె ప్రగతి కార్యక్రమాన్ని మరింత విజయవంతంగా నిర్వహించడానికి ‘పల్లె పురోగతి’ యాప్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు సౌకర్యవంతంగా మారుతుందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఏ రోజు జరిగే పనులను ఆ రోజే యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. అధికారులు అవసరమైన వారితో టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుకోవచ్చన్నారు. ప్రోగ్రెస్ రిపోర్టు, క్షేత్రస్థాయి పరిశీలన, అధికారుల పనితీరుపై ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలు కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణాశర్మ, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, చిట్టి దేవేందర్‌రెడ్డి, లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై లైంగికదాడి

- వాట్సాప్‌లో ఫొటోలు
- పోలీసుల అదుపులో నిందితుడు

**మిరుదొడ్డి:** ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికపై యువకుడు లైంగికదాడికి పాల్పడ్డ ఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలంలోని ఓ గ్రామంలో శుక్రవారం వెలుగుచూసింది. పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డి మండలంలోని ఓ గ్రామానికి చెందిన పూజారి మహేందర్ (23)అదే గ్రామానికి చెందిన బాలికతో పరిచయం ఏర్పరుచుకున్నాడు. ఈ నెల 24న బాలికకు మాయమాటలు చెప్పి తన వ్యవసాయబావి వద్దకు తీసుకెళ్లి.. లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో మహేందర్ లైంగికదాడికి సంబంధించిన ఫొటోలను వాట్సాప్ గ్రూప్‌లో పెట్టాడు. దీంతో శుక్రవారం బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు మహేందర్‌పై పోక్సో కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. బాలికను వైద్య పరీక్షల కోసం సిద్దిపేట ఏరియా దవాఖానకు తరలించారు.





హెచ్చార్సీ కార్యాలయం ఎదుట విలపిస్తున్న జయమ్మ.. నిరసన తెలుపుతున్న రైతులు

## పోలీసుల తీరుపై హెచ్చార్సీకి ఫిర్యాదులు

**అనంతగిరి:** కొడుకు నుంచి ఆస్తిని ఇప్పించాలని ఎస్సైకి ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా అతడు దుర్భాషలాడాడని సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం చనుపల్లికి చెందిన సోమిరెడ్డి జయమ్మ(65) శుక్రవారం హెచ్చార్సీకి ఫిర్యాదు చేశారు. తన పేరిట ఉన్న ఆరెకరాల భూమిని తన కొడుకు బలవంతంగా రాయించుకున్నాడని.. ఇంట్లోకి రానీయకుండా దాడిచేసి గాయపరిచాడని పేర్కొన్నారు. ఇదే విషయమై ఈనెల 17న అనంతగిరి ఎస్సై రామాంజనేయులుకు ఫిర్యాదు చేయగా అతడు తనతో ఆసభ్యంగా మాట్లాడాడని హెచ్చార్సీకి ఫిర్యాదుచేశారు. ఎస్సైపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. ఆస్తి తనకు దక్కేలా చూడాలని.. ఎస్సైపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.


**జనగామ గ్రామ రైతుల ఫిర్యాదు..**

**సుల్తాన్ బజార్:** భూవివాదంలో పోలీసులు జోక్యం చేసుకుంటున్నారంటూ యాదాద్రి భువనగిరి జిల్లా జనగామకు చెందిన 15 మంది రైతులు హెచ్చార్సీకి ఫిర్యాదుచేశారు. తమ కుటుంబానికి చెందిన భూమిని ఆనుకొని అదే గ్రామానికి చెందిన వేంరెడ్డి నరేందర్‌రెడ్డికి భూమి ఉన్నట్టు బాధితులు తెలిపారు. నరేందర్‌రెడ్డి దారి కోసం తమ భూమిని ఆక్రమించుకున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో న్యాయం చేయాలని సంస్థాన్ పురం పోలీసులను ఆశ్రయించగా నరేందర్‌రెడ్డితో కుమ్మక్కైన చౌటుప్పల్ ఏసీపీ సత్తయ్య, ఎస్సై నాగరాజు, ఏఎస్సై శ్యాంసుందర్‌రెడ్డి తమపై కేసులు బనాయించి విచక్షణారహితంగా కొట్టారని వాపోయారు.

## మున్సిపల్ కమిషనర్‌పై పెట్రోల్ దాడికియత్నం

అడ్డుకొని పోలీసులకు అప్పగించిన సిబ్బంది

**సిరిసిల్ల క్రైం:** సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌పై శుక్రవారం పెట్రోల్‌తో దాడికియత్నం జరిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల మండలం రాజీవ్‌నగర్‌కు చెందిన సంకినేని శంకర్ శుక్రవారం మున్సిపల్ కార్యాలయానికి పెట్రోల్‌తో వెళ్లాడు. తనతోపాటు కమిషనర్‌పై పెట్రోలు పోసేందుకు యత్నించాడు. సిబ్బంది అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. ఇంటి నిర్మాణ అనుమతుల విషయంలో మున్సిపల్ అధికారులు ఇబ్బందులు పెడుతుండటంతో శంకర్ అఘాయిత్యానికి పాల్పడినట్టు తెలిసింది. శంకర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.



నిందితుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

## సమత కేసులో ఏడుగురు సాక్షుల విచారణ

**ఆదిలాబాద్, నమస్తే తెలంగాణప్రతినిధి:** సమత కేసు విచారణను ఆదిలాబాద్ ప్రత్యేక కోర్టు సోమవారానికి వాయిదా వేసింది. శుక్రవారం ముగ్గురు నిందితులు షేక్ బాబా, షేక్ షాబొద్దీన్, షేక్ మగ్దూమ్‌లను పోలీసులు కోర్టుకు తీసుకొచ్చారు. శుక్రవారం పదిమంది సాక్షులను విచారించాల్సి ఉండగా ఖానాపూర్, లింగాపూర్ తాసిల్దార్లతో సహా ఏడుగురిని కోర్టు విచారించింది. ప్రాసిక్యూషన్ తరపున పీపీ రమణారెడ్డి, డిఫెన్స్ లాయర్ రహీం వాదనలు వినిపించారు. విచారణ అనంతరం నిందితులను ఆదిలాబాద్ జైలుకు తరలించారు.

## ఇద్దరిని మింగిన వివాహేతర సంబంధం

ప్రియురాలిని చంపి ప్రియుడు బలవన్మరణం

**తాండూరు, నమస్తేతెలంగాణ:** వివాహేతర సంబంధం ఇద్దరి ప్రాణాలను బలిగొన్నది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా యాలాల మండలం అగ్గనూరులో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. తాండూరు నియోజకవర్గ పరిధిలోని అగ్గనూరుకు చెందిన అంజిలమ్మకు 16 ఏండ్ల క్రితం చెన్‌గేశ్‌పూర్‌కు చెందిన వ్యక్తితో వివాహమైంది. కాగా అంజిలమ్మ అదే గ్రామానికి చెందిన నర్సింహులుతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో భర్త ఆమెకు విడాకులు ఇచ్చాడు. అనంతరం అగ్గనూరులో ఉంటున్న అంజిలమ్మ(42).. నర్సింహులు(36)తో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నది. కొంతకాలంగా వీరిద్దరి మధ్య గొడవలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో నర్సింహులు గురువారం అర్ధరాత్రి అంజిలమ్మ ఇంటికివెళ్లి ఆమెపై పెట్రోల్‌పోసి తాను నిప్పంటించుకున్నాడు. కాపాడేందుకు యత్నించిన ఆమె తల్లిదండ్రులు హన్మప్ప, చంద్రమ్మలకు కూడా గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్థులు వారిని తాండూరు జిల్లా దవాఖానకు తీసుకెళ్లారు. అంజిలమ్మ, నర్సింహులు పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలిస్తుండగా ఇద్దరు మృతి చెందారు.


## ఖమ్మంలో మిర్చికి రికార్డ్ ధర

క్వింటాల్‌కు రూ.19,600

**ఖమ్మం వ్యవసాయం:** ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో తేజా రకం కొత్తమిర్చికి రికార్డుస్థాయిలో క్వింటాల్‌కు రూ.19,600 ధర పలికింది. కాగా మధ్యరకానికి గరిష్ఠంగా రూ.16 వేలు, కనిష్ఠంగా రూ.9 వేలు పలికింది. తాలురకం పంట గరిష్ఠంగా రూ.7 వేలు, కనిష్ఠంగా రూ.5 వేలు వెచ్చించి ఖరీదుదారులు కొనుగోలు చేశారు. పక్షం రోజుల నుంచి ఖమ్మం మార్కెట్లో మిర్చి పంటకు పెరుగుతున్న ధరలతో ఖమ్మం, వరంగల్ రూరల్, సూర్యాపేట జిల్లాల నుంచి రైతులు పంటను తీసుకొస్తున్నారు.

### చలికాలం

| జిల్లా | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| కుమ్రంభీం ఆసిఫాబాద్ | 09.0 | 28.0 |
| పెద్దపల్లి | 12.0 | 26.0 |
| రాజన్న సిరిసిల్ల | 14.0 | 25.0 |
| కామారెడ్డి | 14.0 | 27.0 |
| జగిత్యాల | 14.0 | 28.0 |
| వరంగల్ రూరల్ | 16.0 | 27.0 |
| రంగారెడ్డి | 16.0 | 27.0 |
| యాదాద్రి భువనగిరి | 16.0 | 28.0 |
| నల్లగొండ | 16.0 | 29.2 |
| సంగారెడ్డి | 16.9 | 32.2 |
| మహబూబాబాద్ | 17.0 | 27.0 |
| సూర్యాపేట | 17.0 | 28.0 |
| ఆదిలాబాద్ | 17.2 | 24.8 |
| మెదక్ | 17.4 | 30.7 |
| సిద్దిపేట | 17.5 | 30.5 |
| నిర్మల్ | 18.0 | 27.0 |
| నాగర్‌కర్నూల్ | 18.0 | 28.0 |
| భద్రాద్రి కొత్తగూడెం | 18.0 | 29.0 |
| వికారాబాద్ | 18.1 | 33.3 |
| వనపర్తి | 18.3 | 33.7 |
| కరీంనగర్ | 18.4 | 29.3 |
| జనగామ | 18.5 | 26.6 |
| మంచిర్యాల | 18.8 | 28.2 |
| వరంగల్ అర్బన్ | 19.0 | 27.5 |
| ములుగు | 19.0 | 27.0 |
| ఖమ్మం | 19.0 | 28.0 |
| జయశంకర్ భూపాలపల్లి | 20.0 | 29.0 |
| హైదరాబాద్ | 20.4 | 28.7 |
| మేడ్చల్ | 20.4 | 28.7 |
| జోగులాంబ గద్వాల | 21.3 | 31.2 |
| నిజామాబాద్ | 21.4 | 26.4 |
| మహబూబ్‌నగర్ | 22.5 | 30.2 |
| నారాయణపేట | 22.5 | 30.2 |



నల్లగొండ జిల్లా చందంపేట, పెద్ద అడిశర్లపల్లి మండలాల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో వారం రోజులుగా జెట్ విమానం చక్కర్లు కొడుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శుక్రవారం చందంపేట మండలంలోని చిత్రియాల, నల్లచెలమూల, పెద్దమూల, రేకుల గడ్డ, తెల్‌దేవర్‌పల్లి గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో తక్కువ ఎత్తు నుంచి ఎగురుతూ పలుమార్లు చక్కర్లు కొట్టింది. రెండు రోజుల క్రితం పెద్ద అడిశర్లపల్లి మండలంలోని నంబాపురం, పెద్దగట్టు, దుగ్యాల, మేడారం, తిరుమలగిరి గ్రామాల అటవీ ప్రాంతాల్లో చక్కర్లు కొట్టింది. ఈ ప్రాంతంలో యురేనియం తవ్వకాల కోసం సర్వే నిర్వహించేందుకే విమానం చక్కర్లు కొడుతున్నదని గ్రామస్థులు అనుమానిస్తున్నారు. -చందంపేట

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

**నర్సాపూర్ రూరల్:** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా.. ఆరుగురికి గాయాలైన ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలో శుక్రవారం చోటుచేసుకున్నది. మేడ్చల్ జిల్లా సూరారం, సంగారెడ్డి జిల్లా బొంతపల్లికి చెందిన ఎనిమిది మంది సూరారం చర్చి నుంచి నర్సాపూర్ మండలం అహ్మద్‌నగర్ లోని చర్చికి ఆటోలో బయలుదేరారు. పెద్దచింతకుంట వద్దకు రాగానే ఆగి ఉన్న లారీని వెనుకనుంచి ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ నరేశ్, సూరారం వాసి దేవరాజు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి.



# నిఖత్ X మేరీకోమ్


నేడు ఇద్దరి మధ్య ఫైనల్ బౌట్

ఒలింపిక్ క్వాలిఫయర్స్ ట్రయల్స్



**న్యూఢిల్లీ:** భారత బాక్సింగ్‌లో ఆసక్తి కర పోరుకు రంగం సిద్ధమైంది. గత కొన్ని రోజులుగా వార్తల్లో ప్రముఖంగా నిలుస్తున్న తెలంగాణ యువ బాక్సర్ నిఖత్ జరీన్, బాక్సింగ్ క్వీన్ మేరీ కోమ్ ముఖాముఖి తలపడే సమయం ఆసన్నమైంది. టోక్యో (2020) ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీ కోసం జరుగుతున్న ట్రయల్స్‌లో భాగం గా శనివారం జరిగే మహిళల 51కిలోల విభాగం ఫైనల్లో మేరి, నిఖత్ బౌట్‌లోకి దిగనున్నారు. క్వాలిఫయింగ్ టోర్నీ కోసం పారదర్శకంగా ఎంపిక చేయాలన్న నిఖత్ డిమాండ్ మేరకు భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) రెండు రోజుల పాటు ట్రయల్స్ నిర్వహించేందుకు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా శుక్రవారం జరిగిన 51కిలోల ఫైట్‌లో నిఖత్ జరీన్.. జాతీయ చాంపియన్ జ్యోతి గులియాను చిత్తు చేసింది. ప్రత్యర్థికి ఏ మాత్రం అవకాశమివ్వకుండా పదునైన పంచ్‌లు కురిపిస్తూ ఉక్కిరిబిక్కిరి చేసింది. జాబ్స్, హుక్స్‌తో చెలరేగిన నిఖత్.. జ్యోతిపై పూర్తి ఆధిపత్యంతో బౌట్‌ను కైవసం చేసుకుంది. మరో బౌట్‌లో ఆరుసార్లు ప్రపంచ చాంపియన్ మేరీకోమ్.. రీతు గ్రెవాల్‌పై అలవోక విజయం సాధించింది. తన సుదీర్ఘ అనుభవాన్ని బౌట్‌లో ప్రత్యర్థిపై ప్రదర్శిస్తూ ముందడుగు వేసింది. మేరీతో పోరుపై నిఖత్ స్పందిస్తూ 'బౌట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. శనివారం జరిగే మ్యాచ్‌కు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాను. పూర్తి పారదర్శకంగా జరుగాలనుకుంటున్నాను' అని అంది. మిగతా బౌట్లలో సాక్షి చౌదరీ (57కి), సిమ్రన్‌జిత్ కౌర్ (60కి), సరితా దేవి, పూజ రాణి, లవ్లీనా బోర్గోహెయిన్, లలిత, నుపుర్, పూజ రాణి ఫైనల్స్‌కు చేరుకున్నారు. చైనా వేదికగా వచ్చే ఫిబ్రవరి 3 నుంచి ఒలింపిక్ క్వాలిఫయర్స్ టోర్నీ జరుగనుంది.

# పట్టు పట్టారు



బజరంగ్

**సుదీర్ఘ చరిత్ర గల ఒలింపిక్ క్రీడల్లో భారత్ ఇప్పటి వరకు అన్ని విభాగాల్లో కలిపి 28 పతకాలు సాధించింది. అందులో సింహభాగం (11 పతకాలు) జాతీయ క్రీడ హాకీలో కొల్లగొట్టినవే కాగా.. ఆ తర్వాత అత్యధిక మెడల్స్ అందించిన విభాగం రెజ్లింగే. స్వతంత్ర భారతంలో మనకు దక్కిన తొలి వ్యక్తిగత ఒలింపిక్ పతకం కూడా కుస్తీలోనే కావడం విశేషం. ఇప్పటి వరకు విశ్వక్రీడల్లో మన మల్లయోధులు ఒక రజతం, నాలుగు కాంస్యాలు చేజిక్కించుకున్నారు. మహాభారత కాలం నుంచి మన దేశంలో ప్రాచుర్యం పొందిన మల్లయుద్ధమే దినదినాభివృద్ధి చెందుతూ.. రెజ్లింగ్‌గా రూపుదిద్దుకుంది. కజకిస్థాన్ వేదికగా సెప్టెంబర్ 2019లో జరిగిన ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో 5 పతకాలు నెగ్గడంతో పాటు 4 ఒలింపిక్ బెర్తులు ఖాతాలో వేసుకొని మన రెజ్లర్లు తమ పట్టు పవర్ ఏంటో ప్రపంచానికి చాటిచెప్పారు. బజరంగ్, దీపక్, వినేశ్, రవి దహియా టోక్యో టికెట్ ఖరారు చేసుకున్నారు. బజరంగ్ తనలో సత్తా తగ్గలేదని నిరూపించుకుంటే.. 'ఫోగట్ సిస్టర్స్'నుంచి వినేశ్ ఉత్తుంగతరంగంగా ఎదిగింది. ఇక జూనియర్ విభాగంలో మెరుపులు మెరిపించిన దీపక్ పూనియా.. సీనియర్ లెవల్‌లో చరిత్ర తిరుగరాయాలని తహతహలాడుతున్నాడు. మరి ఈ ఏడాది వీరి ప్రదర్శనపై ఓ లుక్కేస్తే..**

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో దీపక్ (86 కేజీలు) రజత పతకంతో మెరిస్తే.. బజరంగ్ (65 కేజీలు), రవి కూమార్ దహియా (57 కేజీలు), వినేశ్ ఫోగట్ (53 కేజీలు) కాంస్యాలు సాధించారు. ఈ నలుగురు పతకాలు కొల్లగొట్టడంతో పాటు టోక్యో ఒలింపిక్స్‌లో స్థానాలు పదిలం చేసుకున్నారు. మరో యువ రెజ్లర్ రాహుల్ అవారే (61 కేజీలు) కూడా కాంస్య పతకం చేజిక్కించుకున్నా.. అది నాన్ ఒలింపిక్ కేటగిరీ కావడంతో అతడికి బెర్త్ దక్కలేదు. మరోవైపు డబుల్ ఒలింపిక్ పతక విజేత సుశీల్ కుమార్, రియో ఒలింపిక్స్ కాంస్య విజేత సాక్షి మాలిక్ మాత్రం స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేక చతికిలపడ్డారు. మొత్తంగా చూసుకుంటే.. సీనియర్లు సత్తాచాట లేకపోయినా.. యువ రక్తం మేమున్నామంటూ ముందుకు దూసుకొచ్చి ఒలింపిక్ పతకాలపై ఆశలు రేపుతున్నది.

### భళా బజరంగ్

యోగేశ్వర్ దత్ వారసుడిగా మ్యాట్‌పై అడుగు పెట్టిన బజరంగ్ పూనియా అనతి కాలంలోనే స్టార్ రెజ్లర్‌గా ఎదిగాడు. ప్రత్యర్థి కదిలికలకు అనుగుణంగా అప్పటికప్పుడు గేమ్ ప్లాన్ మార్చుకోవడంలో దిట్ట అయిన బజరంగ్ ఈ ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. కజకిస్థాన్‌లో జరిగిన ఈ టోర్నీ సెమీఫైనల్లో స్థానిక రెజ్లర్ దౌలత్ నియాజ్బెకావ్ చేతిలో ఓడిన బజరంగ్ మూడో స్థానంలో నిలిచాడు. అయితే అంపైర్ల నిర్వాకం వల్లే బజరంగ్ ఓటమి పాలయ్యాడనే విషయం బౌట్ చూసిన ప్రతి ఒక్కరికీ అర్థమైంది. టోర్నీ నిర్వాహకులు స్థానిక రెజ్లర్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చారని బజరంగ్ మ్యాట్‌పైనే తలపట్టుకున్న దృశ్యం చాన్నాళ్లు వెంటాడింది. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న బజరంగ్.. డిఫెన్స్‌లో ఎంత బలంగా ఉన్నా.. బౌట్ చివరి వరకు వెనుకంజలో ఉండే అలవాటును మార్చుకోవాల్సిన అవసరం ఉంది. టోక్యో పతకమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బజరంగ్.. సోనిపట్‌లో ప్రత్యేక శిక్షణలో నిమగ్నమయ్యాడు.

### రవి కుమార్ దహియా

శత్రు దుర్భేద్యమైన డిఫెన్స్‌తో పతకాలు కొల్లగొడుతున్న రవి కుమార్ దహియా కూడా ఈ ఏడాది చక్కటి ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం నెగ్గిన 22 ఏండ్ల రవి టెక్నిక్‌లో వయసుకు మించిన పరిణతి చూపిస్తున్నాడు. ప్రో లీగ్‌తో వెలుగులోకి వచ్చిన రవి అంతర్జాతీయ స్థాయిలోనూ ఇదే ఆటతీరు అనుసరిస్తున్నాడు. వరల్డ్ చాంపియన్‌షిప్ 61 కేజీల విభాగంలో రాహుల్ అవారే కూడా కాంస్యం దక్కించుకున్నా.. ఈ విభాగంలో ఒలింపిక్ బెర్త్‌లు లేకపోవడంతో అతడికి నిరాశ ఎదురైంది.

### సీనియర్లకేమైంది!

మనదేశం నుంచి ఇప్పటి వరకు రెండు వ్యక్తిగత ఒలింపిక్స్ పతకాలు సాధించిన ఏకైక ఆటగాడు సుశీల్ కుమార్. అంతటి ఘన చరిత్ర ఉన్న సుశీల్ (66 కేజీలు) ప్రస్తుతం బరిలో దిగిన టోర్నీల్లో తొలి రౌండ్ దాటలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఒక దశలో పట్టు పడితే పతకం ఖాయమే అనేలా విజృంభించిన ఈ హర్యానా స్టార్.. ప్రస్తుతం ఫామ్‌లోకొచ్చేందుకు శ్రమిస్తున్నాడు. 36 ఏండ్ల వయసులో తన టెక్నిక్‌కు పదునుపెట్టే పనిలో పడ్డాడు. మరోవైపు రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సాక్షి మాలిక్ (62 కేజీలు) కూడా పెద్దగా ప్రభావం చూపలేకపోతున్నది. టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ నుంచి కూడా ఆమె పేరు తొలగించారంటే ప్రదర్శన ఎంత దిగజారిందో అర్థం చేసుకోవచ్చు.

### రెజ్లింగ్ @ హర్యానా

మనదేశానికి స్వాత్రంత్యం వచ్చాక పుణెకు చెందిన దిగ్గజ రెజ్లర్ కేడీ జాదవ్ వ్యక్తిగత విభాగంలో తొలి పతకం (కాంస్యం) అందించాడు. ప్రస్తుతం కుస్తీలో హర్యానా ఆధిపత్యం బాగా పెరిగింది. 'అఖాడా'లకు పెట్టింది పేరైన హర్యానాలో ప్రతి ఇంటి నుంచి ఓ మల్లయోధుడు ఉంటాడనడం అతిశయోక్తి కాదేమో. ఈ ఏడాది అంతర్జాతీయ స్థాయిలో మెరిసిన రెజ్లర్లను పరిశీలిస్తే.. ఆ విషయం మరోసారి అవగతమవుతుంది. కురుక్షేత్ర కాలం నుంచి కుస్తీని నరనరాన జీర్ణించుకున్న ఇక్కటి యువత మల్ల యుద్ధానికి సదా సిద్ధం అంటున్నది.



దీపక్

## నేనున్నానంటూ..

ఈ ఏడాది ఆరంభంలో ప్రపంచ జూనియర్ చాంపియన్ టైటిల్ నెగ్గిన దీపక్.. సీనియర్ విభాగంలోనూ అదే దూకుడు కొనసాగించాడు. సీనియర్లు ఆకట్టుకోలేకపోయిన చోట ఈ 20 ఏండ్ల యువ సంచలనం అదరగొట్టాడు. ప్రపంచ చాం పియన్‌షిప్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లిన ఈ యంగ్ తరంగ్ గాయం కారణంగా స్వర్ణం చేజిక్కించుకునే అవకాశాన్ని కోల్పోయాడు. సుశీల్ కుమార్ (2010) తర్వాత ఈ టోర్నీ ఫైనల్ చేరిన దీపక్ రజతంతో సరిపెట్టుకున్నాడు. ఏడాదంతా నిలకడగా రాణించడంతో యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ ఈ యేటి మేటి జూనియర్ రెజ్లర్ అవార్డు దీపక్‌ను వరించింది. 2016లో క్యాడెట్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పసిడి నెగ్గడం ద్వారా లైమ్‌లైట్‌లోకి వచ్చిన దీపక్ ఆ తర్వాత వెనుదిరిగి చూసుకోలేదు. పాల వ్యాపారం చేసే తండ్రి కష్టాన్ని గుర్తెరిగిన పూనియా.. వరుస విజయాలతో ఈ స్థాయికి చేరాడు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం నెగ్గడమే దీపక్ కెరీర్‌లో ఇప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శన. ముఖ్యంగా కాళ్ల కదలికలతో ప్రత్యర్థిని తికమకపెట్టే దీపక్.. తనకంటే మెరుగైన ఆటగాళ్లపై విజయాలు సాధించి భవిష్యత్తుపై ఆశలు రేపుతున్నాడు. 2012 లండన్ ఒలింపిక్స్‌లో నమోదు చేసిన ప్రదర్శన (6 పతకాలు)ను టోక్యో (2020)లో అధిగమిస్తామని కేంద్ర క్రీడల మంత్రి కిరణ్ రిజిజు నమ్మకంగా చెప్పడం వెనుక ఇలాంటి యువ ఆటగాళ్ల ప్రదర్శన దాగుందనేది అక్షర సత్యం.

## వినేశ్ ఫోగట్

ప్రతిష్ఠాత్మక టోక్యో ఒలింపిక్స్‌కు భారత్ నుంచి బెర్త్ దక్కించుకున్న తొలి రెజ్లర్ వినేశ్ ఫోగట్. ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌సిప్‌లో సత్తాచాటిన వినేశ్.. ఒలింపిక్ రజత పతక విజేత సారా హెల్డెబ్రాంట్‌పై నెగ్గడంతోనే టోక్యో టికెట్ దక్కించుకుంది. ప్రస్తుతం మహిళల విభాగంలో ఇతర రెజ్లర్లతో పోల్చుకుంటే వినేశ్ చాలా ముందుంది. ఇదే ప్రదర్శన కొనసాగిస్తే.. టోక్యోలో వినేశ్ నుంచి పతకం ఆశించొచ్చు.



## ఎవరూ మతం మారమనలేదు


దానిశ్ కనేరియా

**ఇస్లామాబాద్:** హిందువు అన్న కారణంగా కొంత మంది తనను లక్ష్యంగా చేసుకున్నా..ఏనాడు మతం మారమని ఒత్తిడి తీసుకురాలేదని పాకిస్థాన్ మాజీ క్రికెటర్ దానిశ్ కనేరియా అన్నాడు. హిందూ మతస్థుడన్న కారణంతో కొంత మంది సహచర క్రికెటర్లు కనేరియాపై వివక్ష చూపించేవారని మాజీ క్రికెటర్ షోయబ్ అక్తర్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక మీడియాతో మాట్లాడిన కనేరియా పలు విషయాలపై వివరణ ఇచ్చాడు. 'పాకిస్థాన్‌కు ఆడుతున్న సమయంలో కొంత మంది ఆటగాళ్లు సఖ్యతతో ఉండే వారు కాదు. వారిని నేను అంతగా పట్టించుకునే వాన్ని కాను. కేవలం క్రికెట్‌పైనే దృష్టి పెడుతూ పాక్‌కు విజయాలు అందించేందుకు కష్టపడ్డాను. ఒక హిందువుగా, పాకిస్థానీగా నేను గర్వపడుతున్నాను. మతంతో సంబంధం లేకుండా చాలా మంది నాకు మద్దతుగా నిలిచారు. క్రికెట్‌లో అడుగుపెట్టినప్పుడే అనుకున్నాను పాక్‌కు ప్రాతినిధ్యం వహించాలని. మాజీ కెప్టెన్ ఇంజామాముల్ హక్ నన్ను మ్యాచ్ విన్నర్ అంటూ పొగిడేవాడు. కొంత మంది నన్ను లక్ష్యంగా చేసుకున్నారు.. వాళ్ల పేర్లను త్వరలో యూట్యూబ్ చానల్ ద్వారా చెబుతాను. పాకిస్థాన్ నా జన్మభూమి ఈ విషయాన్ని రాజకీయం చెయవద్దంటూ కోరుకుంటున్నాను' అని కనేరియా అన్నాడు. మరోవైపు మాజీ కెప్టెన్ జావెద్ మియాందాద్ మాట్లాడుతూ మతం గురించి వివక్ష లేదు కాబట్టే హిందువైన కనేరియా పాక్‌కు పదేండ్ల పాటు ఆడాడని అన్నాడు.

## శ్రీకాంత్, అంజుమ్‌కు లైఫ్‌టైమ్ అవార్డులు





**న్యూఢిల్లీ:** క్రికెట్‌కు చేసిన సేవలకు గుర్తింపుగా భారత మాజీ కెప్టెన్లు క్రిష్ణమాచారి శ్రీకాంత్, అంజుమ్ చోప్రాకు తగిన గుర్తింపు లభించింది. ప్రతిష్ఠాత్మక కర్నల్ సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు శ్రీకాంత్, అంజుమ్‌ను ఎంపిక చేస్తూ బీసీసీఐ శుక్రవారం నిర్ణయం తీసుకుంది. జనవరి 12వ తేదీన ముంబైలో జరిగే వార్షిక అవార్డుల కార్యక్రమంలో వీరిద్దరిని బీసీసీఐ ఘనంగా సన్మానించనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. 1981-92 మధ్య భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన 60 ఏండ్ల చిక్కా..డాషింగ్ బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు పొందాడు. 1983 ప్రపంచకప్ ఫైనల్లో వెస్టిండీస్ అరివీర భయంకర బౌలర్లు మాల్కమ్ మార్షల్, జోయల్ గార్నర్, అండీ రాబర్ట్స్, మైఖేల్ హోల్డింగ్‌ను ఎదుర్కొంటూ టాప్‌స్కోరర్(38)గా నిలిచాడు. మరోవైపు భారత్‌కు 12 టెస్టులు, 127 వన్డేలు, 18 టీ20లు ఆడిన అంజుమ్ బ్యాటింగ్‌లో మెరుగైన రికార్డులు నెలకొల్పింది.

## ట్రావిస్ హెడ్ సెంచరీ

ఆస్ట్రేలియా 467 ఆలౌట్.. న్యూజిలాండ్ 44/2


హెడ్ (114)


నికోల్స్

**మెల్‌బోర్న్:** సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఆస్ట్రేలియా భారీ స్కోరు చేయడంతో పాటు ప్రత్యర్థి టాపార్డర్ వికెట్లు పడగొట్టి ఆధిక్యంలో నిలిచింది. ట్రావిస్ హెడ్ (114; 12 ఫోర్లు) సూపర్ సెంచరీకి కెప్టెన్ టిమ్ పైన్ (79; 9 ఫోర్లు) అర్ధశతకంతో తోడవడంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 467 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ శుక్రవారం ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు కోల్పోయి 44 పరుగులు చేసింది. చేతిలో 8 వికెట్లు ఉన్న కివీస్.. ఇంకా 423 పరుగులు వెనుకబడి ఉంది.

### సూపర్ క్యాచ్‌కు స్మిత్ ఔట్

అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 257/4తో రెండో రోజు ఆట కొనసాగించిన కంగారూలు.. కివీస్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. మాజీ కెప్టెన్ స్టీవ్‌స్మిత్ (85; 8 ఫోర్లు, 1 సిక్స్) క్రితం రోజు స్కోరుకు ఎనిమిది పరుగులు జోడించి వెనుదిరిగాడు. వాగ్నర్ వేసిన బౌన్సర్‌ను అడ్డుకునే క్రమంలో స్మిత్ తడబడగా.. బ్యాట్ అంచును ముద్దాడిన బంతి గల్లీ వైపు దూసుకెళ్లింది. అక్కడ ఫీల్డింగ్ చేస్తున్న నికోల్స్ వెనక్కి పరిగెడుతూ.. ఒంటిచేత్తో అద్భుత క్యాచ్ అందుకొని స్మిత్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. ఆ తర్వాత హెడ్, పైన్ ఆరో వికెట్‌కు 150 పరుగులు జోడించారు.

## ఇంగ్లండ్ 181 ఆలౌట్

**సెంచూరియన్:** ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న బాక్సింగ్ డే టెస్టు అనేక మలుపులు తిరుగుతున్నది. బ్యాట్స్‌మెన్ పెద్దగా ఆకట్టుకోలేకపోవడంతో సఫారీ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో ఓ మోస్తరు స్కోరుకే పరిమితం కాగా.. మంచి ఊపుమీదున్న ఇంగ్లండ్ అంతకంటే తక్కువ స్కోరుకు ఆలౌటైంది. ఈ సిరీస్ అనంతరం అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించనున్న ఫిలాండర్ (4/16), రబడ (3/68) ధాటికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 181 పరుగులకు ఆలౌటైంది. డెన్లీ (50) ఒక్కడే హాఫ్ సెంచరీ చేయగా.. బర్న్స్ (9), సిబ్లే (4), బెయిర్‌స్టో (1), బట్లర్ (12), కరన్ (20), విఫలమయ్యారు. స్టోక్స్ (35), రూట్ (29) ఫర్వాలేదనిపించారు. అనంతరం శుక్రవారం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా 72 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. చేతిలో మరో 6 వికెట్లు ఉన్న సఫారీలు 175 పరుగుల ఆధిక్యంలో ఉన్నారు. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 277/9తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా మరో 7 పరుగులు జోడించి 284 వద్ద ఆలౌటైంది. బ్రాడ్ (4/58), కరన్ (4/58) సమానమైన పరుగులిచ్చి.. చెరో నాలుగు వికెట్లు పడగొట్టడం విశేషం.

## తన్మయ్ అగర్వాల్ సెంచరీ

హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్ 298 ఆలౌట్.. ఢిల్లీ లక్ష్యం 84, ప్రస్తుతం 24/0


తన్మయ్ (103)

**న్యూఢిల్లీ:** తొలి ఇన్నింగ్స్‌లో తక్కువ స్కోరుకే పరిమితమైన హైదరాబాద్ బ్యాట్స్‌మెన్ రెండో ఇన్నింగ్స్‌లో కాస్త పోరాట పటిమ కనబర్చడంతో ఢిల్లీతో జరుగుతున్న రంజీ మ్యాచ్ నాలుగో రోజుకు వెళ్లింది. కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ (154 బంతుల్లో 103; 13 ఫోర్లు, 1 సిక్స్) చక్కటి శతకానికి మెహదీ హసన్ (62 బంతుల్లో 71; 7 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపులు తోడవడంతో ఫాలోఆన్ ఆడుతున్న హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 298 పరుగులు చేసింది. తనయ్ త్యాగరాజన్ (34), సుమంత్ (32) ఫర్వాలేదనిపించారు. ఢిల్లీ బౌలర్లలో ఇషాంత్ శర్మ 4, సిమర్‌జీత్ సింగ్ 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం 84 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఢిల్లీ శుక్రవారం ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 24 పరుగులు చేసింది. చేతిలో 10 వికెట్లు ఉన్న ధవన్ సేన విజయానికి ఇంకా 60 పరుగుల దూరంలో ఉంది. ఓవరనైట్ స్కోరు 20/2తో మూడోరోజు ఆట కొనసాగించిన హైదరాబాద్‌ను కెప్టెన్ తన్మయ్ ఆదుకున్నాడు. ఒకవైపు వరుసగా వికెట్లు పడుతున్నా.. ఓపికగా క్రీజులో నిలిచి ఢిల్లీకి ఇన్నింగ్స్ విజయాన్ని దూరం చేశాడు.

### రైల్వేస్ చేతిలో ముంబై ఓటమి

దేశవాళీల్లో తిరుగులేని జట్టుగా గుర్తింపు పొందిన ముంబైకి.. రైల్వేస్ జట్టు షాకిచ్చింది. స్టార్ బ్యాట్స్‌మెన్ పృథ్వీ షా (23), అజింక్యా రహానే (8), సిద్ధేశ్ లాడ్ (8), ఆదిత్య తారే (14) విఫలమవడంతో ముంబై రెండో ఇన్నింగ్స్‌లో 198 పరుగులకు పరిమితమైంది. కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ (65) అర్ధశతకంతో రాణించాడు. రైల్వేస్ బౌలర్లలో హిమాన్షు సాంగ్వాన్ 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 47 పరుగుల లక్ష్యాన్ని రైల్వేస్ 11.4 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా ఛేదించి 10 వికెట్ల తేడాతో గెలుపొందింది. అంతకుముందు ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 114 పరుగులు చేయగా.. రైల్వేస్ 266 రన్స్ చేసింది. బెంగాల్‌తో జరుగుతున్న మరో మ్యాచ్‌లో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 110/7తో నిలిచింది.

## 'సూపర్ సిరీస్' ఆలోచన బాగుంది

4 దేశాల టోర్నీపై సీఏ చీఫ్ వ్యాఖ్య

**మెల్‌బోర్న్:** బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ప్రతిపాదించిన నాలుగు దేశాల 'వన్డే సూపర్ సిరీస్' ఆలోచన సృజనాత్మకంగా ఉందని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ కెవిన్ రాబర్ట్స్ పేర్కొన్నాడు. భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియాతో పాటు మరో జట్టుతో కలిపి 2021 నుంచి ప్రతి ఏటా నాలుగు దేశాల టోర్నీ నిర్వహించే దిశగా దాదా ప్రయత్నాలు మొదలు పెట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ అంశాన్ని ఇంగ్లండ్ వెల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ధ్రువీకరించగా.. తాజాగా సీఏ కూడా సానుకూలంగానే స్పందించింది. 'గంగూలీ ఆలోచన సృజనాత్మకంగా ఉంది. బీసీసీఐ పీఠం అధిరోహించిన కొద్ది రోజుల్లోనే అతడు టీమ్‌ఇండియాను డే అండ్ నైట్ టెస్టు బరిలో దింపాడు. అది చక్కటి ఫలితాన్నిచ్చింది. ఇప్పుడు సూపర్ సిరీస్ ఆలోచనతో ముందుకు వచ్చాడు. క్రికెట్ అభివృద్ధిలో భాగమయ్యేందుకు దీని గురించి ఆలోచిస్తున్నాం' అని రాబర్ట్స్ తెలిపాడు.

## నిషేధాన్ని సవాలు చేసిన రష్యా




**మాస్కో:** అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనకుండా ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) విధించిన నాలుగేండ్ల నిషేధంపై న్యాయ పోరాటం చేసేందుకు రష్యా యాంటీ డోపింగ్ ఏజెన్సీ (రుసాడా) సిద్ధమైంది. శాంపిల్స్ సేకరణ విషయంలో అవకతవకలకు పాల్పడ్డ కారణంగా ఇటీవల 'వాడా'.. రష్యా అథ్లెట్లపై నాలుగేండ్ల నిషేధం విధించిన విషయం తెలిసిందే. దీనివల్ల రష్యా.. వచ్చే ఏడాది జరుగనున్న టోక్యో ఒలింపిక్స్‌తో పాటు ఫిఫా (2022) ప్రపంచకప్‌లో పాల్గొనే అర్హత కోల్పోయింది. ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం న్యాయపోరాటం చేయాలని నిర్ణయించుకున్నట్లు రూసాడా డైరెక్టర్ యూరీ గనస్ శుక్రవారం స్పష్టం చేశారు. 'ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాలను వాడాకు సమర్పించాం. ఆంక్షలను విభేదిస్తున్నామని అందులో పేర్కొన్నాం' అని అన్నారు. కోర్ట్ ఆఫ్ అర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్ (సీఏఎస్)లో దీనిపై సవాలు చేసే ఆలోచనలో ఉన్నట్లు ఆయన తెలిపారు.

## జంషెడ్‌పూర్‌పై ఒడిశా విజయం

**భువనేశ్వర్:** అరిడానే శాంటానా డబుల్ గోల్స్ (28వ, 45వ నిమిషాల్లో)తో మెరువడంతో ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో ఒడిశా ఎఫ్‌సీ మూడో విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఒడిశా 2-1తో జంషెడ్‌పూర్ ఎఫ్‌సీపై గెలుపొందింది. జంషెడ్‌పూర్ తరపున ఐటర్ మొన్‌రాయ్ (38వ ని.లో) ఏకైక గోల్ చేశాడు. సొంతగడ్డపై ఆడుతున్న ఒడిశా మ్యాచ్ ఆరంభంలోనే అదరగొట్టింది. తొలి అర్ధభాగంలో శాంటానా రెచ్చిపోవడంతో రెండు గోల్స్ చేసిన ఒడిశా.. ప్రత్యర్థికి ఒక గోల్ ఇచ్చుకుంది. అయితే ఆ తర్వాత పట్టు నిలుపుకున్న ఒడిశా.. జంషెడ్‌పూర్‌కు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. ద్వితీయార్ధంలో స్కోరు సమం చేసేందుకు జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ ఎంత ప్రయత్నించినా అది సాధ్యపడలేదు.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 41,575 | 12,246 |
| ↗ 411 | ↗ 119 |

ముడి చమురు (బ్రెంట్) ↗ 68.10 డాలర్లు

## ఎయిర్‌టెల్ రూ.558 ప్లాన్‌లో కోత

**న్యూఢిల్లీ, డిసెంబర్ 27:** ప్రముఖ టెలికం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ వినియోగదారులకు షాకిచ్చింది. రూ.558 ప్రీపెయిడ్ రీచార్జి ప్లాన్ కాలపరిమితిని 26 రోజులు తగ్గించింది. ఈ ప్లాన్ కింద అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, 3జీబీ డాటా రోజుకు, 100 ఎస్‌ఎంఎస్‌లు అందిస్తున్నది. గతంలో ఈ ప్లాన్ కాలపరిమితి 86 రోజులు ఉండగా, ప్రస్తుతం సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో ఈ కాలపరిమితి 56 రోజులకు తగ్గనున్నది. ఇటీవల నూతన ప్లాన్లను ప్రవేశపెట్టిన సంస్థ.. మరోదఫా వీటిలో మార్పులు చేసింది.


# 1.13 లక్షల కోట్ల మోసాలు

### బ్యాంకుల్లో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు నమోదు

### చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్న ఫ్రాడ్ ● రిజర్వు బ్యాంక్ వెల్లడి

**ముంబై, డిసెంబర్ 27:**

కేంద్ర ప్రభుత్వం, రిజర్వుబ్యాంక్ ఎన్ని కఠిన చర్యలు తీసుకున్నప్పటికీ బ్యాంకుల్లో మోసాలు నానాటికీ పెరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలోనే బ్యాంకుల్లో రూ.1.13 లక్షల కోట్ల మేర మోసాలు జరిగాయి. ఆరునెలల్లో ఇంతటి స్థాయిలో మోసాలు జరుగడం ఇదే తొలిసారి. రిజర్వు బ్యాంక్ తాజాగా శుక్రవారం విడుదల చేసిన నివేదికలో ఈ విషయానిన వెల్లడించింది. బ్యాంకుల వద్ద రుణాలు తీసుకొన్ని ఎగ్గొట్టిన వారిని గుర్తించడంలో ఆలస్యంకావడం ఇందుకు కారణమని విశ్లేషించింది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ లోగా దేశీయ బ్యాంకింగ్ రంగంలో 4,412 మోసాలు జరుగగా, వీటి విలువ లక్ష కోట్ల రూపాయల కంటే అధికంగా నమోదైంది. గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తంలో 6,801 మోసాలు జరుగగా, వీటి విలువ రూ.71,543 కోట్లు. అటు సంఖ్యాపరంగా చూస్తే తగ్గినప్పటికీ, మోసం మాత్రం ఇంచుమించు 50 శాతానికి పైగా పెరుగడం విశేషం. 2018-19, 2019-20 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో జరిగిన మోసాలు అంతకంతకు పెరిగాయని 'ఆర్థిక స్థిరత్వం' అనే పేరుతో విడుదల చేసిన నివేదికలో రిజర్వుబ్యాంక్ వెల్లడించింది. 2001-02 నుంచి 2017-18 మధ్యకాలంలో జరి



గిన మోసాల మొత్తం..2018-19లో జరిగిన మొత్తంలో 90.6 శాతానికి సమానం. అలాగే ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో జరిగిన మోసాల్లో వాటాకు 97.3 శాతానికి సమానం. ప్రస్తుత సంవత్సరం తొలి ఆరు నెలల్లో రూ.50 కోట్ల కంటే అధికంగా జరిగిన 398 కేసుల మొత్తం రూ.1.05 లక్షల కోట్లు. అలాగే రూ.1,000 కోట్ల కంటే అధికంగా ఉన్న 21 కేసులు మొత్తం రూ.44,951 కోట్లు. వీటిలో రుణాలకు సంబంధించిన మోసాలు అత్యధికమని పేర్కొన్న నివేదిక..మొత్తం మోసాల్లో వీటి వాటా 90 శాతానికి పైమాటే. గత ఆరు నెలల్లో ఈ వాటా 97 శాతానికి పెరిగింది.

**పెరిగిన ఎన్‌బీఎఫ్‌సీల స్థూల నిరర్థక ఆస్తులు**

బ్యాంకింగేతర సంస్థల నిరర్థక ఆస్తులు అంతకంతకు పెరుగుతున్నాయి. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో ఎన్‌బీఎఫ్‌సీల స్థూల నిరర్థక ఆస్తుల విలువ 6.1 శాతం నుంచి 6.3 శాతానికి చేరుకున్నది. అలాగే నికర ఎన్‌పీఏ రేషియో నిలకడగా 3.4 శాతం వద్ద స్థిరంగా ఉన్నది. ఎన్‌బీఎఫ్‌సీ రంగానికి చెందిన క్యాపిటల్ టూ రిస్క్ అసెట్స్ రేషియో(సీఆర్‌ఏఆర్) మాత్రం 20 శాతం నుంచి 19.5 శాతానికి పడిపోయింది. ఐఎల్అండ్‌ఎఫ్‌ఎస్ అవకతవకల నేపథ్యంలో రిజర్వుబ్యాంక్ మార్గదర్శకాలను మరింత కఠినతరం చేసింది. కనీస మొత్తంలో నగదు నిల్వలు ఉంచుకోవాలని ఎన్‌బీఎఫ్‌సీలను నేరుగా ఆదేశించింది. ప్రస్తుతం ఎన్‌బీఎఫ్‌సీలు రూ.8,29,468 కోట్ల మేర రుణాలు ఇచ్చాయి.

**అతిపెద్ద కో-ఆపరేటివ్ బ్యాంకులకు ఊరట**

అతిపెద్ద సహకార బ్యాంకులకు రిజర్వు బ్యాంక్ ఊరటను కల్పించింది. రూ.5 కోట్ల కంటే అధికంగా రుణాలు నేరుగా ఇవ్వడానికి అతిపెద్ద కో-ఆపరేటివ్ బ్యాంకులను సెంట్రల్ బ్యాంక్ అనుమతినిచ్చింది. ఆయా బ్యాంకుల ఆర్థిక పరిస్థితుల కారణంగా గతంలో నియంత్రణ విధించిన ఆర్బీఐ..ప్రస్తుతం వీటిపై నియంత్రణ ఎత్తివేసింది. రూ.500 కోట్ల కంటే అధిక ఆస్తులు కలిగిన అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకులకు మాత్రమే ఈ అవకాశాన్ని కల్పించింది.

**రియల్ ఎస్టేట్ సంస్థలతో ఆర్థిక ఇక్కట్లు..**

రియల్ ఎస్టేట్ సంస్థలతో ప్రధాన బ్యాంకులు తీవ్ర ఆర్థిక ఇక్కట్లను ఎదుర్కొంటున్నాయి. జూన్ 2018 నాటికి 5.74 శాతంగా ఉన్న బ్యాంకుల నష్టాల వాటా ఈ ఏడాది జూన్ నాటికి ఇది 7.33 శాతానికి ఎగబాకాయి. వీటిలో ప్రభుత్వరంగ బ్యాంకుల వాటా 15 శాతం నుంచి 18.71 శాతానికి చేరుకున్నది.

## జీడీపీ మందగించినా.. స్థిరంగానే ఆర్థిక వ్యవస్థ

ఆర్థికాభివృద్ధి దారుణంగా మందగించినప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగానే ఉన్నదని రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) శుక్రవారం వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర (2019-20) ద్వితీయ త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు 4.5 శాతానికి పతనమై ఆరేండ్ల కనిష్ఠ స్థాయికి దిగజారడంతో ఆర్బీఐ ఈ నెలలో నిర్వహించిన ద్రవ్య విధాన సమీక్షలో వృద్ధిరేటును 240 బేసిస్ పాయింట్లు తగ్గించి 5 శాతంగా నమోదవుతుందని అంచనావేసిన విషయం తెలిసిందే. అయితే దేశీయ వృద్ధిరేటు బలహీనపడినప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ స్థిరంగానే కొనసాగుతున్నదని తాజాగా విడుదల చేసిన 'ఆర్థిక స్థిరత్వ' నివేదికలో రిజర్వు బ్యాంకు పేర్కొన్నది. అంతర్జాతీయ సమస్యలతోపాటు స్థూల ఆర్థిక పరిస్థితులు, ఫైనాన్షియల్ మార్కెట్లకు సంబంధించిన సమస్యలపై ప్రస్తుతం నెలకొన్న అభిప్రాయాలు దేశ ఆర్థిక వ్యవస్థపై ఓ మోస్తరుగా దుష్ప్రభావం చూపుతున్నాయని ఆర్బీఐ తెలిపింది.

# రుణవృద్ధిపై కటిక చీకట్లు

- ఆరు దశాబ్దాల కనిష్ఠస్థాయికి దిగజారే అవకాశం
- ఈ ఏడాది 7 శాతంలోపే ఉంటుందని 'ఇక్రా' అంచనా
- జీడీపీ వృద్ధిరేటు దిగజారడమే ప్రధాన కారణం
- 1962లో అత్యల్పంగా 5.4 శాతం వృద్ధిరేటు నమోదు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 27:** దేశ ఆర్థికాభివృద్ధి దారుణంగా పతనమవడంతో రుణ వృద్ధి విస్తరణ (క్రెడిట్ ఎక్స్‌పాన్షన్) రేటుపై కటిక చీకట్లు అలుముకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సర (2019-20) ద్వితీయ త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు 4.5 శాతానికి పతనమై ఆరేండ్ల కనిష్ఠస్థాయికి చేరడంతో రుణవిస్తరణ (క్రెడిట్ ఎక్స్‌పాన్షన్) వృద్ధిరేటు 6.5 నుంచి 7 శాతానికి క్షీణించి ఆరు దశాబ్దాల కనిష్ఠస్థాయికి దిగజారవచ్చని ప్రముఖ రేటింగ్ సంస్థ 'ఇక్రా' తన తాజా నివేదికలో పేర్కొన్నది. గత ఆర్థిక సంవత్సరంలో దేశ రుణవిస్తరణ వృద్ధిరేటు 13.3 శాతంగా ఉన్నట్టు 'ఇక్రా' తెలిపింది. ప్రస్తుతం తమ అంచనాలు నిజమైతే ఈ ఆర్థిక సంవత్సరంలో రుణవిస్తరణ వృద్ధిరేటు 58 ఏండ్ల కనిష్ఠస్థాయికి చేరుతుందని, 1962 ఆర్థిక సంవత్సరంలో ఈ రేటు 5.4 శాతంగా నమోదయినట్టు రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) వెబ్‌సైట్‌లోని గణాంకాలు స్పష్టంచేస్తున్నాయని ఆ సంస్థ వివరించింది. ఈ ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో 5 శాతంగా నమోదైన జీడీపీ వృద్ధిరేటు రెండో త్రైమాసికం (జులై-సెప్టెంబర్)లో 4.5 శాతానికి క్షీణించి ఆరేండ్ల కనిష్ఠస్థాయికి దిగజారిన విషయం తెలిసిందే. ముమ్మందు కూడా జీడీపీ వృద్ధిరేటు గణాంకాలు ఇంతకంటే మెరుగ్గా ఉంటాయని ఎవరూ అంచనావేయడంలేదు. ఈ ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు 7.4 శాతం మేరకు నమోదుకావచ్చని భావిస్తున్నట్టు ఫిబ్రవరిలో చెప్పిన ఆర్బీఐ సైతం ఇప్పుడు తన అంచనాలను గణనీయంగా 5 శాతానికి (240 బేసిస్ పాయింట్లు) కుదించింది. ఇదేవిధంగా పలు అంతర్జాతీయ రేటింగ్ సంస్థలు కూడా భారత ఆర్థిక వృద్ధిరేటుకు సంబంధించిన అంచనాలను సవరించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వృద్ధిరేటు అంచనాలను 5.8 శాతం నుంచి 4.9 శాతానికి కుదిస్తున్నట్టు 'మూడీస్' సంస్థ ప్రకటించగా.. ఈ ఏడాది జీడీపీ వృద్ధిరేటు 4.6 శాతం మించకపోవచ్చని జపాన్ బ్రోకరేజీ సంస్థ 'నొమురా' పేర్కొన్నది. నవంబర్ నెలాఖరు వరకు రుణవిస్తరణ వృద్ధిరేటు దాదాపు 8 శాతం మేరకు ఉన్నట్టు ఆర్బీఐ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఇంక్రిమెంటల్ క్రెడిట్ గ్రోత్ స్తబ్దుగా ఉన్నందున రుణవిస్తరణ వృద్ధిరేటు మరింత తగ్గవచ్చని భావిస్తున్నామని 'ఇక్రా' వెల్లడించింది. జీడీపీ వృద్ధిరేటు మందగించడం, మూలధన పెట్టుబడుల అవసరాలు తగ్గడం, రిస్క్ తీసుకొనేందుకు రుణదాతలు విముఖంగా ఉండటం లాంటి అంశాలు ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంక్రిమెంటల్ క్రెడిట్ గ్రోత్‌ను తగ్గిస్తాయని, ఫలితంగా నాలుగు ప్రధాన రంగాలైన వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు, రిటైల్ రుణాల రంగాల్లో మూడింటి నుంచి నిధులకు డిమాండ్ స్వల్పంగా ఉంటుందని 'ఇక్రా' తన నివేదికలో అభిప్రాయపడింది. ఈ నెల 6వ తేదీ వరకు ఇంక్రిమెంటల్ క్రెడిట్ గ్రోత్ కేవలం రూ.80 వేలకోట్లు మాత్రమే పెరిగి రూ.98.1 లక్షలకోట్లకు చేరిందని, ఈ పెరుగుదల గత ఆర్థిక సంవత్సరంలో రూ.5.4 లక్షలకోట్లుగానూ, అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో రూ.1.7 లక్షలకోట్లుగానూ ఉన్నదని ఆ సంస్థ వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర ద్వితీయార్థంలో ఇంక్రిమెంటల్ క్రెడిట్ రూ.6.5 లక్షలకోట్ల నుంచి రూ.7 లక్షలకోట్ల మేరకు పెరిగినప్పటికీ ఇంక్రిమెంటల్ నెట్ బ్యాంక్ లోన్ 40 నుంచి 45 శాతం మేరకు తగ్గి రూ.6.3 లక్షలకోట్ల నుంచి రూ.6.8 లక్షలకోట్లకు తగ్గుతుందని 'ఇక్రా' పేర్కొన్నది. ఏడాది క్రితంతో పోలిస్తే ఈ సంవత్సరం సెప్టెంబర్ నెలాఖరునాటికి 37 బ్యాంకుల్లో రుణవృద్ధి 7.9 శాతంగా నమోదయిందని, వీటిలో ప్రభుత్వరంగ బ్యాంకుల రుణవృద్ధి 4.4 శాతంగానూ, ప్రైవేటు బ్యాంకుల్లో 15 శాతంగానూ ఉన్నదని వివరించింది.



## త్వరలో ఇన్‌ఫ్లైట్ డాటా సేవలు

### నెల్కోతో విస్తారా భాగస్వామ్యం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 27:** దేశీయ ప్రైవేటు విమానయాన సంస్థల్లో ఒకటైన 'విస్తారా' తమ విమానాల్లో డాటా సేవలను అందించేందుకు టాటా గ్రూపునకు చెందిన 'నెల్కో' కంపెనీతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకొన్నదని, ఈ సేవలు త్వరలోనే ప్రారంభంకానున్నాయని కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. టాటా, ఎయిర్‌లైన్స్ సంయుక్త భాగస్వామ్యంలో 'విస్తారా'ను నెలకొల్పిన విషయం తెలిసిందే. దాదాపు ఐదేండ్ల నుంచి విమానయాన సేవలు అందజేస్తున్న 'విస్తారా' ఇప్పుడు 'నెల్కో'తో చేతులు కలపడం ద్వారా భారత్‌లో ఇన్‌ఫ్లైట్ కనెక్టివిటీ సేవలను అందించనున్న తొలి దేశీయ విమానయాన సంస్థగా నిలువనున్నది. ఇందుకు అవసరమైన స్పెక్ట్రమ్‌ను కేటాయించినట్టు టెలికం శాఖ కార్యదర్శి అన్షు ప్రకాశ్ తెలిపారు. 'నెల్కోతో విస్తారా చేతులు కలిపింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నుంచి ట్రాన్స్‌పాండర్ స్పేస్‌ను తీసుకొన్న ఆ సంస్థలకు స్పెక్ట్రమ్ కేటాయింపును పూర్తిచేశాం' అని ఆయన వివరించారు.

## ఎక్కువ ఆందోళన కలిగించేది నిరుద్యోగమే

### పట్టణప్రాంత భారతీయుల్లో సగం మంది మాట ఇదే

### దేశం సరైన దిశలోనే పయనిస్తున్నదని 69 శాతం మంది అభిప్రాయం

### 'ఇప్సోస్' తాజా సర్వేలో వెల్లడి



**న్యూఢిల్లీ, డిసెంబర్ 27:** నిరుద్యోగ సమస్యపై దేశప్రజల్లో ఆందోళన రోజురోజుకూ పెరుగుతున్నది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోని భారతీయుల్లో దాదాపు సగం మంది ఈ సమస్యపై తీవ్ర ఆందోళనచెందుతున్నారని, అయితే వీరిలో 69 శాతం మంది దేశం సరైన దిశలోనే పయనిస్తున్నదని భావిస్తున్నారని తాజాగా నిర్వహించిన ఓ సర్వేలో తేలింది. భారతీయులకు ఆందోళన కలిగిస్తున్న ఇతర అంశాల్లో ఆర్థిక, రాజకీయ అవినీతి, నేరాలు, హింస, పేదరికం, సామాజిక అసమానతలు, వాతావరణ మార్పులు తదితర అంశాలున్నట్టు ఈ సర్వే వెల్లడించింది. ప్రస్తుతం ప్రపంచాన్ని కలవరపెడుతున్న అంశాలేమిటన్నదానిపై ప్రముఖ పరిశోధనా (రిసెర్చ్) సంస్థ 'ఇప్సోస్' ఈ సర్వే నిర్వహించింది. ప్రపంచ దేశాల ప్రజల్లో 61 శాతం మంది తమ దేశం సరైన దిశలోనే పయనిస్తున్నదని అభిప్రాయపడుతున్నారని, దీనితో పోలిస్తే భారత్‌లో పరిస్థితి మెరుగ్గానే ఉన్నదని, పట్టణప్రాంతాల్లోని 69 శాతం మంది భారతీయులు దేశం సరైన దిశలోనే పయనిస్తున్నట్టు భావిస్తున్నారని ఈ సర్వేలో వెల్లడయింది. 'నిరుద్యోగ సమస్య తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని పట్టణప్రాంతాల్లోని దాదాపు 46 శాతం మంది భారతీయులు మా సర్వేలో వెల్లడించారు. ఈ అభిప్రాయాన్ని వ్యక్తంచేసినవారి సంఖ్య ఇంతకుముందు (అక్టోబర్‌లో) నిర్వహించిన సర్వేతో పోలిస్తే నవంబర్‌లో నిర్వహించిన సర్వేలో 3 శాతం పెరిగింది. భారతీయులకు ఆందోళన కలిగిస్తున్న ఇతర సమస్యల్లో ఆర్థిక, రాజకీయ అవినీతి, నేరాలు, హింస, పేదరికం, సామాజిక అసమానతలు, వాతావరణమార్పులు తదితర అంశాలున్నాయి. ముఖ్యంగా పేదరికం, సామాజిక అసమానతలే ప్రపంచ దేశాల ప్రజలను ఎక్కువగా కలవరపెడుతున్నాయి. వీటి తర్వాత నిరుద్యోగం, నేరాలు, హింస, ఆర్థిక, రాజకీయ అవినీతి, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సమస్యలపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు' అని ఈ సర్వే వెల్లడించింది. ఇప్సోస్ తన ఆన్‌లైన్ ప్యానెల్ సిస్టమ్ ద్వారా ప్రపంచంలోని 28 దేశాల్లో నెలవారీగా ఈ సర్వే నిర్వహిస్తున్నది.

## మై హోమ్‌లో వాటాల కొనుగోలుకు ఓకే

### మై హోమ్ కన్‌స్ట్రక్షన్స్, అనుబంధ సంస్థలకు సీసీఐ అనుమతి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 27:** మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 50 శాతం వాటాలను మై హోమ్ కన్‌స్ట్రక్షన్స్, దాని అనుబంధ సంస్థలు కొనుగోలు చేసేందుకు సీసీఐ (కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా) శుక్రవారం ఆమోదం తెలిపింది. మై హోమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రస్తుతం 'మహా సిమెంట్' బ్రాండ్ పేరుతో గ్రే సిమెంట్ ఉత్పత్తి, సరఫరా కార్యకలాపాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. మై హోమ్ కన్‌స్ట్రక్షన్స్‌తోపాటు జూపల్లి రియల్ ఎస్టేట్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్, మై హోమ్ గ్రూప్ ప్రమోటర్ జూపల్లి రామేశ్వర్‌రావు మై హోమ్ ఇండస్ట్రీస్‌లో వాటాలను కొనుగోలు చేయనున్నట్టు సీసీఐ ఓ ప్రకటనలో వెల్లడించింది. సీఆర్‌హెచ్ ఇండియా ఇన్వెస్ట్‌మెంట్స్ బీవీ, మై హోమ్ కన్‌స్ట్రక్షన్స్, జూపల్లి రియల్ ఎస్టేట్ డెవలపర్స్, జూపల్లి రామేశ్వర్‌రావు 50:50 జాయింట్ వెంచర్‌లో ఏర్పాటుచేసిన సంస్థే మై హోమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్. ప్రస్తుతం ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బీహార్, మహారాష్ట్ర, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నట్టు సీసీఐ తెలిపింది. నిర్మాణ, రియల్ ఎస్టేట్ అభివృద్ధి, పవర్ కన్సల్టెన్సీ, మాన్యుఫ్యాక్చరింగ్, గ్రే సిమెంట్ సరఫరా, రవాణా, లాజిస్టిక్స్ తదితర కార్యకలాపాలు నిర్వహిస్తూ హైదరాబాద్ కేంద్రంగా కొనసాగుతున్న మై హోమ్ గ్రూపులో మై హోమ్ కన్‌స్ట్రక్షన్స్, జూపల్లి రియల్ ఎస్టేట్ డెవలపర్స్ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయి.

## ఓటీపీ ద్వారా నగదు విత్‌డ్రా

- జనవరి 1 నుంచి ఎస్బీఐ నూతన ఏటీఎం సేవలు
- రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకే




**న్యూఢిల్లీ, డిసెంబర్ 27:** దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) మరో కీలక నిర్ణయం తీసుకున్నది. రాత్రి వేళల్లో జరుగుతున్న ఏటీఎం మోసాలకు చెక్ పెట్టడానికి ఓటీపీ ద్వారా నగదును ఉపసంహరించుకునే అవకాశాన్ని బ్యాంక్ ఖాతాదారులకు అవకాశం కల్పించింది. రాత్రి 8 గంటల నుంచి ఆ మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు రూ.10 వేల కంటే అధికంగా నగదు ఉపసంహరణను కేవలం ఓటీపీ ద్వారాను విత్‌డ్రా చేసుకోవడానికి వీలుంటుంది. అనాధికార లావాదేవీల సంఖ్యను తగ్గించడానికి ఈ ఓటీపీ ఆధారిత లావాదేవీలకు శ్రీకారం చుట్టినట్లు ఫేస్‌బుక్‌లో బ్యాంక్ పోస్ట్‌చేసింది. ఎస్బీఐ ఖాతాదారులు అంతకుముందు రిజిస్టర్ చేసుకున్న మొబైల్ నంబర్‌కు ఓటీపీ నంబర్ వస్తున్నదని, దీనిని ఏటీఎం తెరపై ఎంటర్‌చేయడంతో లావాదేవీలు జరుపుకునే వీలుంటుంది. ఈ ఓటీపీ నంబర్ ఒకేసారి వినియోగించాల్సి ఉంటుందని, మరోసారి వినియోగించడానికి వీలులేదు. ఎస్బీఐ ఖాతాదారులు ఇతర ఏటీఎంల్లో ఇలాంటి సదపాయం కానీ, ఇతర బ్యాంక్ ఖాతాదారులు ఎస్బీఐ ఏటీఎంల్లో ఇలాంటి సేవలు పొందలేరని పేర్కొంది. జనవరి నుంచి అమలులోకిరానున్న ఈ నూతన లావాదేవీలకు ఏటీఎంలల్లో ఎలాంటి మార్పులు చేయడం లేదని స్పష్టంచేసింది.

# ఉల్లాసంగా..ఉత్సాహంగా

### భారీగా లాభపడ్డ స్టాక్ మార్కెట్లు

**ముంబై, డిసెంబర్ 27:**

స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు కోలుకున్నాయి. వరుసగా మూడు రోజులుగా భారీగా పతనమైన సూచీలు తిరిగి కోలుకున్నాయి. బ్యాంకింగ్, ఆర్థిక, ఇంధన రంగ షేర్ల నుంచి లభించిన కొనుగోళ్ల మద్దతుతోపాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన మద్దతుతో మదుపరులు లాభాల జడివానలో తడిసి ముద్దయ్యారు. గతవారం రోజులుగా అమ్మకాలకు మొగ్గుచూపిన దేశీయ, విదేశీ మదుపరులు ఏకంగా వారాంతం ట్రేడింగ్‌లో భారీగా కొనుగోలు జరిపారు. లాభాల్లో ప్రారంభమైన సూచీలు ఏ దశలోనూ వెనక్కితిరిగి చూసుకోలేదు. చివరి గంటలోనైతే భారీగా కొనుగోళ్లు జరిపారు. ఇంట్రాడేలో 500 పాయింట్ల స్థాయిలో లాభపడ్డ సూచీ చివరకు 411.38



పాయింట్లు లేదా 1 శాతం లాభపడి 41,575.14 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ మరో 119.25 పాయింట్లు అందుకొని 12,245.80 వద్ద స్థిరపడింది. క్రిస్మస్ సందర్భంగా బుధవారం సెలవుకావడంతో నాలుగు రోజులకు పరిమితమైన స్టాక్ మార్కెట్లు ఈ వారం మొత్తానికి సెన్సెక్స్ 106 పాయింట్లు, నిఫ్టీ 26 పాయింట్లు చొప్పున పడిపోయాయి.

**బ్యాంకింగ్ షేర్ల జోరు**

బ్యాంకింగ్ రంగ షేర్లను కొనుగోలు చేయడానికి మదుపరులు ఎగబడ్డారు. ప్రభుత్వరంగ బ్యాంకుల ఆర్థిక స్థితిగతులు, నిరర్థక ఆస్తులపై శనివారం ఆయా బ్యాంకుల అధిపతులతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భేటీ కావడంతో ఈ రంగ షేర్లు దూసుకుపోయాయి. వీటిలో యాక్సిస్ బ్యాంక్ అత్యధికంగా 3.3 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. వీటితోపాటు ఎస్బీఐ 2.24 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.93 శాతం, ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి. అలహాబాద్ బ్యాంక్ షేరు ఏకంగా 8.5 శాతం లాభపడింది. బ్యాంక్‌కు తాజాగా రూ.2 వేల కోట్లకు పైగా నిధులను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఒక దశలో 11 శాతం వరకు లాభపడ్డ షేరు విలువ చివరకు 8.17 శాతం లాభంతో రూ.19.20 వద్ద ముగిసింది. అలాగే ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ షేరు కూడా 6.5 శాతం అధికమై రూ.11.99 వద్ద స్థిరపడింది. మరోవైపు పవర్‌గ్రిడ్ 2.33 శాతం అధికమవగా, భారతీ ఎయిర్‌టెల్ 1.82 శాతం, రిలయన్స్ 1.73 శాతం, ఎల్ అండ్ టీ 1.59 శాతం, బజాజ్ ఫిన్ 1.52 శాతం, మారుతి 1.51 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 1.27 శాతం, టెక్ మహీంద్రా 1.26 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 1.25 శాతం, ఇన్ఫోసిస్ 1.04 శాతం చొప్పున అధికమయ్యాయి. అలాగే సన్‌ఫార్మా, టాటా స్టీల్, బజాజ్ ఆటో, నెస్లె ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా, ఓఎన్‌జీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హిందుస్థాన్ యునిలీవర్, ఎన్‌టీపీసీ, ఏషియన్ పెయింట్స్, హీరో, ఐటీసీలు అధికమయ్యాయి. కానీ టైటాన్, టీసీఎస్, కొటక్ బ్యాంక్‌లు మాత్రం మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి. బలహీనంగా కొనసాగుతున్న ప్రభుత్వరంగ బ్యాంకులను ఆర్థికంగా ఆదుకునే అవకాశాలు ఉండటం, వచ్చేవారంలో బాండ్ల విక్రయాలపై రిజర్వు బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకోనుండటం, గ్లోబల్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల వార్తలు ఈక్విటీల్లో జోష్ పెంచిందని జియోజిట్ ఫైనాన్షియల్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. రంగాల వారీగా చూస్తే ఇంధనం, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్, బ్యాంకెక్స్, ఫైనాన్స్, వాహన రంగ షేర్లు రెండు శాతం వరకు అధికమవగా, కానీ కన్జ్యూమర్ డ్యూరబుల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి.

సెన్సెక్స్ **411** నిఫ్టీ **119** పాయింట్ల లాభం

**కొనసాగుతున్న రూపాయి పతనం**

స్టాక్ మార్కెట్లు ఒకవైపు భారీగా దూసుకుపోతుంటే మరోవైపు దేశీయ కరెన్సీకి మాత్రం పతనాన్ని నమోదు చేసుకుంటున్నది. వరుసగా ఆరోరోజు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ నాలుగు పైసలు క్షీణించి 71.35 వద్దకు చేరుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు మూడు నెలల గరిష్ఠ స్థాయికి చేరుకోవడం రూపాయి పతనాన్ని శాసించింది. 71.26 వద్ద ప్రారంభమైన డాలర్-రుపీ ఎక్స్ఛేంజ్ రేటు ఒక దశలో 71.19 గరిష్ఠ స్థాయికి చేరుకున్నది. బ్యాంకర్లు, ఎగుమతిదారులు విక్రయాలకు మొగ్గుచూపడంతో ఇంట్రాడేలో 71.40 స్థాయికి పడిపోయిన రేటు చివరకు 71.35 వద్ద ముగిసింది. డిసెంబర్ 4 తర్వాత కరెన్సీకి ఇదే కనిష్ఠ స్థాయి. మొత్తంమీద ఈవారంలో కరెన్సీ 19 పైసలు కోల్పోయింది.



## ఫారెక్స్ రిజర్వుల జోరు..

విదేశీ మారకం నిల్వలు మరో చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. డిసెంబర్ 20తో ముగిసిన వారంలో ఫారెక్స్ రిజర్వులు మరో 456 మిలియన్ డాలర్లు పెరిగి ఆల్‌టైం హై 454.948 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ విషయాన్ని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ రిజర్వులు 1.070 బిలియన్ డాలర్లు అధికమై 454.492 బిలియన్ డాలర్లకు చేరుకున్న విషయం తెలిసిందే. విదేశీ మారకం రూపంలో ఉన్న ఆస్తుల విలువ అంతకంతకు పెరుగడం ఇందుకు దోహదం చేస్తున్నదని తెలిపింది. గతవారంలో ఆస్తుల విలువ 311 మిలియన్ డాలర్లు ఎగబాకి 422.732 బిలియన్ డాలర్లకు చేరాయి. రూపాయితో పోలిస్తే డాలర్, యూరో, పౌండ్ కరెన్సీలు అత్యధికంగా లాభం పరోక్షంగా ఆస్తులు పెరుగుడానికి దోహదం చేశాయి. అలాగే గతవారంలో పసిడి రిజర్వులు 27.132 బిలియన్ డాలర్లకు ఎగబాకాయి. అంతక్రితం వారంతో పోలిస్తే 164 మిలియన్ డాలర్లు అధికమయ్యాయి.

## ఎల్‌ఐసీ రూ.2,611 కోట్ల డివిడెండ్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 27:** ప్రభుత్వరంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ)..2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వానికి రూ.2,610.74 కోట్ల డివిడెండ్ రూపంలో చెల్లించింది. గతేడాది ఎల్‌ఐసీ రూ. 53,214.41 కోట్ల సంపదను సృష్టించగా, అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 9.9 శాతం అధికం. పాలసీల విక్రయాల్లో 76.28 శాతం వాటాతో తొలిస్థానంలో దూసుకుపోతున్నదని, అలాగే 30 నవంబర్ 2019 నాటికి తొలి ఏడాది ప్రీమియం వసూళ్లలో 71 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నదని ఆర్థిక మంత్రిత్వ శాఖ ట్విట్టర్ ద్వారా వెల్లడించింది. కంపెనీ చరిత్రలో ఒక ఏడాది రూ.50 వేల కోట్లకు పైగా ఆదాయాన్ని సృష్టించడం ఇదే తొలిసారని పేర్కొంది. రూ. 2,610 కోట్ల విలువైన చెక్కును కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్‌ఐసీ చైర్మన్ ఎంఆర్ కుమార్ శుక్రవారం అందచేశారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక కార్యదర్శి రాజీవ్ కుమార్, ప్రత్యేక కార్యదర్శి దేబాశిస్ పాండా తదితరులు హాజరయ్యారు. బీమా రంగంలోకి అడుగుపెట్టి 63 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఎల్‌ఐసీ వద్ద ప్రస్తుతం రూ.31.11 లక్షల కోట్ల నికర ఆస్తులు ఉన్నాయి. వార్షిక ఆదాయం రూ.5.61 లక్షల కోట్లు ఆర్జిస్తున్న సంస్థకు గతేడాది తొలి ఏడాది ప్రీమియం ద్వారా రూ.1,42,191.69 కోట్లు లభించాయి. అలాగే 2.59 కోట్ల పాలసీలను క్లెయిం రూపంలో రూ.1.63 లక్షల కోట్ల చెల్లింపులు జరిపింది.



## లాట్ నూతన సంవత్సర ఆఫర్లు

**హైదరాబాద్, డిసెంబర్ 27:** మొబైల్ విక్రయాల్లో అగ్రగామి సంస్థల్లో ఒకటైన లాట్ మొబైల్స్..నూతన సంవత్సరం ఆఫర్లను ప్రకటించింది. 2020 ఏడాదికిగాను ప్రకటించిన ఈ ఆఫర్లలో మొబైల్ ఎక్స్ఛేంజ్‌పై 60 శాతం వరకు డిస్కౌంట్, అదనంగా రూ.5 వేల వరకు బోనస్, 30 శాతం వరకు పేటీఎం క్యాష్‌బ్యాక్, 10 శాతం వరకు హెచ్‌డీఎఫ్‌సీ క్యాష్ బ్యాక్ పొందవచ్చునని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. వీటితోపాటు వన్‌ప్లస్ 7టీ మొబైల్‌ను కొనుగోలు చేసిన వారికి రూ.3 వేల ఆదా, ఐఫోన్ 11, ఐఫోన్ 11 ప్రో మొబైళ్లపై రూ.6 వేల రాయితీ, వివో వీ17(8జీబీ+128జీబీ)పై 5 శాతం క్యాష్‌బ్యాక్, ఒప్పో ఏ9 2020 మొబైల్‌పై రూ.1,500 వరకు డిస్కౌంట్, వివో వై17+32 అంగుళాల ఎల్ఈడీ టీవీ కాంబోను కేవలం రూ.14,990కి, ఒప్పో ఏ5ఎస్+32 అంగుళాల ఎల్ఈడీ టీవీలను రూ.17,490కి అందిస్తున్నట్లు ప్రకటించింది. అలాగే రిటైల్ అవుట్‌లెట్లలో రెడ్మీ, టీసీఎల్ టీవీలను కూడా అందుబాటులో ఉంచింది సంస్థ. స్మార్ట్ టీవీ ప్రారంభ ధర రూ.12,499గా ఉండటంతో వీటి విక్రయాలు జోరందుకునే అవకాశాలున్నాయని పేర్కొంది.

# వచ్చేది 2020.. జర జాగ్రత్త!

**తేదీ ఫార్మాట్ పూర్తిగా రాయకపోతే ఇబ్బందులే**



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** డాక్యుమెంట్లు, బ్యాంక్‌చెక్కులు, ఉత్తర ప్రత్యుత్తరాలు తదితర విలువైన కాగితాలు, ఒప్పంద పత్రాలపై తేదీ ఫార్మాట్ సంపూర్ణంగా, సమగ్రంగా రాయకపోతే కష్టాలు తప్పవు. తేదీ, నెలతోపాటు సంవత్సరాన్ని సూచించే అంకెలను పూర్తిగా రాయకుంటే కోరి కష్టాలు కొని తెచ్చుకున్నట్టే. తేదీ ఫార్మాట్‌లో సాధారణంగా తేదీ.. నెల.. సంవత్సరం రాయడం ఆనవాయితీ. చాలామందికి సంవతర్సంలోని చివరి రెండు అంకెలను మాత్రమే రాయడం అలవాటు. ఉదాహరణకు 15వ తేదీ, 12వ నెల, 2019 సంవత్సరాన్ని 15.12.2019 అని రాయడానికి బదులుగా 15.12.19 అని రాస్తుంటారు. ఇదే అలవాటును 2020లో కూడా కొనసాగిస్తే.. ఊహించని ప్రమాదాలు ఎదురుకావచ్చు. సంవత్సరాన్ని తెలిపేచోట పూర్తిగా రాయకుండా 20 అని పొడిగా రాసి ఊరుకుంటే.. మీతో ఒప్పందం చేసుకున్నవారికి ఎప్పుడైనా దుర్బుద్ధి కలిగితే, దానిపక్కన మరో రెండు అంకెలు చేర్చే ప్రమాదం ఉంటుంది. 2000 నుంచి 2099 వరకు తమకు అనుకూలమైన అంకెలు వేసుకుని మిమ్మల్ని ఇబ్బంది పెట్టే వీలుంటుంది. అలాంటి చాన్స్ ఇవ్వకుండా ఉండాలంటే ఎవరైనా, ఏ పత్రంమీదైనాసరే సంవత్సరం పేరును 2020గా సంపూర్ణంగా రాయాలని నిపుణులు సూచిస్తున్నారు.

# మొక్కలునాటిన సుడిగాలి సుధీర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రీన్‌చాలెంజ్‌లో భాగంగా నటుడు, జబర్దస్త్ ఫేమ్ సుడిగాలి సుధీర్ శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మూడు మొక్కలు నాటారు. ఎంపీ సంతోష్‌కుమార్ నేతృత్వంలో చేపట్టిన గ్రీన్‌చాలెంజ్ కార్యక్రమం వల్ల పచ్చదనం పెరిగి పర్యావరణానికి మేలు జరుగుతుందని సుధీర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇగ్నైటింగ్ మైండ్స్ సంస్థ ప్రతినిధి, వైల్డ్ లైఫ్ బోర్డు మెంబర్ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లోని తన నివాసంలో మొక్కనాటి నీళ్లుపోస్తున్న సుడిగాలి సుధీర్





వరుసగా మూడోసారి ఆప్టిమీడియా సర్వే అవార్డుకు ఎంపికైన హైదరాబాద్‌లోని బెస్ట్ డెంటల్ క్లినిక్‌కు పురస్కార పత్రం అందజేస్తున్న వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్.

-హైదరాబాద్, నమస్తే తెలంగాణ

# ఆధునిక సాంకేతికతతో జీవవైవిధ్య రక్షణ

**సకశేరుకాల యాజమాన్యంపై సదస్సులో పీసీసీఎఫ్ ఆర్ శోభ**



శుక్రవారం రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆల్ ఇండియా నెట్‌వర్క్ ప్రాజెక్ట్ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న పీసీసీఎఫ్ ఆర్ శోభ, ఉపకులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావు తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆధునిక సాంకేతికత సాయంతో జీవవైవిధ్యాన్ని కాపాడాలని, వ్యవసాయంలో విస్తరణ సేవలను చేపట్టాలని తెలంగాణ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆర్ శోభ అన్నారు. అధిక మోతాదులో పురుగుమందులు, రసాయనాలు వాడకుండానే వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకతలు సాధించవచ్చని చెప్పారు. వన్యమృగాల సంరక్షణకు సంబంధించి కఠినమైన చట్టాలే ఉన్నప్పటికీ పూర్తిస్థాయి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. 'సకశేరుకాల (వెన్నెముక ఉన్న జంతువులు) యాజమాన్యం' అంశంపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి సంయుక్తంగా రాజేంద్రనగర్ వర్సిటీ ఆడిటోరియంలో రెండురోజుల ఆల్ ఇండియా నెట్‌వర్క్ ప్రాజెక్ట్, మూడోగ్రూప్ సదస్సు ప్రారంభ సమావేశాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్లు, ప్రాజెక్టుల వంటి మౌలిక వసతుల కల్పనతో సకశేరుకాల సహజ ఆవాసాలు కుంచించుకుపోతున్నాయని, దీంతో జనావాసాల్లోకి వచ్చి పంట నష్టానికి కారణమవుతున్నాయని చెప్పారు. జంతువుల్ని రక్షించుకుంటూనే.. పంటల్ని కాపాడుకోవాలని తెలిపారు. ఒకప్పుడు దేశంలో సుమారు 40 వేల పులులుండగా.. నేడు వాటి సంఖ్య 2,967కు తగ్గిందని, తెలంగాణలో 26 పులులున్నాయని శోభ వివరించారు.

### హరితహారంతో పర్యావరణ ప్రగతి: వీసీ ప్రవీణ్‌రావు

**తెలంగాణ** రాష్ట్రం హరితహారంతో పర్యావరణ ప్రగతి సాధించిందని పీజేటీఎస్ఏయూ ఉపకులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావు అన్నారు. ప్రకృతి సమతుల్యత దెబ్బతిన్నదని, పునరుద్ధరించాల్సి ఉన్నదన్నారు. జీవవైవిధ్యానికి హాని కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో కోతులు, అడవిపందులు పొలాల్లోకి వచ్చేవికావని, వాటి సహజ ఆవాసాలు దెబ్బతినడంతో పొలాల్లోకి, జనావాసాల్లోకి వస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ప్రాజెక్టు నివేదికలు, బ్రోచర్లు, పుస్తకాలను విడుదల చేశారు. ప్రాజెక్టు పురోగతిని డాక్టర్ త్రిపాఠి వివరించారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ ఏడీజీ డాక్టర్ రాజన్, పీజేటీఎస్ఏయూ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఆర్ జగదీశ్వర్, నెట్‌వర్క్ కొఆర్డినేటర్ డాక్టర్ ఆర్ఎస్ త్రిపాఠి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ వాసుదేవరావు పాల్గొన్నారు.

# వేగంగా యాదవ, కురుమ సంక్షేమభవన నిర్మాణం

**సమీక్షా సమావేశంలో మంత్రి తలసాని ఆదేశం**



మాసాబ్‌ట్యాంక్‌లోని తన చాంబర్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో బిల్డింగ్ డిజైన్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్. చిత్రంలో ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం తదితరులు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** కోకాపేటలో నిర్మిస్తున్న యాదవ, కురుమ సంక్షేమ భవనాల నిర్మాణ పనులను వేగవంతంచేసి, సకాలంలో పూర్తిచేయాలని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మాసాబ్‌ట్యాంక్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ.. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సీఎం కేసీఆర్ ఈ భవనాల కోసం పదెకరాల భూమి, రూ.10 కోట్ల నిధులు మంజూరుచేశారని.. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే యాదవ, కురుమ విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటాయని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీందర్‌యాదవ్, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ సీఈ మల్లేశ్, ఎస్‌ఈ నందకుమార్, ఈఈ శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జనవరి నుంచి స్టార్టప్ యాత్ర

- అన్ని యూనివర్సిటీల్లో పోస్టర్ ఆవిష్కరణలు
- ప్రభుత్వ పథకాలపై వాట్సప్ వీడియో
- పాలకమండలి సమావేశంలో విద్యామండలి నిర్ణయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో వచ్చే జనవరి మొదటివారం నుంచి స్టార్టప్ యాత్ర చేపట్టనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే ఈ యాత్రకు ఇప్పటికే సర్వం సిద్ధంచేశారు. విద్యార్థుల్లోని ఆలోచనలను వెలికితీసి వాటికి అనుగుణంగా చిన్నచిన్న పరిశ్రమలను నెలకొల్పేందుకు చేసే ప్రయత్నంలో భాగంగా ఈ స్టార్టప్ యాత్రను నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన పలు అంశాలపై తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి పాలకమండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకొన్నారు. శుక్రవారం ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో మాసబ్ ట్యాంక్‌లోని విద్యామండలి కార్యాలయంలో పాలకమండలి సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ప్రొఫెసర్ వెంకటరమణ, కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిత్తల్, పలు యూనివర్సిటీల అధికారులు పాల్గొన్నారు. దాదాపు రెండు గంటలకుపైగా కొనసాగిన ఈ సమావేశంలో తెలంగాణలో స్టార్టప్ యాత్రపై ప్రధానంగా చర్చించినట్టు ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని యూనివర్సిటీల్లో ఈ స్టార్టప్ యాత్ర కొనసాగుతున్నదని చెప్పారు. ఈ మేరకు హైదరాబాద్ నుంచి తెలంగాణ యూనివర్సిటీలకు వెళ్లేలా నాలుగు మార్గాల్లో నాలుగు బస్సులు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సంయుక్తంగా ఈ స్టార్టప్ యాత్రను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఫిబ్రవరి 22న యాత్ర ముగింపు ఉంటుందని, అదేరోజున ఉత్తమ స్టార్టప్ ఆలోచనలకు బహుమతులు అందజేస్తారని పాపిరెడ్డి వివరించారు.

**పీహెచ్‌డీ ప్రవేశాలకు క్యాలెండర్**

రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీ ప్రవేశాల విధానంలో సంస్కరణలు తీసుకురావాలని విద్యామండలి పాలకమండలి సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి ప్రస్తావించారు. గందరగోళ పరిస్థితుల నుంచి పీహెచ్‌డీ ప్రవేశాలను సక్రమంగా నిర్వహించే మార్గాలను అన్వేషించాలని సూచించారు. పీహెచ్‌డీ ప్రవేశాలకు సంబంధించి వార్షిక క్యాలెండర్‌ను పటిష్ఠంగా అమలుపరిచేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం అవలంబిస్తున్న విధానాలను పరిశీలించి మన రాష్ట్రంలో అమలుచేయడంపై అధ్యయనం చేయాలని చెప్పారు. ఉన్నత విద్యామండలి బాధ్యతలను మరింత విస్తృతం చేయాలని, అందుకు పాలకమండలి సభ్యులు, ఉన్నత విద్యామండలి చైర్మన్, వైస్ చైర్మన్ లోతుగా ఆలోచన చేయాలని తెలిపారు. ఇటీవల ప్రకటించిన ఎంసెట్, ఐసెట్ వంటి రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయాల ప్రవేశపరీక్షల తేదీలకు పాలకమండలి సమావేశం అంగీకారం తెలిపినట్టు తుమ్మల పాపిరెడ్డి వివరించారు.

### 'సీటెట్' ఫలితాలు విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశవ్యాప్తంగా ఈ నెల 8న సీబీఎస్‌ఈ ఆధ్వర్యంలో నిర్వహించిన సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదల చేశారు. ఫలితాలను సీటెట్ అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. దేశవ్యాప్తంగా 28.32 లక్షల మంది ఈ పరీక్షకు హాజరయ్యారు.

### ఏపీలో తెలుగు రచయితల మహాసభలు ప్రారంభం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు శుక్రవారం ఏపీలోని విజయవాడలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ రచయిత్రి శివరాజు సుబ్బలక్ష్మి జ్యోతిప్రజ్వలనతో ప్రారంభమైన మహాసభలకు దేశవిదేశాల నుంచి భాషాభిమానులు తరలివచ్చారు. ప్రారంభ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు జడ్జి ఎన్వీ రమణ సందేశాలను పంపగా నిర్వాహకులు చదివి వినిపించారు.

# రైల్వే డివిజన్‌లో వార్షిక తనిఖీలు

**ధర్మాబాద్‌లో ఐపీ ఆధారిత నిఘా వ్యవస్థ ప్రారంభం**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ డివిజన్‌లోని ముద్ఖేడ్– కాచిగూడ సెక్షన్‌లో దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్ మాల్యాతోపాటు డీఆర్ఎం ఎన్నెస్సార్ ప్రసాద్ శుక్రవారం వార్షిక తనిఖీలు చేపట్టారు. మొదట ఉమ్రి రైల్వేస్టేషన్‌ను మాల్యా తనిఖీచేసి స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ధర్మాబాద్ రైల్వేస్టేషన్‌లో ఐపీ ఆధారిత నిఘా వ్యవస్థ, సీసీటీవీ గదిని ప్రారంభించారు. అనంతరం బాసర, నిజామాబాద్ రైల్వేస్టేషన్లలో సమగ్ర తనిఖీలు చేసి, ఐఎస్వో 14001 సర్టిఫికేషన్ అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం కామారెడ్డి స్టేషన్‌ను, రైల్వేకాలనీ, కొత్తగా విస్తరించిన పాదచారుల వంతెన ప్రాంగణాన్ని పరిశీలించారు. బిక్కనూర్– అక్కన్నపేట్– మిర్జాపల్లి మధ్య స్పీడ్ టెస్ట్‌ను నిర్వహించారు. తనిఖీలో కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ రాంకృపాల్, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ కేవీ శివప్రసాద్, ప్రిన్సిపల్ చీఫ్ మేనేజర్ కే శివప్రసాద్, ఇతర అధికారులు జేకే జైన్, బ్రజేంద్రకుమార్, అమిత్‌గోయల్, జీఎం ఈశ్వర్‌రావు పాల్గొన్నారు.

# ఇకపై పదో తరగతి డిజిటల్ సర్టిఫికెట్లు!

- ఆధార్, ఓటర్ కార్డు మాదిరిగా డౌన్‌లోడ్‌కు అవకాశం
- సర్టిఫికెట్ల భద్రతపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి
- నకిలీ సర్టిఫికెట్ల నియంత్రణకు చర్యలు
- ప్రతిపాదనలు సిద్ధంచేస్తున్న ఉన్నతాధికారులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని పదో తరగతి సర్టిఫికెట్లను డిజిటలైజేషన్ చేసేందుకు విద్యాశాఖ సిద్ధమవుతున్నది. అందుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు పరిశీలన చేస్తున్నారు. పలు సాఫ్ట్‌వేర్ సంస్థలతో సంప్రదింపులు మొదలు పెట్టారు. ఆధార్ కార్డు, ఓటర్ కార్డు డిజిటలైషన్ మాదిరిగానే టెన్త్ మెమోలను కూడా విద్యాశాఖ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొనేలా ప్రయత్నాలను కొనసాగిస్తున్నది. ఈ విధానాన్ని ఎప్పటి నుంచి అమలుచేయాలనే దానిపై అధికారులు త్వరలో స్పష్టత ఇవ్వనున్నారు. పుట్టినతేదీ నిర్ధారణ, ఉన్నతవిద్యలో ప్రవేశాలు, వివిధ ఉద్యోగాలకు పదో తరగతి మెమో ఆఫ్ మార్క్స్‌కు ఎంతో విలువ, గుర్తింపు ఉన్నది. అంతటి ప్రాధాన్యం ఉన్న పదో తరగతి సర్టిఫికెట్లు ఇంట్లో సరైన రక్షణ చర్యలు లేకపోవడం వల్ల చెదలు పట్టి పాడైపోతున్నాయి. అలాగే వర్షపునీటికి తడిచి పనికి రాకుండా పోయే ప్రమాదంతోపాటు ప్రయాణాల్లో పోగొట్టుకొంటున్న సందర్భాలు చాలా ఉంటున్నాయి. పాస్‌పోర్టు జారీ, విదేశాల్లో ఉన్నతవిద్యకు పదో తరగతి సర్టిఫికెట్‌లో ఉండే పేరునే పరిగణనలోకి తీసుకొంటున్నారు. దాంతో పదో తరగతి పరీక్షల సర్టిఫికెట్ల డూప్లికేట్ కోరుతూ నిత్యం అనేక మంది విద్యార్థులు ఎస్సెస్సీ బోర్డు కార్యాలయం చుట్టూ తిరుగుతుంటారు. ఈ క్రమంలో కొందరు దళారులను ఆశ్రయించడం, అడ్డదారులు తొక్కడం వంటి చర్యలతో నకిలీ సర్టిఫికెట్లు పొందుతున్న దాఖలాలు కూడా ఉన్నాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకు విద్యాశాఖ వెబ్‌సైట్ నుంచే నేరుగా డౌన్‌లోడ్ చేసుకొనేలా సాఫ్ట్‌వేర్ రూపొందించే పనిలో అధికారులు ఉన్నారు. త్వరలోనే ఆన్‌లైన్‌లో టెన్త్ మెమోలు డౌన్‌లోడ్ చేసుకొనేలా అధికారులు చర్యలు తీసుకొంటున్నారు.

### అందరికీ అందుబాటులో..

**పదో** తరగతి సర్టిఫికెట్‌కు ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకొని చాలా మంది అంగట్లో దొరుకుతున్న నకిలీ సర్టిఫికెట్లను కొనుగోలు చేస్తున్నారు. ఇందుకోసం దళారులు పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్నారు. నకిలీ సర్టిఫికెట్లకు చెక్ పెట్టేందుకు డిజిటలైజేషన్ విధానాన్ని తెరపైకి తీసుకువస్తున్నాం. దీనిపై త్వరలోనే మరింత స్పష్టత తీసుకువస్తాం. ఎప్పటి నుంచి అమలు చేయాలి అన్న అంశంపై త్వరలో స్పష్టత ఇస్తాం. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి.


**- బీ జనార్దన్‌రెడ్డి, కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ**

# భర్తను చంపిన కేసులో భార్యకు యావజ్జీవం

**ఆరేండ్ల క్రితం గోపాలపురం పీఎస్ పరిధిలో ఘటన**

**మారేడ్‌పల్లి:** ప్రియుడి సహాయంతో భర్తను హత్యచేసిన భార్యకు యావజ్జీవ శిక్ష పడింది. ఇద్దరికి శిక్షతోపాటు చెరో రూ.ఐదువేల జరిమానా విధిస్తూ సికింద్రాబాద్ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. గోపాలపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా గూడెంగ తండాకు చెందిన బదావత్ కుమారస్వామి దంపతులు కొన్నేండ్ల క్రితం ఉపాధి కోసం హైదరాబాద్‌కు వలస వచ్చారు. మేస్త్రీగా పని చేసుకొంటూ రెజిమెంటల్‌బజార్‌లో నివసించేవాడు. ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన తన్నీరు లక్ష్మణ్ కూడా మేస్త్రీగా పనిచేస్తూ పార్శిగుట్టలో ఉండేవాడు. వీరంతా కలిసి పనిచేస్తున్న క్రమంలో కుమారస్వామి భార్య పద్మకు లక్ష్మణ్‌తో పరిచయం ఏర్పడి అది వివాహేతర సంబంధానికి దారితీసింది. పద్ధతి మార్చుకోవాలంటూ కుమారస్వామి పలుమార్లు భార్యను మందలించినా ఫలితం లేకపోయింది. తమ సంబంధానికి అడ్డుగా వస్తున్న కుమారస్వామిని పక్కకు తప్పించాలని పద్మ, లక్ష్మణ్ యోచించారు. 2013 సెప్టెంబర్ 22న ఇంట్లో పడుకొన్న కుమారస్వామి గొంతుకు తాడుబిగించి చంపేశారు. భర్త ఉరేసుకొని చనిపోయాడంటూ పద్మ పోలీసులకు ఫిర్యాదుచేసింది. గోపాలపురం అప్పటి ఇన్‌స్పెక్టర్ శివభాస్కర్ కేసు నమోదుచేసుకొని విచారణ చేపట్టగా లక్ష్మణ్, పద్మ మధ్య ఉన్న సంబంధం బయటపడింది. విచారణ చేపట్టి కోర్టుకు ఆధారాలను అందించారు. కోర్టు వారికి జీవితఖైదు విధించింది.

# లైంగికదాడికి పాల్పడిన యువకుడిపై పీడీయాక్ట్



నిందితుడు రాజేశ్‌త్యాగి

**జీడిమెట్ల:** మూడేండ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఓ యువకుడిపై జగద్గిరిగుట్ట పోలీసులు పీడీ యాక్ట్ నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ అల్లూరి గంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ దోలాపూర్‌కు చెందిన రాజేశ్ త్యాగి కొంతకాలంగా దేవేందర్‌నగర్ నర్సింహబస్తీలో ఉంటూ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. సెప్టెంబర్ 12న ఇదే ప్రాంతానికి చెందిన మూడేండ్ల చిన్నారి అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఇంటికి వస్తుండగా టీవీ చూపిస్తానంటూ ఇంటికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదుచేయగా.. రాజేశ్ త్యాగిపై ఐపీసీ 376, పోక్సో చట్టం కింద కేసు చేసి జైలుకు తరలించారు. నవంబర్ 28న బెయిల్‌పై విడుదలవగా.. అతడి ప్రవర్తన సక్రమంగా లేకపోవడంతో పోలీసులు పీడీ యాక్ట్ నమోదుచేసి శుక్రవారం చర్లపల్లి జైలుకు తరలించారు.

# రేపు శిశుమందిర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- బండ్లగూడ శారదాధామంలో నిర్వహణ
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ఆరెస్సెస్ అధిపతి మోహన్ భాగవత్

**హైదరాబాద్/ హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** సరస్వతి శిశుమందిర్ పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనాన్ని ఆదివారం (ఈ నెల 29న) నిర్వహించనున్నట్టు పూర్వ విద్యార్థి పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు హరిస్మరణ్‌రెడ్డి, బొడ్డు శ్రీనివాస్, రాజారెడ్డి తెలిపారు. హైదరాబాద్ శివారు బండ్లగూడ జాగీర్ (కిస్మత్‌పూర్)లోని శారదాధామంలో జరిగే ఈ సమ్మేళనానికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) సర్ సంఘ్‌చాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. పూర్వ విద్యార్థి పరిషత్ నాయకులు శుక్రవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లోని 420 శిశుమందిర్ పాఠశాలల్లో చదువుకొన్న 15వేల మంది పూర్వ విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొంటారని, రెండువేల మంది ఉపాధ్యాయులను గురువందనం పేరుతో సన్మానిస్తామని వివరించారు. ప్రతినిధులంతా ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఇతర వివరాల కోసం బొడ్డు శ్రీనివాస్ (సెల్ నంబర్ 9676802003)ను సంప్రదించాలని సూచించారు. మోహన్ భాగవత్ అదేరోజు నిర్వహించనున్న అఖిల భారత పూర్వ ఛాత్ర పరిషత్ కార్యవర్గ సమావేశంలో మార్గదర్శనం చేయడంతోపాటు, శ్రీవిద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ (సీబీఎస్‌ఈ) పాఠశాలను, స్టాఫ్ క్వార్టర్స్‌ను ప్రారంభిస్తారని వెల్లడించారు.

# 125 కోట్ల మంది వద్ద ఆధార్ కార్డు

**మరో మైలురాయిని సాధించిన యూఐడీఏఐ**

**న్యూఢిల్లీ:** భారత విశిష్ట ప్రాధికార గుర్తింపు సంస్థ (యూఐడీఏఐ) మరో మైలు రాయిని సాధించింది. దేశంలో ఇప్పటి వరకు 125 కోట్ల మందికి ఆధార్ కార్డులను జారీ చేసింది. ఆధార్‌ను ప్రాథమిక గుర్తింపు పత్రంగా పరిగణించేవారి సంఖ్య వేగంగా పెరుగడం వల్లే ఇది సాధ్యమైందని యూఐడీఏఐ పేర్కొంది. ఆధార్ ప్రక్రియ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు కార్డుదారులు 37 వేల కోట్ల సార్లు దీన్ని వినియోగించినట్లు తెలిపింది. ఆధార్‌లోని వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకునేందుకు కార్డుదారులు చాలా ఆసక్తి చూపుతున్నారని యూఐడీఏఐ వెల్లడించింది.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

**మహేశ్వరం:** ఆటో.. కారు, బైక్‌ను ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతిచెందారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డ ఘటన శుక్రవారం రాత్రి మహేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కందుకూరు నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న బియ్యం లోడుతో ఉన్న ఆటో.. హైదరాబాద్ నుంచి తుమ్మలూర్ వైపు వెళ్తున్న మారుతీకారు మొహబత్‌నగర్ గేట్ సమీపంలో ఢీకొన్నాయి. కారు వెనుక ఉన్న టీవీఎస్ బైక్‌ను కూడా ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో అచ్చంపేట గోదాల్‌కు చెందిన అబ్దుల్ రహీమ్ (50), ఆషీయా (12), మహేశ్వరం మండలం తుమ్మలూరువాసి శ్రీనివాస్ (28) మృతిచెందారు.

# మిలియన్‌మార్చ్‌కు లభించని అనుమతి

- సీఏఏ, ఎన్నార్సీ వ్యతిరేక ర్యాలీ అనుమతి కోసం దాఖలుచేసిన పిటిషన్‌లో లోపాలు
- మళ్లీ సవరణ పిటిషన్ దాఖలుచేయాలన్న హైకోర్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సీఏఏ, ప్రతిపాదిత ఎన్నార్సీకి వ్యతిరేకంగా హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్డులో పలు సంఘాలు తలపెట్టిన మిలియన్‌మార్చ్ నిరసన ర్యాలీకి అనుమతించేందుకు హైకోర్టు శుక్రవారం నిరాకరించింది. పిటిషన్‌లో పేర్కొన్న ప్రేయర్‌లో లోపాలు ఉన్నందున దానిని సవరించి, మళ్లీ దాఖలు చేయాలని జస్టిస్ టీ వినోద్‌కుమార్ ధర్మాసనం సూచించింది. శనివారం (ఈ నెల 28న) మిలియన్‌మార్చ్ నిర్వహించేందుకు తమకు అనుమతివ్వాలంటూ టీఎస్- ఏపీ సీఏఏ, ఎన్నార్సీ జేఏసీ కన్వీనర్ మహమ్మద్ ముస్తాక్‌మాలిక్ ఈ నెల 21న హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు దరఖాస్తుచేశారు. దీనిని పోలీసులు తిరస్కరించడంతో జేఏసీ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. శాంతియుత ర్యాలీకి అనుమతించేలా ఆదేశాలివ్వాలని, రాజ్యాంగం కల్పించిన నిరసన తెలిపే హక్కులో పోలీసులు జోక్యం చేసుకోకుండా చూడాలని పిటిషనర్ అభ్యర్థించారు. దరఖాస్తును పోలీసులు పెండింగ్‌లో పెట్టలేదని, తిరస్కరించారని పోలీసుల తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దరఖాస్తును తిరస్కరించడాన్ని పిటిషనర్లు సవాల్ చేయనందున దానిని కొట్టేయాలని కోరారు. పోలీసులు భద్రత కల్పించకుండా కార్యక్రమం నిర్వహించలేరని పేర్కొన్న ధర్మాసనం.. పోలీసులు అనుమతి నిరాకరించడాన్ని సవాల్‌చేస్తూ సవరణ పిటిషన్ దాఖలుచేయాలని సూచించింది. విచారణను మంగళవారానికి వాయిదావేసింది.

**వేర్వేరు పిటిషన్లపై అభ్యంతరం**

మిలియన్‌మార్చ్‌కు అనుమతించేలా ఆదేశాలివ్వాలని ఖలీల్ ఉల్లాహ్ హుస్సేని మెమోరియల్ ఫౌండేషన్ లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలుచేసింది. పోలీసులకు దరఖాస్తు చేసినవ్యక్తి, ఖలీల్‌ఉల్లాహ్ హుస్సేని మెమోరియల్ ఫౌండేషన్ వేర్వేరు అయినందున మిలియన్‌మార్చ్‌కు అనుమతివ్వాలని కోరేందుకు ఫౌండేషన్‌కు ఎలాంటి లోకస్‌స్టాండీ (అర్హత) లేదని ధర్మాసనం స్పష్టంచేసింది. ఒకే అంశంపై వేర్వేరు పిటిషన్లు వేయడాన్ని తప్పుబట్టింది. మాలిక్ దరఖాస్తును తిరస్కరిస్తూ పోలీసులు ఇచ్చిన ఉత్తర్వులను మీరెలా సవాల్‌చేస్తారని ప్రశ్నిస్తూ.. రెండో పిటిషన్‌ను కొట్టేసింది.

# ఆభరణాల కోసం వరుస హత్యలు

- నలుగురు మహిళలను మట్టుబెట్టిన నిందితుడి అరెస్టు
- సహకరించిన భార్య కూడా కటకటాలపాలు
- మహబూబ్‌నగర్ జిల్లాలో వెలుగుచూసిన ఘోరాలు



హత్యల కేసు వివరాలను వెల్లడిస్తున్న మహబూబ్‌నగర్ ఎస్పీ రెమారాజేశ్వరి, వెనుకాల నిందితులు

**మహబూబ్‌నగర్ క్రైం:** వెండి, బంగారు ఆభరణాల కోసం మహిళలను హత్యలు చేస్తున్న నిందితుడు పోలీసులకు చిక్కాడు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం గునేడ్ గ్రామానికి చెందిన ఎరుకలి శ్రీను వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే నలుగురు మహిళలను హత్యచేసినట్టు పోలీసుల విచారణలో తేలింది. నేరాల్లో సహకరిస్తున్న అతని భార్య సాయమ్మను కూడా అరెస్టుచేసి, రిమాండ్‌కు తరలించారు. ఇటీవల దేవరకద్ర మండలంలో జరిగిన ఓ హత్య కేసును పరిశోధిస్తుండగా.. నిందుతుడి నేరాల చిట్టా బయటపడిందని మహబూబ్‌నగర్ ఎస్పీ రెమా రాజేశ్వరి తెలిపారు. శుక్రవారం ఎస్పీ మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ నెల 17వ తేదీన దేవరకద్ర మండలం డోకూర్ గ్రామ పంచాయతీ వద్ద నవాబ్‌పేట మండలం కూచూర్ గ్రామానికి చెందిన అలివేలమ్మ(53) హత్యకు గురైంది. కేసు నమోదుచేసిన దేవరకద్ర ఎస్సై పాత నేరస్తుడు శ్రీనును విచారించడంతో మరో మూడు ఘోరాలు వెలుగులోకి వచ్చాయి. పాలమూరులోని శివశక్తినగర్‌కు చెందిన శ్రీను ఓ కల్లుదుకాణంలో అలివేలమ్మను పరిచయం చేసుకున్నాడు. తనకు దేవరకద్రలో డబ్బు రావల్సి ఉన్నదని, తనతోవస్తే డబ్బులు ఇస్తానని నమ్మించాడు. కల్లు తాగించి, శివారు ప్రాంతానికి తీసుకెళ్లి, గొంతు నులిమి హత్యచేశాడు. ఆమె వద్ద ఉన్న ఆభరణాలు, నగదు తీసుకొని వెళ్లిపోయాడు. దీనితోపాటు భూత్పూర్ మండలం కర్వెన గ్రామానికి చెందిన అంతే బాలమ్మను మద్యం తాగించి హత్యచేశాడు. కొత్తకోట మండలం మిడ్జిల్ పోలీసుస్టేషన్ పరిధిలోని కొత్తపల్లివాగు నుంచి ఓ మహిళను తీసుకెళ్లి రాచకొండ–అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో హత్యచేశాడు. హత్యచేసిన తర్వాత మహిళలపై ఉన్న వెండి, బంగారు ఆభరణాలను దోచుకొని పరారయ్యేవాడు. దోచుకెళ్లిన సొమ్మును తన భార్యకు అప్పగించేవాడు. ఆమె వాటిని దుకాణాల్లో అమ్మి, డబ్బులు తీసుకొచ్చి భర్తకు ఇచ్చేది. ఈ కేసును ఛేదించిన సీఐ కిషన్, వెంకటేశ్వర్లును ఎస్పీ అభినందించారు. నిందితుల నుంచి 12 గ్రాముల బంగారం, 80 తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు.

నమస్తే తెలంగాణ
# జిందగీ
శనివారం 28 డిసెంబర్ 2019 WWW.NTNEWS.COM /nt.zindagi

**నాల్లుగేండ్ల క్రితం దాకా పల్లెల్లో లేచిన గుడుంబా గత్తర మటుమాయమైంది. లక్షల మంది గుడుంబాకు బానిసై తమను తాము పోగోట్టుకోవడమే కాకుండా తమను నమ్ముకున్నవారిని నడి సంద్రంలో ముంచి వెళ్లిన దయనీయస్థితి మారిపోతున్నది. యుక్తవయసులో వైధవ్యాన్ని నెత్తినకెత్తుకొని ఎంతోమంది దుర్భరమైన జీవితాలను వెళ్లదీస్తున్న స్థితి కూడా మారిపోతున్నది. వితంతు, యుక్త వితంతు జీవితాలపట్ల మానవీయస్పర్శతో ఆలోచించిన తెలంగాణ రాష్ట్రప్రభుతం వారి జీవితాలకు 'ఆసరా' అయింది. ప్రత్యామ్నాయ జీవిత మార్గాన్ని చూపిన కరుణాపయోనిధిగా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నిలిచారని ఆచార్య భట్టు రమేష్ నాయక్ శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేసి మరీ తేల్చారు.**



## తెలంగాణలో..

# వితంతు సంక్షేమం!

**స్వాతంత్ర్యానంతర** భారతదేశంలో ఒక సామాజిక సమస్యని అడ్రస్ చేసిన దాఖలాలు ఎక్కడాలేవు. సామాజిక సమస్యల్ని మానవీయ దృష్టికోణంలో ఆలోంచించి ఆచరించే అరుదైన ఆవిష్కారం తెలంగాణలోనే జరుగుతున్నది. 2014కన్నా ముందు దేశంలో ప్రత్యేకించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ నిషేధిత మద్యం ప్రభావం విస్తృత, విస్రుంఖలత్వానికి దారి తీసింది. గ్రామీణ పేదరికం మరింత దయనీయ స్థితిలోకి వెళ్లేందుకు నెట్టివేయడంలో దాని పాత్ర విస్తృతమైంది. దీనిపై వరంగల్‌లోని జానపద విజ్ఞాన పీఠం, పీఠాధిపతి (ప్రస్తుతం తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్)గా ఉన్న ఆచార్య భట్టు రమేష్ నాయక్.. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) శాస్త్రీయంగా అధ్యయనం చేసి మరీ చెప్తున్నారు. 'ప్రాబ్లమ్స్ అండ్ చాలెంజెస్ ఆఫ్ ట్రైబల్ ఉమెన్ విడోస్ ఇన్ సెలెక్టెడ్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్' అంశంపై వారు అధ్యయనం చేసి 'తెలంగాణలో వితంతు వికాసం' జరుగుతున్నదని చెప్తున్నారు.

### సామాజిక రుగ్మత నుంచీ ..

ఈ శాస్త్రీయ అధ్యయనంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని అనంతరపురం, విశాఖపట్నం రెండు జిల్లాలు. తెలంగాణలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లోని 18 గిరిజన తెగల జీవితాలను అతిదారుణంగా కుంగదీసింది గుడుంబా లేదా నాటుసారా. అనంతపురం జిల్లాలో 17 మండలాలు, విశాఖపట్నంలోని 14 మండలాలు, వరంగల్ జిల్లాలోని 23 మండలాలు, ఖమ్మం జిల్లాలోని 16 మండలాలు, నల్గొండ జిల్లాలోని 14 ఇలా మొత్తం రెండు రాష్ట్రాల్లోని ఐదు జిల్లాల్లోని 85 మండలాల్లో 2015-2017 వరకు అధ్యయనం చేసి నాలుగువేల మంది కుటుంబాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

### అపురూపమైన విషయం

చిన్నవయసులో కుటుంబ భారాన్ని వెళ్లదీయడం దుర్భరంగా మారిన నేపథ్యం నుంచి ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ముందడుగు కనిపించిందని అధ్యయనం తేల్చిచెప్పింది. 'ఆర్థిక సంబంధాలు మానవ సంబంధాలను సామాజిక సంబంధాలను, సైతం ఎలా చిన్నాభిన్నం చేశాయో.. మానవీయ కోణంలో అర్థం చేసుకోవడం వల్లే తెలంగాణ దేశానికే ఆదర్శప్రాయంగా నిలిచింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తొలి నాళ్లల్లోనే బృహత్తర నిర్మాణాత్మక కార్యాచరణకు నడుం కట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పటి దాకా ఎవరూ పట్టించుకోని సామాజిక సమస్యని అడ్రస్ చేయడమన్నది అరుదైన, అపురూపమైన విషయ'మని రమేష్ నాయక్ పేర్కొంటున్నారు.

### వజ్రసంకల్పం


స్వాతంత్రం తర్వాతఅనేక సమస్యలు దేశాన్ని పట్టిపీడించాయి. వాటిలో కొన్నింటికి పరిష్కారాలు చూపినా అవి కేవలం రాజకీయ కోణంలోనే పాలకులు భావించి వాటిని అడ్రస్ చేసినట్టుగా వ్యవహరించారు. కానీ, అనంతరం పెద్దగా పట్టించుకోకుండా విజయవంతంగా వదిలిపెట్టిన దాఖలాలే ఎక్కువ. అయితే తెలంగాణ ప్రభుత్వం అందుకు పూర్తిగా విరుద్ధం. ఉద్యమం నుంచి వచ్చిన ప్రభుత్వంగా, ఆ రాష్ట్రానికి సారథ్యం వహిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన ప్రభుత్వం గ్రామీణ ఏజెన్సీ, అటవీ ప్రాంతాల్లో సమాంతర రుగ్మతగా వేళ్లూనుకొనిపోయిన ఒక మహమ్మారిని మట్టుపెట్టేందుకు వజ్ర సంకల్పం పూనిన దాఖలు ఒక్క తెలంగాణలో తప్ప మరెక్కడా మనం చూడం అని ఆచార్య భట్టు రమేష్ నాయక్ పేర్కొంటున్నారు. ఆదివాసీ, గిరిజన గూడేల్లో వెలుగు నింపేందుకు పాలనాపరమైన సంస్కరణలు మాత్రమే చేసి ఊరుకోవడం లేదు. ఆ ప్రాంతాల్లో ఉన్న ప్రజల సామాజిక రుగ్మతలపై ఆయన చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని అధ్యయనం చేస్తున్నప్పుడు, అధ్యయనాంతరం జరిగిన పరిణామాలు స్పష్టం చేయడమేకాకుండా భరోసా ఇచ్చింది అని ఆయన వివరించారు.



ఆచార్య భట్టు రమేష్ నాయక్ తెలుగు విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఇదే విశ్వవిద్యాలయానికి రిజిస్ట్రార్‌గా (ఇటీవలే రెండో పర్యాయం) వ్యవహరిస్తున్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఆదివాసీ గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరపై అధ్యయనం చేశారు. వరంగల్‌లోని జానపద గిరిజన విజ్ఞాన పీఠానికి పీఠాధ్యక్షుడిగా పనిచేస్తూ ఆదివాసీ, గిరిజన సంస్కృతి సంప్రదాయాలపై విస్తృతంగా పరిశోధనలు చేశారు. అనేక జాతీయ, అంతర్జాతీయ వేదికల్లో గిరిజన సంస్కృతి, సంప్రదయాల పట్ల, వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులపై విస్తృతంగా అధ్యయనం చేస్తున్నారు.

### గిరిజన పల్లెల్లో పునరుత్తేజం

గుడుంబాను నిషేధించడం వల్ల పల్లెలు కుదుట పడుతున్నాయి. కుటుంబ పోషణను బాధ్యాతాయుతంగా స్వీకరిస్తూ పిల్లల చదువు పట్ల శ్రద్ధ చూపుతున్నారు. ప్రభుత్వం కేవలం గుడుంబాను నిషేధించి మాత్రమే ఊరుకోకుండా తయారీదారులకు ఎంత పటిష్టమైన ప్రత్యామ్నాయ కార్యాచరణ చూపిందో దాని బారిన బడి వీధిపాలైన కుటుంబాలకు అంతే బాధ్యతగా భరోసా కల్పించారు.



కిరాణ కొట్టు పెట్టుకోవడం, టైలరింగ్, చిన్న చిన్న వ్యాపారాలు, గొర్రెల్ని ఇవ్వడం వంటి వాటిని విపరీతంగా ప్రోత్సహిస్తూ భరోసా కల్పించారు. వారి పిల్లలకు గురుకులాల్లో విద్యావకాశాలు కల్పిస్తున్నారు.

### గుడుంబా రద్దు ఓ సాహసం

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల్లో గుడుంబా, నాటుసారా వల్ల ఇటు తయారీదారులు, దాని వినియోగం వల్ల లక్షలాది కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గుడుంబాను రద్దుచేయడం అంటే మామూలు విషయం కాదు. వేలాది కుటుంబాలు దీని తయారీపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. తక్కువ ధరకు అందుబాటులో ఉన్న మద్యం కావడం వల్ల దానికి అలవాటు పడిన కుటుంబాలకు ఆర్థిక భారం పడుతుంది. కానీ తెలంగాణలో సామాజిక బాధ్యతగా గుడుంబాను నిషేధించడం పెద్ద విషయం. సంచలనం కూడా. కేవలం నిషేధించి ఇక మా వంతు అయిపోయిందని ప్రభుత్వం వ్యవహరించలేదు. దానిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను విజయవంతంగా చూపింది. అంతేకాకుండా తాగుడుకు బానిసై మరణించినవారి కుటుంబాలను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నది. వేలాది కుటుంబాలను ఆదుకోవడానికి, ముఖ్యంగా వితంతు, యుక్తవయసులో వితంతువులుగా మారిన వారి జీవితాలను మార్చడమే ధ్యేయంగా అంకిత భావంతో, చిత్తశుద్ధితో ప్రభుత్వం పనిచేస్తున్నదని అధ్యయనంలో తేలిందని రమేష్ నాయక్ సోదాహరణగా వివరించారు.

### అరుదైన విషయం

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవస్థీకృతమైన నాటుసారా మాఫియా జోలికి అక్కడి ప్రభుత్వం వెళ్లలేకపోయింది. కానీ తెలంగాణలో మాత్రం ఈ సమస్యని కూకటివేళ్లతో సహ పెకిలించి వేయగలిగింది. 'ఒక పరిశోధకుడిగా నాకు సంతోషకరమైన అంశం ఏమిటంటే ' నేను ఈ ప్రాజెక్టుపై అధ్యయనం చేస్తున్నానని నా పేరును అసెంబ్లీలో పేర్కొనడం గొప్ప విషయంగా నేను భావిస్తున్నా' అని ఆచార్య రమేష్ నాయక్ పేర్కొన్నారు. ఇదెందుకు చెబుతున్నానంటే సాధారణంగా ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు, మంత్రులు ఎంతోమంది తమ రాష్ట్రంలో ఈ సమస్య లేదు. అసలు అది సమస్యే కాదని చేతులెత్తేస్తారు కానీ తెలంగాణలో అలా కాదు ఎవరైనా మంచి చేస్తే ఆ మంచి పనిచేసిన వారికే గుర్తింపు ఇచ్చే సంస్కృతి ఇక్కడ ఉన్నది. ఇది చాలా అరుదైన విషయంగా నాకు అనిపించింది' అని ఆయన పేర్కొన్నారు.

... వరంగల్ ప్రధాన ప్రతినిధి,
నమస్తే తెలంగాణ

# మనసున్న మాతృమూర్తి



**తల్లి పాలు అమృతంతో సమానం. అటువంటి పాలు అందని ఎంతోమంది చిన్నారులున్నారు. కొంతమంది బాలింతలు పలు అనారోగ్య కారణాల వల్ల తమ చిన్నారులకు పాలు అందించలేకపోతున్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ఓ మాతృమూర్తి శ్రీకారం చుట్టింది.**

అహ్మదాబాద్‌కు చెందిన రుషిన మర్ఫాటియా ఈవెంట్ మేనేజర్‌గా పనిచేసేది. ఆమె గత సెప్టెంబర్‌లో ఓ బిడ్డకు జన్మనిచ్చింది. ఆ సమయంలో తల్లి పాలకుఉన్న ఆవశ్యకతను గుర్తించింది. దేశంలో ఏటా తల్లి పాలు చాలకపోవడంతో ఎంతోమంది నవజాత శిశువులు చనిపోతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రుషిన అటువంటి చిన్నారులకు తల్లిపాలు అందించాలనుకున్నది. అప్పటికే ఓ ఆస్పత్రిలో అత్యవసర చికిత్సా విభాగంలో వైద్యం పొందుతున్న కొంతమంది చిన్నారుల కోసం ఆమె పాలు దానం చేసింది. ఆ పాలు ఎంతో మంది చిన్నారుల ప్రాణాలను నిలబెట్టాయి. 'రక్త హీనతతో కొందరు, ఇతర అనారోగ్య సమస్యల కారణంగా మరికొందరు తమ బిడ్డలకు పాలు ఇవ్వలేకపోతున్నారని' రుషిన అంటున్నది. ఇంకొందరు తల్లులు శిశువుకు సరిపడినన్ని పాలు ఇవ్వలేక బాధపడుతున్నార'ని ఆమె చెబుతున్నది. 'భారతదేశంలో తల్లిపాలు అందక ఏటా ఏడు లక్షలమంది చిన్నారులు మరణిస్తున్నారు. ప్రతి వెయ్యి శిశు మరణాల్లో తక్కువ బరువుతో పుట్టడం వల్లే చనిపోతున్నారు. ఇటువంటి వారికి సమృద్ధిగా తల్లిపాలు లభించకపోవడం వల్లనే ఇలా జరుగుతున్నదని' వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇలా తల్లిపాలు సేకరించి అవసరమైన చిన్నారులకు అందించేందుకు కొంతమంది తల్లులు 'ఆర్ఫాన్ మామ్స్ బ్యాంక్' పేరుతో నవజాత సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రానికి 250 మంది తల్లులు 90 లీటర్ల తల్లిపాలు దానం చేశారు. పసిబిడ్డల ఆకలి తీర్చేందుకు కొంతమంది తల్లులు ప్రత్యేకంగా మరికొన్ని చోట్ల 'పాల నిధి' కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇలా ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా సేకరించిన పాలను అవసరమైన శిశువులకు అందిస్తున్నారు. తమిళనాడులోని ఎగ్మోర్ పట్టణంలో కొందరు తల్లులు ప్రతి ఆదివారం తమ పాలు దానం చేస్తున్నారు. ఆ పాలను దేశంలో తల్లిపాలు అందక బాధపడే చిన్నారులకు అందిస్తున్నారు. బిడ్డలకు పాలివ్వడం వల్ల చిన్నారులే కాకుండా, తల్లులు కూడా ఎంతో ఆరోగ్యంగా ఉంటారని రుషిన చెబుతున్నది.

# తాటిబెల్లం ఉపయోగాలు



**తాటి బెల్లం తింటే ఆరోగ్యానికి మంచిది. అనేక సమస్యలను పరిష్కరించే గుణం తాటి బెల్లంలో ఉంది.**

- ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీరు తాగడం ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థకు మంచిది. తాటి బెల్లం వేసుకుంటే మరింత మంచిదని వైద్యులు చెబుతున్నారు. మైగ్రేన్ సమస్య నుంచి బయటపడవచ్చు. తాటి బెల్లం తిని బరువు తగ్గొచ్చు.
- మలబద్ధకం సమస్యతో బాధపడేవారు 2 కప్పుల తాటి బెల్లం తినవచ్చు. నిద్రకు ముందు 1 గ్లాసు గోరువెచ్చని నీరు తాగితే జీర్ణక్రియల పనులు వేగవంతమవుతాయి. తాటి బెల్లాన్ని చప్పరించడం వల్ల దాహార్తి సమస్య నుంచి కూడా బయటపడవచ్చు.
- రోజూ 50 గ్రాముల తాటి బెల్లం తింటే మొటిమలు, చర్మ సమస్యల నుంచి బయటపడవచ్చు. ఇలా కొన్ని రోజులు పాటిస్తే శరీరంలో పేరుకుపోయిన కొవ్వు తగ్గుతుంది.
- తాటి బెల్లంలో విటమిన్లు, మినరల్స్ అధికంగా ఉంటాయి. ఆహారం త్వరగా జీర్ణమయ్యేలా చేసి మలబద్ధకం పోగొడుతుంది. ఐరన్ ఎక్కువగా ఉండడం వల్ల అనీమియాను దూరం చేస్తుంది. యాంటాక్సిడెంట్ల కారణంగా శరీరంలో దెబ్బతిన్న కణాలను సరిదిద్దడంలో సహకరిస్తుంది.
- ఇందులో ఉండే కాల్షియం, పొటాషియం, ఫాస్పరస్ శ్వాసకోస నాళం, చిన్న పేగుల్లో చేరుకున్న విష పదార్థాలను తొలగిస్తుంది. దగ్గు, జలుబు, శ్వాసనాళ సమస్యలు తొలగించడంలో తాటిబెల్లం సాయపడుతుంది.

## ఆరోగ్య చిట్కాలు



- కిడ్నీ నొప్పి బాధితులు రెండుపూటలా అరచెంచా చొప్పున పచ్చి మెంతులు లేదా పెరుగులో నానబెట్టిన మెంతులు తింటే నొప్పి తగ్గుతుంది.
- కాలిన గాయాలకు మగ్గిన అరటిపండు గుజ్జు రాస్తే గాయం మానుతుంది.
- తలలో పేలు పడితే 5 చెంచాల గోరువెచ్చని కొబ్బరి నూనెలో 4 కర్పూరం బిళ్లలు అరగదీసి తలకు పట్టిస్తే పేల సమస్య పోతుంది..
- రాత్రి నిద్రకు ముందు పాదాలను కడిగి తుడిచి కొబ్బరి నూనె రాస్తే పాదాలు వారం రోజుల్లో నునుపుగా మారుతాయి.
- చిగురువాపు, ఇన్‌ఫెక్షన్ కారణాలతో పండ్ల వెంట రక్తం కారుతుంటే 1 ఉల్లిపాయ, ఉప్పు కలిపి నూరి ఆ మిశ్రమంతో దంతాలను, చిగుళ్లను రుద్దితే వెంటనే రక్తం కారడం ఆగిపోతుంది.

# మృదువైన చర్మం కోసం

**కొందరి చర్మం పొడిబారినట్లుగా ఉంటుంది. దీంతో దురద కూడా వస్తుంటుంది. ముఖ్యంగా ఈ సమస్య చలికాలంలో ఎక్కువ. ఈ సమస్యకు పరిష్కారం కోసం మార్కెట్లో దొరికే క్రీమ్స్ అన్నీ వాడుతుంటారు. ఇంటి వద్ద దొరికే వాటితో చర్మాన్ని మృదువుగా మార్చుకోవచ్చు.**



- చర్మం తాజాగా ఉండడానికి కమలాఫలం, నారింజ, నిమ్మచెక్కల్ని పారేయకుండా ఎండబెట్టి పొడిచేయాలి. ఈ మిశ్రమాన్ని వారానికి రెండుసార్లు శనగపిండిలో కలిపి మోచేతులకు, మెడకు పూతలా వేసుకొని కడిగేయాలి. దీనివల్ల చర్మం తాజాగా మారుతుంది.
- రెండు స్పూన్ల పెరుగులో చిటికెడు పసుపు వేసుకొని బాగా కలిపి ముఖానికి, మెడకు రాసుకుంటే చర్మం అందంగా మారుతుంది.
- వాజిలిన్ కేవలం చర్మానికే కాదు కేశ సంరక్షణకూ పనిచేస్తుంది. ఓ గిన్నెలో వ్యాజిలిన్, విటమిన్ ఈ క్యాప్సుల్స్, కొబ్బరి నూనె వేసుకొని బాగా మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని మాడుకు పెట్టుకొని మసాజ్ చేయాలి. మరుసటి రోజు తలస్నానం చేయాలి. ఇలా చేస్తే జుట్టు బలంగా మారుతుంది. ఈ మిశ్రమాన్ని కనుబొమ్మలు, కనురెప్పలకు కూడా రాసుకోవచ్చు.
- రెండుస్పూన్ల టమాటా గుజ్జు తీసుకోవాలి. ఇందులో కాస్త తేనె కలపాలి. ముఖం, మెడని శుభ్రం చేసుకుని ముఖంపై రాయాలి. ఈ ప్యాక్ ఆరిన తర్వాత చల్లని నీటితో కడిగితే చర్మానికి తగిన తేమ అందుతుంది.
- కాసింత శనగపిండిని తీసుకొని అందులో టమాటా గుజ్జును కలపాలి. మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. ఇలా తయారైన ప్యాక్‌ను ముఖానికి పూతలా వేయాలి. ఆరిన తర్వాత నీళ్లు చల్లుకుంటూ స్క్రబ్‌లా చేస్తూ క్లీన్ చేయాలి. ఇలా చేయడం వల్ల ముఖం తాజాగా మారుతుంది.

## సిరిముగ్గు



28 చుక్కలు
8 వరుసలు
8 వచ్చేవరకు



వెన్నం సత్తమ్మ,
లొద్రూరు గ్రామం,
మహబూబాబాద్ జిల్లా

**ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:**
సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9,
కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నం-10, హైదరాబాద్ -500034.
zindagi.nt@gmail.com

II.
నమస్తే తెలంగాణ
సంపద
[ కరీంనగర్ ]
శనివారం 28 డిసెంబర్ 2019

# నయా నివాసాల జోరు..



| 2019లో జీహెచ్ఎంసీ పరిధిలో పెరిగిన కొత్త నివాస, వాణిజ్య భవనాలు | సుమారు కోటి చదరపు అడుగుల్లో సరికొత్త ఇండ్లు, అపార్టుమెంట్లు | జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్‌కు ఈ ఏడాది.. రూ.650 కోట్ల ఆదాయం | గతేడాదితో పోల్చితే దాదాపు రూ.150 కోట్లు అదనం |
|---|---|---|---|

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాల కారణంగా.. హైదరాబాద్‌లో నిర్మాణ రంగం ఊపందుకున్నది. గత కొంతకాలం నుంచి భాగ్యనగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ, పెరిగిన మెట్రో రైలు కనెక్టివిటీ, దేశవిదేశీ ఐటీ, ఫార్మా, బీపీవో వంటి సంస్థలు నగరంపై చూపెడుతున్న ఆసక్తి కారణంగా హైదరాబాద్‌లో వ్యక్తిగత గృహాలు, విల్లాలు, అపార్టుమెంట్లు, బహుళ అంతస్తులు, ఆకాశహర్మ్యాలు, వాణిజ్య సముదాయాలు, ఐటీ నిర్మాణాలు, షాపింగ్ మాళ్లు, మల్టీప్లెక్స్ థియేటర్లు వంటి వాటిని కట్టేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆసక్తి కలిగించే అంశం ఏమిటంటే.. ఒక్క ఈ ఏడాదిలో, అంటే డిసెంబరు 24 నాటికి, జీహెచ్ఎంసీ 236 వాణిజ్య సముదాయాలు, 16,565 నివాస భవనాలకు అనుమతుల్ని మంజూరు చేసింది. ఇందులో హెడ్డాఫీసు అనుమతించిన బహుళ అంతస్తుల వాణిజ్య భవనాలు 113 ఉండగా, 537 నివాస సముదాయాలున్నాయి. వీటి విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకుంటే, వాణిజ్య భవనాల విస్తీర్ణం దాదాపు 40 లక్షల చదరపు అడుగులుండగా.. నివాస భవనాలే సుమారు కోటి చ.అ.కి పైగా ఉండటం గమనార్హం. దీంతో, ఈ ఏడాదిలో కేవలం టౌన్ ప్లానింగ్ ద్వారా జీహెచ్ఎంసీకి లభించిన ఆదాయం సుమారు రూ.650 కోట్లు దాకా ఉంటుంది. గతేడాదితో పోల్చితే రూ.150 కోట్లు అదనంగా వచ్చిందని చెప్పొచ్చు.

### ఐదు అంతస్తుల్లోపు.. ఇక్కడే ఎక్కువ

స్టిల్ట్ ప్లస్ ఐదు అంతస్తులు లేదా 1000 చదరపు మీటర్లలోపు భవనాల్ని కట్టే వారికి జోన్ల స్థాయిలోనే జీహెచ్ఎంసీ అనుమతినిస్తుంది. ఈ ఏడాదిలోనే.. శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం 38 వాణిజ్య, 423 నివాస సముదాయాలకు అనుమతినిచ్చింది. ఇందులో అపార్టుమెంట్లు, చిన్న సైజు వాణిజ్య భవనాలు వంటివి ఎక్కువగా ఉన్నాయి. ఆతర్వాతి స్థానాన్ని ఎల్బీనగర్ దక్కించుకున్నది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇక్కడ 25 వాణిజ్య, 342 నివాస సముదాయాలకు అనుమతినిచ్చింది. ఎల్బీనగర్‌కు మెట్రో రైలు కనెక్టివిటీ పెరగడం, ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు కొత్తగా ఫ్లైఓవర్, అండర్ పాస్ బ్రిడ్జిలను నిర్మించడం వంటి అంశాల వల్ల ఒక్కసారిగా ఇక్కడి నిర్మాణ రంగానికి ఊపొచ్చింది. అందుకే, ఎల్బీనగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో స్టాండ్ ఎలోన్ అపార్టుమెంట్లను కట్టే బిల్డర్ల సంఖ్య అధికమైంది. కూకట్‌పల్లి 10 వాణిజ్య, 317 నివాస సముదాయాలు.. సికింద్రాబాద్ 7 వాణిజ్య, 121 నివాస భవనాలు.. ఖైరతాబాద్ 3 వాణిజ్య, 37 నివాస భవనాలకు స్థానిక సర్కిళ్లు అనుమతినిచ్చాయి. హైటెక్ సిటీ, మాదాపూర్ వంటివి చేరువగా ఉండటం వల్ల కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో అపార్టుమెంట్లను నిర్మించే బిల్డర్ల సంఖ్య పెరిగింది. నేటికీ, ఈ సర్కిల్ పరిధిలో ఫ్లాట్లు వేడిపకోడిల్లా అమ్ముడవుతున్నాయి. నిర్మాణ దశలోనే అధిక శాతం మంది ఫ్లాట్లను కొనుగోలు చేస్తుండటం విశేషం.

### హయత్ నగర్ టాప్

జీహెచ్ఎంసీ పరిధిలో స్టిల్ట్ ప్లస్ మూడు అంతస్తుల్లోపు నిర్మాణాలకు సర్కిళ్ల వారీగానే అనుమతి లభిస్తుంది. ఇలా చూస్తే ఈ ఒక్క ఏడాదిలోనే దాదాపు 2,380 ఇండ్లు, భవనాల్ని కట్టడానికి హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయం అనుమతినిచ్చింది. ఎల్బీనగర్, నాగోలు మెట్రో స్టేషన్లు అందుబాటులోకి రావడం.. ఔటర్ రింగ్ రోడ్డు, తాగునీటి సదుపాయం వంటి మౌలిక సదుపాయాలు మెరుగు అవ్వడం వంటి అంశాల కారణంగా వ్యక్తిగతంగా ఇండ్లు కట్టుకునేవారి సంఖ్య ఈ ఏడాదిలో పెరిగింది. అయితే రెండు చిన్న చిన్న ప్లాట్లకు విడివిడిగా అనుమతి తీసుకుని, వాటిని జోడించి అపార్టుమెంటుగా కట్టే బిల్డర్లు ఎక్కువే ఉన్నారని అధికారులు గుర్తించారు. ఆ తర్వాత స్థానాన్ని అల్వాల్ దక్కించుకున్నది. 1,511 ఇండ్లకు అనుమతినిచ్చింది. మూడో స్థానంలో కాప్రా నిలిచింది. ఇది సుమారు 1,429 ఇండ్లు, భవనాలకు అనుమతిని మంజూరు చేసింది. మల్కాజిగిరి 869, ఎల్బీనగర్ 844, శేరిలింగంపల్లి 800, రాజేంద్రనగర్ 768 ఇండ్లకు అనుమతినివ్వడం గమనార్హం.

## మార్కెట్ స్థిరం.. మనకు వరం

**అలేఖ్య హోమ్స్ డైరెక్టర్ కుర్రా మహేష్**

జాతీయ, అంతర్జాతీయ నిర్మాణ సంస్థలు హైదరాబాద్ వైపు దృష్టి సారిస్తున్నాయంటే.. ఇక్కడి మార్కెట్ ఎంత స్థిరంగా ఉన్నదో అర్థం చేసుకోవాలని అలేఖ్య హోమ్స్ డైరెక్టర్ కుర్రా మహేష్ అభిప్రాయపడ్డారు. నార్సింగిలో కొత్త ప్రాజెక్టును ప్రారంభిస్తున్న సందర్భంగా 'సంపద'తో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఎలాంటి ఆటుపోట్లు అయినా తట్టుకుని నిలబడగలిగే సత్తా భాగ్యనగర రియల్ రంగానికి ఉన్నదని, అందుకే సుస్థిరత వైపు పరుగులు పెడుతుందన్నారు. ఇక్కడ పెట్టుబడి పెట్టిన ఏ ఒక్క ఇన్వెస్టరూ నష్టపోలేదని, ప్రతిఒక్కరూ లాభాల్ని అందుకున్న వారేనని వివరించారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే..



''ప్రభుత్వ సులభతరమైన విధానాలే రియల్ రంగంలో సానుకూలత నెలకొనడానికి ప్రధాన కారణం. మేం మొదట్నుంచి విభిన్నమైన నిర్మాణాల్ని చేపట్టాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. హరితహారం స్ఫూర్తితో ప్రకృతి ఒడిలో సేద తీరాలని కోరుకునేవారికి నప్పేలా ప్రాజెక్టుల్ని చేపడుతున్నాం. గత 18 ఏండ్లలో 75 ప్రాజెక్టుల్ని పూర్తి చేశాం. ఇందులో దాదాపు పది వేలకు పైగా మొక్కల్ని నాటాం. 'బ్రాండింగ్ త్రూ సర్వీస్' అనే కాన్సెప్టుకు శ్రీకారం చుట్టాం. పూర్తి చేసిన ప్రతి నిర్మాణంలో నేటికీ నిర్వహణను చేపడుతున్నాం. అలేఖ్య విండ్‌షైమ్స్ ప్రాజెక్టుకు ఐజీబీసీ గోల్డ్ రేటింగ్ అవార్డును అందుకున్నాం. ఇందులో 108 రకాల అరుదైన వృక్షజాతులకు స్థానం కల్పించాం. ఏదైనా ఒక ప్రాంతంలో అపార్టుమెంట్ కట్టామా.. అక్కడ్నుంచి వెళ్లిపోయామా.. అన్నట్టు కాకుండా.. అక్కడి చుట్టుపక్కల ప్రాంతాల్లో గల పార్కులను 'అలేఖ్య టీమ్' ద్వారా అభివృద్ధి చేస్తున్నాం. నానక్‌రాంగూడలోని ఎమ్మార్ గోల్ఫ్ కోర్సుకు ఎదురుగా 'అలేఖ్య పామ్ వుడ్స్' ప్రాజెక్టును పూర్తి చేశాం. ఆ రోడ్డుకే తలమానికంగా ఉండే విధంగా తీర్చిదిద్దాం. 'వుడ్‌రోజ్' అనే మరో నిర్మాణాన్ని అందజేశాం.

- నార్సింగిలోని కోకాపేట్ ప్రవేశ మార్గంలో 9 ఎకరాల్లో 30 అంతస్తుల ప్రాజెక్టును ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నాం. రిసార్టు తరహా జీవనాన్ని కోరుకునే వారికి 500 యూనిట్లను అభివృద్ధి చేయాలన్న బృహత్ ప్రణాళికను రచిస్తున్నాం. పర్యావరణాన్ని పూర్తి స్థాయిలో కాపాడాలన్నదే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యం.''

### 2019లో మనమెక్కడ?

- 2019లో భారత రియల్ రంగం ఆకర్షించిన విదేశీ పెట్టుబడులు రూ.43,780 కోట్లు
- గతేడాదితో పోల్చితే ఇది తొమ్మిది శాతం ఎక్కువ
- ఇందులో 20 శాతం వాటా ఆఫీసు సముదాయాలదే
- విదేశీ కంపెనీలు సుమారు రూ.20,000 కోట్లు మన ఆఫీసు స్థలాల్లో పెట్టుబడుల్ని పెట్టాయి
- హైదరాబాద్‌లో నిర్మాణంలో ఉన్న ఆఫీసు స్థలాన్ని కొనడానికి అనేక సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి.
- 2020-2023 మధ్యలో ఏడు నగరాల్లో గరిష్ఠంగా 5.2 మిలియన్ చదరపు అడుగుల స్థలాన్ని పలు సంస్థలు తీసుకుంటాయి.

## సమగ్ర పార్కింగ్ విధానం లేదా?

పార్కింగు కేటాయింపు చట్టాలు, ఛార్జీలపై సరైన అవగాహన లేకపోవడంతో బిల్డర్లు, నివాసితుల మధ్య వివాదానికి దారితీస్తుంది. ఈ పరిస్థితి బిల్డర్లు, కొనుగోలుదారుల మధ్యనే కాకుండా నివాసితుల మధ్య కూడా వివాదాలకు కారణమవుతుంది. బిల్డర్లు, ప్రమోటర్లు పార్కింగ్ ప్రాంతాలను ఫ్లాట్లుగా విక్రయించలేరని నహల్‌చంద్ లాలూచంద్ ప్రైవేట్ లిమిటెడ్ వర్సస్ పంచాలి కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ కేసులో సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. పార్కింగ్ ఏరియాల్ని కూడా కామన్ ఏరియా సౌకర్యాల్లో భాగంగానే గుర్తించాలని సూచించింది. ఫ్లాటు కార్పెట్ ప్రాంతానికి అనుగుణంగా ప్రతి ఫ్లాటు యజమాని నుంచి సాధారణ ప్రాంతాలు, సౌకర్యాల కోసం ధరను వసూలు చేయడానికి మాత్రమే డెవలపర్‌కు అర్హత ఉందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అయినప్పటికీ అది అమలు కావడం లేదు. ఓపెన్ పార్కింగ్, బేస్మెంట్లను కూడా కామన్ ఏరియాలుగా పరిగణించాలని రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ చట్టం 2016 కూడా తెలుపుతుంది. బిల్డర్ల నుంచి ఫ్లాట్లను స్వాధీనం చేసుకున్నాక సాధారణ ప్రాంతాలను నిర్వహించాల్సిన బాధ్యత నివాసితులపైనే ఉంటుంది. ప్రస్తుతం హై రైజ్ సొసైటీల్లో పార్కింగ్ స్థలానికి సంబంధించిన సమగ్ర విధానం లేదు. రియాల్టీ చట్టం బహిరంగ ప్రదేశాలను సాధారణ ప్రాంతాలుగా పరిగణిస్తుంది. అయితే సమగ్ర పార్కింగ్ విధానం లేనప్పుడు పార్కింగ్ స్థలాన్ని కేటాయించడంపై నిర్దిష్టమైన చర్యలు తీసుకోవడం కష్టమని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం చాలా మంది బిల్డర్లు 'ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్' ప్రాతిపదికన పార్కింగ్‌ను కేటాయిస్తున్నారు. అయితే ఛార్జీలు ఎలా నిర్ణయించాలో ప్రభుత్వం నుంచి స్పష్టత లేనందున బిల్డర్లు అధిక ధరలకు పార్కింగ్ స్థలాలను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. బిల్డరు ప్రాజెక్టును పూర్తి చేసి నివాసితులకు అప్పగించడం ప్రాథమిక నియమం. నివాసితులు బైలాస్ తయారు చేసుకుని దానికనుగుణంగా నిర్వహణ చేసుకుంటారు. కానీ పార్కింగ్ కేటాయింపు, పార్కింగ్ ఛార్జీలపై చట్టబద్ధమైన నియమాలు లేనందున బిల్డర్లు ఈ లొసుగును వాడుకుంటున్నారు. పార్కింగ్ కేటాయింపులు, సాధారణ ప్రాంతాలకు సంబంధించిన అంశాలపై న్యాయస్థానాల్లో అనేక వ్యాజ్యాలు నమోదవుతుండటంతో నివాసితులకు తగిన పార్కింగ్ స్థలాలను అందించాలని సుప్రీంకోర్టు, హైకోర్టులు ఇప్పటికే అధికారులను ఆదేశించాయి.

# హైదరాబాద్ ఈజ్ బెస్ట్..



దేశంలోని ఏ నగరాన్ని చూసినా.. రియల్ రంగం కుదేలవుతున్నది. అమ్మకాలు దారుణంగా దెబ్బతిన్నాయి. అనేక ప్రాజెక్టులు మధ్యలో నిలిచిపోయాయి. అందులో కొన్నవారు సకాలంలో ఫ్లాట్లు చేతికి అందక గగ్గోలు పెడుతున్నారు. ఏం చేయాలో అర్థం కాక అక్కడి డెవలపర్లు తలపట్టుకుంటున్నారు. కానీ, ఇందుకు భిన్నంగా ఉంది హైదరాబాద్ పరిస్థితి. రెండేండ్ల నుంచి దేశీయ నిర్మాణ రంగం గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నా.. నగరాభివృద్ధిలో భాగ్యనగరం దూసుకెళుతున్నది. సమర్థ నాయకత్వం, పెట్టుబడుల్ని ప్రోత్సహించే వాతావరణం, సానుకూల విధానాలు, కళ్ల ముందే కనిపిస్తున్న మౌలిక అభివృద్ధి వంటి అంశాలు ప్రధాన కారణాలని జాతీయ సంస్థల సర్వేలు చెబుతున్నాయి. ఇక్కడికొచ్చే విదేశీ ప్రతినిధులూ అభిప్రాయపడుతున్నారు.

మొన్నటికి మొన్న.. కెనడా నుంచి ఒక మంత్రి తెలంగాణకు విచ్చేశారు. ఆతర్వాత, ఇతర రాష్ర్టాల్లోనూ పర్యటించారు. అక్కడి ప్రభుత్వాలతో చర్చించారు. చివరికీ ఆయన తేల్చిందేమిటంటే.. హైదరాబాదే ఉత్తమం అని కితాబునిచ్చారు. భారతదేశంలో పెట్టుబడుల్ని పెట్టాల్సి వస్తే.. తెలంగాణ రాష్ట్రంలోనే పెడతానని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా రియల్ రంగాన్ని గమనిస్తే.. హైదరాబాద్ మెరుగ్గా ఉందని 'లియసెస్ ఫోరస్' తాజా అధ్యయనంలో తేల్చింది. పెట్టుబడిదారులు, సంస్థాగత ఇన్వెస్టర్లు, ఐటీ సంస్థలు, ప్రైవేటు ఈక్విటీ కంపెనీలు, రీట్లు.. ఇలా ప్రతిఒక్కరూ 'హైదరాబాద్ ఈజ్ బెస్ట్' అంటున్నారు. 2019లో ఇండ్ల అమ్మకాలు 10 శాతం పెరిగాయని లియసెస్ ఫోరస్ సంస్థ వెల్లడించింది.

### అధ్యయన సంస్థలు స్పష్టతనివ్వాలి..

అమ్ముకుండా మిగిలిపోయిన ఫ్లాట్ల విషయంలో నేటికీ స్పష్టత లేదు. రియల్ ఎస్టేట్ రంగాన్ని అధ్యయనం చేసే సంస్థలు ఇక నుంచి దీన్ని సరైన రీతిలో నిర్వచిస్తే బాగుంటుంది. కొన్ని సంస్థలు గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులను బ్లాకుల వారీగా చేపడతాయి. ఉదాహరణకు, పశ్చిమ హైదరాబాద్‌లో ఒక సంస్థ నాలుగు బ్లాకుల్లో 500 ఫ్లాట్లను నిర్మిస్తుందని అనుకుందాం. మొదట 'ఏ' బ్లాకును నిర్మించాక.. మిగతా మూడు బ్లాకులు అసలు నిర్మాణమే ప్రారంభించకపోతే.. అవి అమ్ముడుకాని ఫ్లాట్లు ఎలా అవుతాయి? కాబట్టి, ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యాక, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వచ్చాక కూడా ఫ్లాట్లు అమ్ముడవ్వకపోతే.. వాటిని అమ్ముడు కాని ఫ్లాట్లుగా పరిగణనలోకి తీసుకోవాలి.

**- సి.శేఖర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు, క్రెడాయ్ నేషనల్**

### మన వద్ద అధికం

కొత్త ప్రాజెక్టుల ఆవిష్కరణలో భాగ్యనగరమే దేశవ్యాప్తంగా ముందంజలో ఉండటం గమనార్హం. ఇక్కడ 117 శాతం కొత్త ప్రాజెక్టులు ప్రారంభం కావడం ఆహ్వానించదగ్గ పరిణామమని చెప్పొచ్చు. ఇక, ఇండ్ల ధరల విషయానికొస్తే.. గత త్రైమాసికంలో సుమారు ఐదు శాతం పెరగ్గా.. ఏడాది మొత్తం చూస్తే దాదాపు పంతొమ్మిది శాతం రేట్లు పెరిగాయి.

### హాట్‌కేకుల్లా అమ్మకాలు..

2019లో హైదరాబాద్ రియల్ రంగం మెరుగ్గా ఉన్నది. ఏడాది ఆరంభం నుంచి బాగున్నది. వాణిజ్య సముదాయాల్లో స్థలాన్ని తీసుకునేవారి సంఖ్య అధికమవుతున్నది. భూముల ధరలు పెరగడంతో అమ్ముడు కాని ఫ్లాట్లు హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. కొత్త వెంచర్లు, కొత్త కాన్సెప్టుతో కూడుకున్న ప్రాజెక్టులు వచ్చాయి. అందుబాటు గృహాలపై అధిక ఆదరణ పెరుగుతున్నది. విల్లా తరహాలో ఫ్లాట్లను కోరుకునేవారి సంఖ్య అధికమవుతున్నది. ప్రత్యేక ప్రాజెక్టులు హైదరాబాద్‌లో అధిక శాతం వస్తున్నాయి. ఆఫీసు స్థలానికీ గిరాకీ గణనీయంగా పెరిగింది. పశ్చిమ హైదరాబాద్‌లో కొన్ని కొత్త ప్రాజెక్టుల్లో, మూడు పడక గదుల ఫ్లాట్లలో ఇంటి అద్దెలు దాదాపు నలభై నుంచి రూ.యాభై వేలకు పైగా పలుకుతున్నది.

**- వి.రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి, క్రెడాయ్ హైదరాబాద్**

### దేశీయ దిగ్గజాలు నగరానికి..

ఇతర మెట్రో నగరాల సంస్థలు భాగ్యనగరంలో నిర్మాణ ప్రాజెక్టులను ప్రారంభించాయి. శోభా డెవలపర్స్, కల్పతరు, ప్రెస్టీజ్, సాలార్‌పురియా, పసిఫికా, సుమధుర, ప్రావిడెంట్, టోటల్ ఎన్విరాన్‌మెంట్ వంటివి తమ కొత్త ప్రాజెక్టుల కోసం నగరాన్ని ఎంచుకున్నాయి. గచ్చిబౌలి ఔటర్ రింగ్ రోడ్డు నుంచి అప్పా జంక్షన్ వరకు ఇరువైపుల గల సర్వీస్ రోడ్ల మీద బడా గేటెడ్ విల్లా కమ్యూనిటీలు, ఆకాశహర్మ్యాలను నిర్మించే సంస్థలు పెరిగాయి. నగరంలో పేరెన్నికగల నిర్మాణ సంస్థలైన మై హోమ్, అపర్ణా, ఎన్సీసీ అర్బన్, వర్టెక్స్ హోమ్స్, అశోకా బిల్డర్స్, రాజపుష్ప ప్రాపర్టీస్ వంటివి ఇప్పటికే తమ కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాయి. దాదాపు అన్ని సంస్థలు నిర్మాణ పనుల్ని వేగంగా జరుపుతున్నాయి.

### నేడే క్రియేట్ రియాల్టీ అవార్డులు


క్రెడాయ్ తెలంగాణ ఆరంభించిన సెకెండ్ ఎడిషన్ క్రియేట్ అవార్డుల ప్రదానోత్సవం నేడు జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్నది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హరీష్ రావు హాజరవుతారు. రహదారులు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విశిష్ఠ అతిథిగా పాల్గొంటారు. తెలంగాణలోని పదకొండు నగరాలకు చెందిన 103 మంది క్రెడాయ్ డెవలపర్లు, 2017 నవంబరు 1 నుంచి 2019 నవంబరు 30లోపు పూర్తి చేసిన ప్రాజెక్టుల్లో అత్యుత్తమైన వాటిని ఎంపిక చేసి అవార్డులను అందజేస్తారు. ఎంపిక ప్రక్రియను పూర్తి స్థాయి పారదర్శకంగా చేపట్టామని ఇప్పటికే క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షుడు చెరుకు రామచంద్రారెడ్డి ప్రకటించారు. ప్రాజెక్టుల్ని మూడు దశల్లో పరిశీలించిన అనంతరం జ్యూరీ సభ్యులు అవార్డుల్ని ప్రకటిస్తారని చెప్పారు. శనివారం సాయంత్రం అట్టహాసంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చైర్మన్ గుమ్మి రాంరెడ్డి తెలిపారు.







## నష్ట పరిహారం.. రూ.2 కోట్లు




దశాబ్ద కాలం గడిచినా వినియోగదారులకు ఫ్లాటు అందించకపోవడంతో ఆ డెవలపర్ రూ.2 కోట్ల నష్ట పరిహారం చెల్లించాల్సి వచ్చింది. 2008 సంవత్సరంలో ఓ డెవలపర్ అభివృద్ధి చేస్తున్న ప్రాజెక్టులో రూ.60 లక్షలు చెల్లించి వినియోగదారుడు ఫ్లాటు కొనుగోలు చేశారు. కానీ ఏండ్లు గడిచినా ఫ్లాటు మాత్రం పూర్తి చేసి వినియోగదారునికి అప్పగించలేదు. దీంతో బాధిత వినియోగదారుడు చివరికీ జాతీయ వినియోదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఫ్లాటు కేటాయించిన తేదీ నుంచి 30 నెలల్లో తమకు స్వాధీనం చేస్తామని డెవలపర్ హామీ ఇచ్చినట్టు వినియోగదారుల కమిషన్‌కు వివరించారు. విచారించిన కమిషన్ వినియోగదారుడు చెల్లించిన రూ.60 లక్షలతోపాటు రూ.1.40 కోట్లు కలిపి మొత్తం రూ.2 కోట్లు పరిహారంగా తిరిగి వినియోగదారుడికి చెల్లించాలని నిర్మాణ సంస్థను ఆదేశించింది. వీరితోపాటు అదే ప్రాజెక్టులో రూ.30 లక్షల చెల్లించి ఫ్లాటు కొనుగోలు చేసిన మరొక వినియోగదారునికి కూడా సమయానికి ఫ్లాటు అందించని కారణంగా వారికి రూ.70 లక్షల పరిహారం చెల్లించాలని సూచించింది. ఫిర్యాదుదారులకు వెంటనే పరిహారం చెల్లించాలని డెవలపర్‌ను ఆదేశించింది. 2008లో ఫ్లాట్లకు సంబంధించిన సొమ్మును స్వీకరించి ఫ్లాట్లను ఎందుకు వినియోగదారులకు స్వాధీన పర్చలేదని ప్రశ్నించింది. దీనిపై డెవలపర్ వివరణ ఇస్తూ వివాదాల కారణంగా నిర్ణీత సమయంలో ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోయామని తెలిపారు. వినియోగదారులకు ఫ్లాట్లు కేటాయించిన తేదీ నుంచి వారు చెల్లించిన మొత్తానికి 18 శాతం వడ్డీతో పరిహారం చెల్లించాలని జాతీయ వినియోదారుల కమిషన్ డెవలపర్‌కు సూచించింది. సమయానికి ఫ్లాట్లు స్వాధీనం చేయనందుకుగానూ రూ.2 కోట్ల పరిహారం చెల్లించిన ఈ ఘటన ముంబైలో చోటు చేసుకుంది.

## మరణశిక్షను కోర్టులో సవాల్‌చేసిన ముషారఫ్



**ఇస్లామాబాద్, డిసెంబర్ 27:** రాజద్రోహం నేరం కింద మరణశిక్ష విధిస్తూ గత వారం ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పాకిస్థాన్ మాజీ సైన్యాధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్ శుక్రవారం పిటిషన్ దాఖలు చేసినట్టు మీడియావర్గాలు తెలిపాయి. తీర్పును సవాల్ చేస్తూ ముషారఫ్ తరఫున న్యాయవాది అజార్ సిద్దిఖి లాహోర్ హైకోర్టులో 86 పేజీల పిటిషన్‌ను దాఖలు చేశారు. ఇందులో ప్రభుత్వాన్ని, ఇతరులను ప్రతివాదులుగా చేర్చారు. తీర్పు క్రమరాహిత్యంగా, విరుద్ధ ప్రకటనల మిశ్రమంగా ఉన్నదని పేర్కొన్నారు. విచారణను వేగంగా, తొందరపాటుతో జరిపారని చెప్పారు. జాతీయ ప్రయోజనాలకు హాని కలిగించే ఎటువంటి చర్యలను ముషారఫ్ తీసుకోలేదని పేర్కొన్నారు. న్యాయస్థానానికి సమర్పించిన సాక్ష్యాల్లో సైతం అతనిపై రాజద్రోహం నేరం లేదని అన్నారు. జస్టిస్ మజాహిల్ అలీఅక్బర్ నఖ్వీ నేతృత్వంలోని ధర్మాసనం జనవరి 9న ఈ పిటిషన్‌పై వాదనలను విననున్నది. అనారోగ్యంతో దుబాయిలో చికిత్స పొందుతున్న ముషారఫ్.. ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును రద్దుచేయాలని హైకోర్టుకు విజ్ఞప్తిచేశారు.

## చిన్నారిని చిదిమేసిన దోషికి మరణశిక్ష

- పోక్సో కోర్టు విధించిన శిక్షను సమర్థించిన గుజరాత్ హైకోర్టు

**అహ్మదాబాద్, డిసెంబర్ 27:** గుజరాత్‌లో మూడేండ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడి హత్య చేసిన ఘటనలో నిందితుడికి ఆ రాష్ట్ర హైకోర్టు మరణశిక్ష విధించింది. బీహార్‌కు చెందిన అనిల్ యాదవ్ అనే వ్యక్తి గుజరాత్‌లోని సూరత్‌కు వలస వచ్చి కార్మికుడిగా జీవనం సాగించేవాడు. ఓ అపార్టుమెంట్‌లోని ఓ గదిలో నివసించే అనిల్ యాదవ్.. అదే అపార్టుమెంట్‌లో ఉండే ఓ కుటుంబానికి చెందిన మూడేండ్ల బాలికపై 2018 అక్టోబర్‌లో లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను హత్య చేసి తన గదిలో మృతదేహాన్ని ఉంచి బయటి నుంచి తాళం వేసి పరారయ్యాడు. బాలిక కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనిల్ యాదవ్ గదిలో మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు అతడి కోసం గాలింపు చేపట్టారు. చివరికి అతడిని బీహార్‌లోని బక్సర్ జిల్లాలో ఉన్న అతడి సొంతూరులో అరెస్టు చేశారు. అతడిపై లైంగికదాడి, హత్య కేసును నమోదు చేసి సూరత్‌లోని పోక్సో కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టు అతడికి మరణశిక్ష విధించింది. ఈ శిక్షను సవాల్ చేస్తూ అనిల్ యాదవ్ గుజరాత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం పోక్సో కోర్టు విధించిన మరణశిక్షను సమర్థించింది.






## ఈ ఏడాది అబద్ధాల వ్యక్తి రాహుల్

- కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ ఎద్దేవా



**న్యూఢిల్లీ, డిసెంబర్ 27:** జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) అనేది పేదలపై విధించే పన్నులాంటిదని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పేర్కొనడంపై బీజేపీ మండిపడింది. నిత్యం అబద్ధాలు చెప్పే రాహుల్‌గాంధీ 'ఈ ఏడాది అబద్ధాలపు వ్యక్తి'గా నిలిచారని విమర్శించింది. బీజేపీ నేత, కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ దేశంలో అస్థిరతను సృష్టించడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. ఆ పార్టీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు ప్రభుత్వం వెంటే ఉన్నారని, ఇటీవల తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం విషయంలోనూ ప్రజలు ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారని చెప్పారు. ఎన్పీఆర్ సమాచారం అనేది దేశంలో పేదలను గుర్తించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని, తద్వారా ప్రభుత్వ పథకాలను నిర్దేశిత లబ్ధిదారులకు చేర్చడానికి మార్గం మరింత సులభం అవుతుందని తెలిపారు. ఇలాంటి ఎన్పీఆర్ ప్రక్రియను 2010లోనూ (యూపీఏ హయాంలో) చేపట్టారని గుర్తుచేశారు. కానీ వీటన్నింటినీ పట్టించుకోకుండా కాంగ్రెస్ పార్టీ అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నదని మండిపడ్డారు. 'రాహుల్‌గాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు నిత్యం అబద్ధాలు చెప్పేవారు. ఇప్పుడు అధ్యక్ష పదవి లేకపోయినా అబద్ధాలు చెప్పడం మాత్రం మానలేదు. ఆయన చెప్పే అబద్ధాల వల్ల ఆయన పార్టీ, ఆయన కుటుంబం, చివరికి ఈ దేశం కూడా ఇబ్బందులపాలవుతున్నది. పర్సన్ ఆఫ్‌ది ఇయర్ (ఈయేటి మేటి వ్యక్తి)లాగా ఈ ఏడాది అబద్ధాల వ్యక్తి అనేది కూడా ఉండిఉంటే అది కచ్చితంగా రాహుల్‌గాంధీకే దక్కేది' అని జవదేకర్ ఎద్దేవా చేశారు.

# ప్రధానిగా మోదీ విఫలం

- దేశ సంపదను 10-15 మందికి దోచిపెడుతున్నారు
- ప్రజల మధ్య చిచ్చుపెట్టి సాధించేది శూన్యం
- ఎన్నార్సీ, ఎన్పీఆర్.. పేదలపై పన్నుల వంటివి
- కేంద్రంపై రాహుల్‌గాంధీ విమర్శలు


రాయ్‌పూర్‌లో 'నేషనల్ ట్రైబల్ డాన్స్ ఫెస్టివల్'లో గిరిజన వేషధారణలో డోలు వాయిస్తున్న రాహుల్

**రాయ్‌పూర్, డిసెంబర్ 27:** ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ తన బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలం అయ్యారని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ), జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) రూపంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టి ఏమీ సాధించలేరని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేయకుంటే దేశాన్ని నడుపడం సాధ్యం కాదని చెప్పారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో 'నేషనల్ ట్రైబల్ డాన్స్ ఫెస్టివల్-2019' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మూడు రోజుల కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సమావేశానికి రాహుల్‌గాంధీ హాజరై.. గిరిజన వేషధారణలో, డోలు వాయిస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. 'దేశంలో రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగం, ఆర్థిక మందగమనం వంటి ఎన్నో సమస్యలు ఉన్నాయి. అదే సమయంలో సీఏఏ, ఎన్నార్సీపై ఏం జరుగుతున్నదో అందరికీ తెలుసు. మీరు (కేంద్రం) ఏం చేయాలనుకుంటున్నారో అది చేయండి. కానీ.. ప్రతి మతం, కులానికి చెందిన ప్రజల భాగస్వామ్యం తీసుకోకుండా, వారందరినీ సంఘటితం చేయకుండా దేశాన్ని నడుపడం సాధ్యం కాదు' అని స్పష్టం చేశారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టి విభజించడం ద్వారా ఏమీ సాధించలేరని చెప్పారు. మోదీ ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దు ద్వారా, నీతినియమాలు లేని జీఎస్టీని ప్రవేశపెట్టడం వంటి చర్యల ద్వారా దేశ సంపద మొత్తాన్ని 10-15 మందికి దోచిపెట్టినంత కాలం ఉద్యోగాల సృష్టి జరుగదని, దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠం కాదని రాహుల్ పేర్కొన్నారు. ఎన్నార్సీ, ఎన్పీఆర్‌లను పేదలపై వేసే పన్నులుగా ఆయన అభివర్ణించారు. పెద్ద నోట్ల రద్దు వల్ల పేద ప్రజలు ఆర్థికంగా నలిగిపోయారని, ఎన్నార్సీ, అమలుచేస్తే పేద ప్రజలపై మరింత ఆర్థిక భారం పడటం ఖాయమని చెప్పారు. 'ఎన్పీఆర్, ఎన్నార్సీలో భాగంగా పేదలు అధికారుల దగ్గరికి వెళ్లి ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అందులో చిన్న తప్పు దొర్లినా వాటిని సవరించుకునేందుకు అధికారులకు లంచం ఇచ్చుకోవాల్సి వస్తుంది. ఇలా కోట్లాది రూపాయలు పేదల జేబుల్లో నుంచి ఆవిరవుతాయి. ఇది కచ్చితంగా ప్రజలపై ఆర్థిక దాడే' అని పేర్కొన్నారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత పేదలు, రైతుల దగ్గర ఉన్న డబ్బు దోపిడీకి గురైందని, అదే సమయంలో 10-15 మంది వ్యక్తులకు రూ.3.50 లక్షల కోట్ల లబ్ధి చేకూరిందని చెప్పారు. దేశంలో హింస పెరిగిపోతున్నదని, మహిళలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదని, నిరుద్యోగశాతం 45 ఏండ్ల గరిష్ఠానికి చేరిందని ప్రపంచం మొత్తం మాట్లాడుకుంటున్నదని అన్నారు. అయినా దేశంలో ఏం జరిగిందో, ఎలా జరిగిందో ప్రధాని మోదీ అర్థం చేసుకోవడం లేదని విమర్శించారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోయిందని, ఫలితంగా కంపెనీలు మూతపడుతున్నాయని చెప్పారు. ప్రధానిగా మోదీ విఫలమయ్యారని, దేశం యొక్క విలువైన సమయం వృథా అవుతున్నదని ఆరోపించారు. గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఉత్సవాన్ని నిర్వహిస్తున్న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని రాహుల్ ప్రశంసించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల బాగోగులను పట్టించుకుంటున్నదని, ఫలితంగా మావోయిస్టుల ప్రభావం తగ్గిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 32 శాతం మంది గిరిజనులు ఉన్నారని, వారి సంస్కృతిని పరిరక్షిస్తామని ఆ రాష్ట్ర సీఎం భూపేశ్ భగేల్ తెలిపారు.

### నేడు దేశవ్యాప్తంగా సీఏఏ వ్యతిరేక ర్యాలీలు

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ 134వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం దేశవ్యాప్తంగా పౌరసత్వ సవరణ చట్ట (సీఏఏ) వ్యతిరేక సభలు, ర్యాలీలు తీయనున్నది. 'రాజ్యాంగాన్ని రక్షించండి-దేశాన్ని కాపాడండి' పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పార్టీ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీ ఢిల్లీలోని ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. పార్టీ నేత రాహుల్‌గాంధీ అసోంలోని గువాహటిలో జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారు. ప్రధానంగా సీఏఏతోపాటు కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఆయన ప్రస్తావించనున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగే సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. మిగతా రాష్ట్రాల రాజధానుల్లో పీసీసీ అధ్యక్షుల ఆధ్వర్యంలో ర్యాలీలు జరుగుతాయని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఇజ్రాయెల్ ప్రధాని బరిలో నెతన్యాహు!

- ప్రధాని పదవికి లికుడ్ పార్టీ అభ్యర్థిగా ఘన విజయం
- మార్చి 2న ఇజ్రాయెల్ పార్లమెంట్ ఎన్నికలు



**జెరూసలేం, డిసెంబర్ 27:** అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు భారీ ఉపశమనం లభించింది. వచ్చే ఏడాది మార్చి రెండో తేదీన జరుగనున్న సాధారణ ఎన్నికల్లో అధికార లికుడ్ పార్టీ తరఫున ప్రధాని అభ్యర్థిగా బెంజమిన్ నెతన్యాహు బరిలోకి దిగనున్నారు. ప్రధాని అభ్యర్థిత్వం కోసం లికుడ్ పార్టీలో జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో నెతన్యాహు 72.5 శాతం ఓట్లతో తన ప్రత్యర్థి గిడౌన్ సార్‌పై విజయం సాధించారు. గురువారం జరిగిన లికుడ్ పార్టీ ప్రైమరీ ఎన్నికల్లో సుమారు 57 వేల మంది పార్టీ (50 శాతానికి పైగా) సభ్యులు ఓటేశారు. దేశ ప్రజల్లో అత్యధికులు ప్రభుత్వానికి తాను సారథ్యం వహించాలని కోరుకుంటున్నారని నెతన్యాహు శుక్రవారం విజయం అనంతరం మీడియాతో అన్నారు. ఇజ్రాయెల్ కోసం తనకు మద్దతు తెలిపినందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్, సెప్టెంబర్ నెలల్లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో లికుడ్ పార్టీ, బ్లూ అండ్ వైట్ పార్టీ నువ్వా? నేనా? అన్నట్లు పోటీ పడ్డా ఆ రెండు పార్టీలకు స్పష్టమైన మెజారిటీ రాలేదు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది మార్చిలో తిరిగి పార్లమెంట్‌కు ఎన్నికలు జరుగనున్నాయి. ఏడాది వ్యవధిలోపు ఎన్నికలు జరుగటం మూడోసారి. ఇజ్రాయెల్ పార్లమెంట్‌కు ధామాషా పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయి.


వరంగల్‌రూరల్ జిల్లా రాయపర్తి ఎస్బీఐలో సీసీకెమెరాల పుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు

## ఎస్బీఐలో చోరీకి విఫలయత్నం

- వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తిలో ఘటన

**రాయపర్తి:** వరంగల్‌రూరల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో చోరీచేసేందుకు గుర్తుతెలియని వ్యక్తులు విఫలయత్నం చేసిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున వెలుగులోకి వచ్చింది. వర్ధన్నపేట సీఐ విశ్వేశ్వర్, స్థానిక ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు నేతృత్వంలో పోలీసు బలగాలు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ విశ్వేశ్వర్ మాట్లాడుతూ గుర్తుతెలియని దుండగులు శుక్రవారం తెల్లవారుజామున 4:52 గంటల సమయంలో బ్యాంకు ప్రహరీ దాటుకుంటూ వచ్చి బ్యాంకు గోడలకు అమర్చిన కిటికీల గ్రిల్స్‌ను తొలగించి లోపలికి చొరబడ్డారు. బ్యాంకులోని కౌంటర్లను తెరిచిచూడగా నగదు, విలువైన వస్తుసామగ్రి కనిపించకపోవడంతో వెళ్లిపోయారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతోపాటు పక్కనే ఉన్న శ్రీక్ష్మీ ఇంద్రస్ట్రీస్ స్టీమ్డ్ రైస్‌మిల్లులో సైతం చోరీకి యత్నించారు. పోలీసులు, ఫింగర్ ప్రింట్ విభాగం, క్లూస్‌టీం ఘటనాస్థలాలను పరిశీలించాయి. ఈ ఘటన అంతర్‌రాష్ట్ర దొంగలముఠా పనిగా పోలీసులు భావిస్తున్నారు.

# భవనాన్ని ఢీకొని.. కుప్పకూలిన విమానం

- కజకిస్థాన్‌లో దుర్ఘటన
- 12 మంది మృతి, 53 మందికి గాయాలు


కజకిస్థాన్ ప్రమాద ప్రాంతంలో విమానశకలాలను తొలగిస్తున్న సిబ్బంది

**అల్‌మటీ, డిసెంబర్ 27:** కజకిస్థాన్‌లో విమాన ప్రమాదం చోటు చేసుకున్నది. అల్‌మటీ విమానాశ్రయం నుంచి శుక్రవారం ఉదయం టేకాఫ్ అయిన "బేక్ ఎయిర్" విమానం కుప్పకూలిపోయింది. విమానాశ్రయానికి సమీపంలో ఉన్న రెండు అంతస్తుల భవనాన్ని విమానం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 12 మంది మృతిచెందగా, 53 మంది గాయపడినట్టు అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో విమానంలో 95 మంది ప్రయాణికులు, ఐదుగురు సిబ్బంది ఉన్నారు. విమానం అల్‌మటీ ఎయిర్‌పోర్టు నుంచి కజకిస్థాన్ రాజధాని నూర్‌సుల్తాన్‌కు బయల్దేరిన సమయంలో ప్రమాదం జరిగినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు నిర్ధారించారు. విమానం కుప్పకూలిన స్థలానికి చేరుకున్న అధికారులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప దవాఖానలకు తరలించారు. ప్రమాద ఘటనపై దర్యాప్తుకు అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. అల్‌మటీ విమానాశ్రయం నుంచి ఉదయం 7.05 గంటలకు బయల్దేరిన బేక్ ఎయిర్ విమానం రాడార్‌కు కనిపించకుండా అదృశ్యమైనట్టు, ఆ తర్వాత విమానాశ్రయానికి ఈశాన్య దిశలో ఉన్న ఓ రెండు అంతస్తుల భవనాన్ని ఢీకొట్టి కూలిపోయినట్టు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రమాదంలో మృతి చెందిన 12 మంది వివరాల్ని(మృతుల్లో కెప్టెన్ కూడా ఉన్నారు) దేశ అత్యవసర విభాగం విడుదల చేసింది. ఘటనలో 53 మంది గాయపడ్డారని, వీళ్లలో తొమ్మిది మంది పిల్లలున్నారని, క్షతగాత్రుల్లో 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నదని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. టేకాఫ్ అయ్యే సమయంలో విమానం చివరి భాగం రెండుసార్లు రన్‌వేను తాకిందని, ప్రమాదానికి పైలట్ తప్పిదం లేదా సాంకేతిక అంశాలు కారణమై ఉండొచ్చని ఉప ప్రధాని రోమన్ స్క్లయార్ మీడియా సమావేశంలో వెల్లడించారు. ప్రమాదం జరిగిన తర్వాత విమానం రెండు భాగాలుగా చీలిపోయిందని, చనిపోయిన వాళ్లలో ఎక్కువమంది మొదటి భాగంలోనే ఉన్నారన్నారు.



### కార్గిల్‌లో మొబైల్ ఇంటర్నెట్ పునరుద్ధరణ

**శ్రీనగర్, డిసెంబర్ 27:** కేంద్రపాలిత ప్రాంతం లడఖ్‌లోని కార్గిల్ జిల్లాలో 145 రోజుల తర్వాత మొబైల్ ఇంటర్నెట్ సేవలు శుక్రవారం నుంచి మళ్లీ అందుబాటులోకి వచ్చాయి. 370 ఆర్టికల్ రద్దు, జమ్ముకశ్మీర్ విభజన నేపథ్యంలో అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా తీసుకున్న చర్యల్లో భాగంగా ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. నాలుగు నెలలుగా అవాంఛనీయ సంఘటనలు జరుగకపోవడం, శాంతిభద్రతలు సాధారణ స్థితికి రావడంతో ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించినట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ సదుపాయాన్ని దుర్వినియోగం చేయవద్దని స్థానిక నేతలు ప్రజలకు విజ్ఞప్తిచేశారు.

### 'నాన్‌క్యాడర్' పదోన్నతుల డీపీసీ గడువు పొడిగింపు

- ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నాన్ క్యాడర్ అదనపు, సంయుక్త కార్యదర్శుల పదోన్నతుల కోసం ఏర్పాటుచేసిన డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. గతంలో ఏర్పాటుచేసిన కమిటీ గడువు ఈ నెల 31న ముగుస్తున్న నేపథ్యంలో తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఈ కమిటీలు ఉనికిలో ఉంటాయని ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శైలేంద్రకుమార్ జోషి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.





### నాసికరం పురుగు మందు 'పల్సర్' నిషేధం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇన్‌సెక్టిసైడ్స్ (ఇండియా) లిమిటెడ్‌కు చెందిన డి.0036 బ్యాచ్‌నంబర్ కలిగిన థైఫ్లూజమైడ్ అనే సాంకేతిక పేరు ఉన్న పల్సర్ క్రిమిసంహారక పురుగు మందు నాసిరకమైనదని రాజేంద్రనగర్ పురుగుమందుల పరీక్షా కేంద్రం గుర్తించింది. ఈ పురుగుమందును నిషేధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ విషయాన్ని రైతులు గుర్తించాలని, నాసిరకమైన పురుగుమందును నిల్వ చేయడం, విక్రయించడం చేయవద్దని హెచ్చరించింది.


# సంచారజాతులకు ఈ-ఆటోలు

- ఎంబీసీ కులాల యువతకు ఉపాధి కల్పన
- ఆర్థిక వనరులు పెంచుకొనేలా కార్యాచరణ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని అత్యంత వెనుకబడిన తరగతులకు చెందిన వారికి ఉపాధి కల్పించడంపై ఎంబీసీ కార్పొరేషన్ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. సంచార జాతుల యువతకు ఉపాధి శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణలోని పర్యాటక ప్రాంతాల్లో ఈ-ఆటోలను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. సంచార జాతులకు చెందిన యువత ఈ-ఆటోలు నడపడం ద్వారా ఆదాయవనరులు పెంచుకొనేలా ఎంబీసీ కార్పొరేషన్ ప్రోత్సహించనున్నది. ఇందుకుగాను రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలైన బాసర, యాదాద్రి, భద్రాచలం, కాళేశ్వరం-భూపాలపల్లి, జగిత్యాల జిల్లా ధర్మపురి, కొండగట్టు, వరంగల్ రూరల్ జిల్లా రామప్ప, లక్నవరం, వరంగల్ అర్బన్ జిల్లా భద్రకాళి ఆలయం పరిధిలోని స్థానిక సంచార జాతుల యువతకు ఈ-ఆటోల ద్వారా ఉపాధి అవకాశం కల్పించనున్నారు. ఎంబీసీ కులాలకు చెందిన 10వ తరగతి పాసై 21-45 ఏండ్ల వయసుండి డ్రైవింగ్ లైసెన్స్ కలిగిఉన్న వారికి ఈ ఆటోలను కేటాయించనున్నారు. ఇంటర్ వరకు చదివి ఏదైనా పనిలో స్థిరపడేందుకు వీలుగా యువతకు పలు అంశాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని సంచార జాతుల యువతకు ఉపాధి కల్పనలో భాగంగా మెట్రోరైల్వే స్టేషన్లలో టీ స్టాళ్లను ఏర్పాటుచేసుకొనేందుకు అవకాశం కల్పించనున్నారు. స్వయం ఉపాధికి అర్హత ఉన్న సంచార జాతులు ప్రధానంగా.. బాలసంతు, బహురూపి, బుడబుక్కల, దాసరి, దొమ్మరి, గంగిరెద్దుల, జంగం, జోగి, కాటిపాపల, మొండిబండి, మొండి, వంశరాజు, పాములు, పార్ధీ, పంబాల, దేవర పెద్దమ్మల, వీరభద్రీయ, గుడాల, కంజరభట్ట, మొండిపట్టు, పరిగముగ్గల, యాట, నొక్కర్, పాల ఎకిరి, కైకాడి చొప్మారే, జోషినంది వాలి, మందుల, కూనపులి, పత్ర, రాజన్నల, గోత్రాల, బుక్క, అయ్యవారు, కాశికాపుడి, సిద్దుల, సికిలిఘర్ కులాలవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

### పర్యావరణహితంగా ఉపాధి



పర్యావరణహితంగా వాహనాలు నడిపి ఆర్థికంగా ఎదిగేందుకు సంచార కులాలకు చెందిన యువతకు ఈ-ఆటోలను అందించేందుకు ప్రణాళికలు రూపొందించాం. ప్రధానంగా తెలంగాణలోని పర్యాటక ప్రాంతాల్లో ఈ-ఆటోలు నడిపేలా దృష్టిపెట్టాం. ఇందుకోసం ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్నవారిని ఎంపిక చేసి ఆటోల నిర్వహణ ద్వారా అభివృద్ధి చెందేలా చర్యలు చేపడుతున్నాం. ఈ కార్యక్రమాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించాం.

**- అలోక్‌కుమార్, ఎండీ, ఎంబీసీ కార్పొరేషన్**

## ఐటీడీఏ పరిధిలో ఉద్యోగావకాశాలు

- 10 వరకు దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో గిరిజనుల ఉత్పత్తులకు సంబంధించి పలు విభాగాల్లో పనిచేసేందుకు ఐటీడీఏ పరిధిలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ క్రిస్టినాఝడ్ చోంగ్తూ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థ ఐటీడీఏ పరిధిలో కార్యనిర్వాహక సిబ్బంది అవసరమని, పోస్టులు, అర్హత వంటి వివరాలను అభ్యర్థులు www.twd.telangana.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను mktgtsgcc@gmail.com మెయిల్‌కు జనవరి 10 వరకు సమర్పించాలని కమిషనర్ పేర్కొన్నారు.



ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

## మూడు క్వింటాళ్ల గంజాయి పట్టివేత

**ఖమ్మం రూరల్, నమస్తేతెలంగాణ:** ఖమ్మం జిల్లాలో అక్రమంగా తరలిస్తున్న రూ.36లక్షల విలువైన మూడు క్వింటాళ్ల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఏసీపీ వెంకటరెడ్డి వివరాలు వెల్లడించారు. ఒడిశా నుంచి ఢిల్లీకి గంజాయి అక్రమంగా తరలించేందుకు బిస్కెట్‌ప్యాకెట్లు రవాణాచేసే ఓ కంటైనర్‌లో ఈ నెల 25న 150 ప్యాకెట్లలో గంజాయిని సిద్ధంచేశారు. కంటైనర్‌ను నాగపూర్ మీదుగా వయా ఖమ్మం నుంచి ఢిల్లీకి తరలించేందుకు ప్రణాళిక రచించారు. శుక్రవారం ఉదయం రూరల్ సీఐ సత్యనారయణరెడ్డికి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీస్‌స్టేషన్ ఎదుట వాహనాల తనిఖీ చేపట్టారు. భారీ కంటైనర్ రావడంతో పోలీసులు అప్రమత్తమై అపి తనిఖీచేశారు. కంటైనర్‌లో వెనుకభాగం బిస్కెట్ ప్యాకెట్ల లోడ్‌తో కప్పివేసిన మూడు క్వింటాళ్ల గంజాయిని గుర్తించారు. పట్టుబడిన గంజాయిని స్వాధీనం చేసుకొన్నారు. నిందితులపై కేసు నమోదు చేస్తున్నట్టు ఏసీపీ వెంకటరెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉన్నదని చెప్పారు. సమావేశంలో రూరల్ సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్సై బాణాల రాము, ఏఎస్సై వెంకటేశ్వరరావు, నరేశ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, జానకీరాములు తదితరులు పాల్గొన్నారు.

### కనకదుర్గమ్మ ఆలయంలో చోరీ

- హుండీ పగలగొట్టి నగదు అపహరణ
- భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో ఘటన



**సారపాక:** భద్రాద్రికొత్తగూడెం జిల్లా సారపాకలోని గాంధీనగర్‌లో ఉన్న శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు హుండీని పగలగొట్టి నగదు అపహరించుకెళ్లారు. ఆలయ పూజారి, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఎప్పటిలాగే పూజారి వెల్ది సాయిశర్మ ఆలయానికి తాళం వేశారు. శుక్రవారం ఉదయం 6.45 గంటల సమయంలో ఆలయ తలుపులు తెరిచి చూడగా హుండీ కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వెతుకగా సమీపంలో హుండీ పగలుగొట్టినట్టు కనిపించింది. హుండీని పరిశీలించగా భక్తులు కానుకల రూపంలో సమర్పించిన నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్టు గుర్తించారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై బమ్మెర బాలకృష్ణ తెలిపారు. హుండీలోని సుమారు రూ.10 వేల వరకు భక్తుల కానుకలు చోరీకి గురయ్యాయని ఆలయ పూజారి ఫిర్యాదులో పేర్కొన్నారు.

epaper.ntnews.com

నమస్తే తెలంగాణ
# చిత్రం
[ కరీంనగర్ ]
శనివారం 28 డిసెంబర్ 2019

# సింగిల్.. రెడీ టు మింగిల్



నితిన్, రష్మిక మందన్న

నితిన్, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న చిత్రం 'భీష్మ'. వెంకీ కుడుముల దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో 'హై క్లాస్ నుంచి లో క్లాస్ దాకా నా క్రష్‌లే వందల్లో ఉన్నారులే..ఒకళ్లు సెట్టవ్వలే...సింగిలే ఐ యామ్ రెడీ టూ మింగిలే. లైఫ్‌కు లేవే రంగులే...' అంటూ సాగే తొలి గీతాన్ని చిత్రబృందం శుక్రవారం విడుదలచేసింది. శ్రీమణి సాహిత్యాన్ని సమకూర్చిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి ఆలపించారు.మహతి స్వరసాగర్ సంగీతాన్ని అందించారు. దర్శకుడు మాట్లాడుతూ 'రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. నితిన్, రష్మిక మందన్న కెమిస్ట్రీ ఆకట్టుకుంటుంది. సింగిల్ యాంథమ్ పేరుతో విడుదలైన తొలి పాటకు చక్కటి స్పందన లభిస్తున్నది. నిర్మాణానంతర కార్యక్రమాలు ముగింపు దశకు చేరుకున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో సినిమాను విడుదలచేస్తాం' అని తెలిపారు. పూర్తిస్థాయి వినోదభరిత చిత్రమిదని, యువతీయువకులంతా కనెక్ట్ అయ్యేలా నాయకానాయికల పాత్రలు ఉంటాయని నిర్మాతలు అన్నారు. నరేష్, సంపత్, రఘుబాబు, బ్రహ్మాజీ, వెన్నెలకిషోర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం:సాయిశ్రీరామ్, సంగీతం:మహతి స్వరసాగర్, ఎడిటింగ్: నవీన్ నూలి.




# నాన్న పేరు చెడగొట్టకుండా..

ఫైనల్ ఎగ్జామ్స్ రాసి రిజల్ట్ కోసం ఎదురుచూస్తున్న అనుభూతికి లోనవుతున్నానని చెప్పారు నటరాజ్. ఆయన కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'ఊల్లాల ఊల్లాల'. సత్యప్రకాష్ దర్శకుడు. గురురాజ్ నిర్మిస్తున్నారు. జనవరి 1న విడుదలకానుంది. శుక్రవారం హైదరాబాద్‌లో నటరాజ్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'సినిమాలో కన్ఫ్యూజన్, క్లారిటీ కలిగిన యువకుడిగా నా పాత్ర విభిన్నంగా ఉంటుంది. సినిమాలపై ఇష్టంతో దర్శకుడు అవ్వాలని కలలు కంటుంటాడు. తాను పెళ్లిచేసుకునే అమ్మాయి కోటీశ్వరురాలై ఉండాలని ఆశిస్తాడు. అలాంటి యువకుడు స్వచ్ఛమైన ప్రేమ గొప్పతనాన్ని ఎలా తెలుసుకున్నాడన్నది ఆకట్టుకుంటుంది. రొమాంటిక్ సన్నివేశాలు యువతను అలరిస్తాయి. నాన్న ఈ సినిమాకు దర్శకుడైనా సెట్‌లో మాత్రం మా మధ్య డైరెక్టర్, యాక్టర్‌లతో కూడిన వృత్తిపరమైన బంధమే ఉండేది. షూటింగ్‌కు ప్యాకప్ చెప్పిన తర్వాతే మళ్లీ తండ్రీకొడుకుల్లా ఉండేవాళ్లం. నటనపరంగా నాన్న ఇచ్చిన సలహాలు చాలా ఉపయోగపడ్డాయి. ఆయన పేరు చెడగొట్టకుండా జాగ్రత్తగా నటించాను. 'నటరాజ్ నా తనయుడు' అని నాన్న గర్వంగా చెప్పుకునే స్థాయికి ఎదగాలన్నదే నా లక్ష్యం. కన్నడంలో రాక్‌లైన్ వెంకటేష్ నిర్మించిన సినిమాతో కథానాయకుడిగా మారాను. హీరోగా ఇది నా రెండో సినిమా. తెలుగులో 'అమ్మ దీవెన' అనే మరో సినిమాలో నటిస్తున్నాను. మదర్ సెంటిమెంట్ నేపథ్యంతో సాగుతుంది. అలాగే మరో రెండు సినిమాలు చర్చలు దశలో ఉన్నాయి' అని అన్నారు.

# నరసింహ యుద్ధం

'కల్తీ మందుల ద్వారా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న సంఘవిద్రోహశక్తులపై రాజా నరసింహ ఎలాంటి పోరాటం సాగించాడో తెలియాలంటే మా సినిమా చూడాల్సిందే' అంటున్నారు నిర్మాత సాధుశేఖర్. జై చెన్న కేశవ పిక్చర్స్ పతాకంపై ఆయన నిర్మించిన చిత్రం 'రాజా నరసింహ'. మలయాళ చిత్రం 'మధుర రాజా'కు అనువాదమిది. మమ్ముట్టి కథానాయకుడు. వైశాఖ్ దర్శకుడు. జనవరి 1న విడుదలకానుంది. నిర్మాత మాట్లాడుతూ 'సందేశాత్మక కథాంశంతో రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది.మమ్ముట్టిపై తెరకెక్కించిన పోరాట ఘట్టాలు, సన్నీలియోన్ ప్రత్యేక గీతం సినిమాకు ప్రధానాకర్షణగా నిలుస్తాయి' అన్నారు.





# 'వైల్డ్ డాగ్' విజయ్‌వర్మ

అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ విజయ్ వర్మ సీక్రెట్ ఇన్వేస్టిగేషన్ మొదలుపెట్టారు. ఆయన అన్వేషణ ఎందుకోసమన్నదే ఈ చిత్ర ఇతివృత్తం' అని అంటున్నారు నాగార్జున. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'వైల్డ్ డాగ్'. మ్యాట్నీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిరంజన్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి నిర్మిస్తున్నారు. అహిషోర్ సాల్మోన్ దర్శకుడు. శుక్రవారం నాగార్జున ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదలచేసింది.ఇందులో ఎన్ఐఏ అధికారిగా చేతిలో తుపాకితో వార్త పత్రికలో ప్రచురితమైనట్లుగా ఉన్న నాగార్జున ఫొటో ఆసక్తిని రేకెత్తిస్తుంది. వైవిధ్యమైన లుక్‌లో ఆయన కనిపిస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'ఈ సినిమాలో నాగార్జున వైల్డ్‌డాగ్ విజయ్ వర్మ అనే పోలీస్ అధికారిగా కనిపించబోతున్నారు.యథార్థ ఘటనల ఆధారంగా సృష్టించిన ఆయన పాత్ర నవ్యరీతిలో ఉంటుంది. రహస్య పోలీస్ ఆపరేషన్‌లో విజయ్‌వర్మకు ఎలాంటి పరిణామాలు ఎదురయ్యాయన్నది ఉత్కంఠను పంచుతుంది. తొలి షెడ్యూల్ పూర్తయింది' అని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: షానియల్ డియో, డైలాగ్స్:కిరణ్‌కుమార్.



శంకర్‌ప్రసాద్, ఉషా, నాగశౌర్య, రమణతేజ, బుజ్జి

# అమ్మానాన్న గర్వపడే సినిమా

**- నాగశౌర్య**

'అందరూ నన్ను లవర్‌బాయ్ అంటుంటే చిరాకుగా ఉంది. అది నా మనస్తత్వం కాదు. లవర్ బాయ్ ట్యాగ్ నుంచి బయటకు రావాలనే ఆలోచనతో సొంతంగా కథలను రాసుకుంటున్నాను. 'ఛలో' సినిమాతో కొంత బయటకువచ్చాను. 'అశ్వథ్థామ'తో ఆ ఇమేజ్ పూర్తిగా తొలగిపోతుందనే నమ్మకముంది' అని అన్నారు నాగశౌర్య. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'అశ్వథ్థామ'. ఐరా క్రియేషన్స్ పతాకంపై శంకర్ ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఉషా ముల్పూరి నిర్మిస్తున్నారు. రమణతేజ దర్శకుడు. ఈ సినిమా టీజర్‌ను ట్విట్టర్ ద్వారా కథానాయిక సమంత విడుదలచేశారు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో చిత్రబృందం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించింది. నాగశౌర్య మాట్లాడుతూ 'ఇదే వేదికపై'ఛలో' టీజర్‌విడుదలచేశాం. బ్లాక్‌బస్టర్ అయ్యింది. 'నర్తనశాల' విడుదలచేస్తే డిజాస్టర్ అయ్యింది. మళ్లీ ఈ వేదికపై ఉండి గర్వంగా మంచి సినిమా చేశానని చెబుతున్నాను. ఢిల్లీ, ముంబాయిలో జరిగిన యథార్థ ఘటనల నుంచి స్ఫూర్తి పొంది ఈ కథ రాశాను. అమ్మాయిల రక్షణ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే పాయింట్‌తో ఆసక్తిని రేకెత్తిస్తుంది. నేను చేసిన తొలి కమర్షియల్ సినిమా ఇది. నా తల్లిదండ్రులు తలదించుకోకూడదని చాలా జాగ్రత్తలు తీసుకొని కథ రాశాను. నంబర్స్, కమర్షియల్ సక్సెస్, బ్లాక్‌బస్టర్‌లకు అతీతంగా మా అబ్బాయి మంచి కథ రాసి నటించిన సినిమా ఇదని అమ్మానాన్న గర్వంగా చెప్పుకునేలా ఉంటుంది. ఇప్పటికే వారు ఆ అనుభూతిని ఆస్వాదిస్తున్నారు. మా తల్లిదండ్రులకు ఈ సినిమా చాలా నచ్చింది. మోహరిన్ పాత్ర అందంగా ఉంటుంది. 'ఛలో' సినిమాకు కథ రాశాను. కానీ నా పేరు వేసుకోలేదు. ఆ తప్పు మళ్లీ జరగకూడదని ఈ సినిమాలో రచయితగా నా పేరు వేసుకున్నాను' అని అన్నారు. నాగశౌర్య నటవిశ్వరూపాన్ని ఆవిష్కరించే చిత్రమిదని, ఈ సినిమాలో అతడి పాత్ర వినూత్నపంథాలో ఉంటుందని దర్శకుడు పేర్కొన్నారు. 'కథను నమ్మి అత్యున్నత నిర్మాణ ప్రమాణాలతో ఈ సినిమాను రూపొందించాం. ఇటీవల విడుదలైన పాట, పోస్టర్స్‌కు మంచి స్పందన లభిస్తున్నది. జనవరి 31న సినిమాను విడుదలచేయనున్నాం' అని నిర్మాత తెలిపారు. ఈ కార్యక్రమంలో బీవీఎస్ రవి, గ్యారీ బీ హెచ్, యతీష్, బుజ్జి, మనోజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.















epaper.ntnews.com